

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఖమ్మం

fb.com/vaartha Digital



మానసాదేవి ఆలయంలో తొక్కిసలాట, ఆరుగురి మృతి

నేను మాట్లాడిన తర్వాతే థాయ్, కాంబోడియాల కాల్పుల విరమణ: ట్రంప్ 5



Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-7-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 177 పేజీలు: 8+16 వెల: 6.50


## అంతరిక్ష రంగంలో స్టార్టప్‌లు 200

### చిన్నారుల్లో పెరుగుతున్న ఆసక్తి

### సైన్స్‌డేకు నమోయాప్‌లో సలహాలివ్వండి

### మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, జూలై 27:** దేశ మంతటా పిల్లల్లో అంతరి క్షంపట్ల కొత్త ఉత్సుకత పెరుగుతోందని నేడు అం తరిక్ష రంగం లో 200కి పైగా స్టార్టప్‌లు వచ్చాయ ని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ప్రతి నెలా చివ రి ఆదివారం నిర్వహించే మన్‌కీ బాత్ 124వ ఎపిసోడ్‌లో ప్రసంగించిన ప్రధా ని, ఇటీవల అంతరిక్షం నుంచి తిరిగి వచ్చిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లాపై ప్రశంసలు కురిపిం చారు. ఆయన ప్రయాణం దేశ ప్రజలకు గర్వకారణమన్నారు. ఆగస్టు 23వ తేదీన నేషనల్ స్పేస్‌డేను దృష్టిలో పెట్టుకొని ప్రజలు సలహాలు, సూచనలు పంపాలని మోదీ పిలుపునిచ్చారు. ఇందుకు నమో యాప్‌ను వాడుకోవాలన్నారు. స్వావలంబన మార్గం ద్వారా వికసిత్ భారత్ పయనిస్తోందని చెప్పారు. వోకల్ ఫర్ లోకల్ అనేది ఆత్మనిర్భర్ భారత్‌కు బలమైన పునాది అని ప్రధాని పునరుద్ఘాటించారు. గత కొన్ని వారాల్లో క్రీడలు, సైన్స్, సాంస్కృతిక రంగాల్లో భారతీయులు గర్వపడేలా చాలా జరిగాయి. ఇటీవల శుభాంశు శుక్లా అంత రిక్షం నుంచి తిరిగి రావడంపై దేశంలో చాలా చర్చ జరిగింది. శుభాంశు భూమిపై సురక్షితంగా దిగిన వెంటనే ప్రజలు ఆనం దంతో గంతులు వేశారు. నాకు ఇంకా గుర్తుంది 2023 ఆగస్టులో చంద్రయాన్3 విజయవంతంగా జాబిల్లిపై ల్యాండ్ అయినప్పుడు దేశంలో ఒక కొత్త వాతావరణం ఏర్పడింది. పిల్లల్లో సైన్స్, అంతరిక్షం గురించి కొత్త ఉత్సుకత మేల్కొంది. మేము అంతరిక్షానికి వెళతాం, మేము చంద్రునిపై కాలు పెడతాం, మేము వ్యోమగాములు అవుతామని ఇవాళ చిన్న చిన్న పిల్లలు చెబుతున్నారు. దేశంలో అంతరిక్ష రం గంలో అంకుర సంస్థలు వేగంగా అభివృద్ధి >>2



తమిళనాడులోని గంగైకొండ చోళపురం ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేసిన ప్రధాని మోదీ

### 'ఆపరేషన్ సింధూర్'తో ప్రపంచానికి భారత్ సత్తా తెలిసింది

ప్రధాని మోదీ 2

# నేడు సర్కార్‌కు కాళేశ్వరం నివేదిక?



### ప్రభుత్వానికి నేడు సమర్పించనున్న జస్టిస్ పిసి ఘోష్?.. కేబినెట్‌లో ప్రవేశపెట్టే అవకాశం?



### విజిలెన్స్, ఎన్‌డిఎస్‌ఎ నివేదికలతో చర్యలు ప్రారంభించిన ప్రభుత్వం

### ఓవైపు ఎసిబితో, మరోవైపు శాఖపరమైన చర్యలతో బాధ్యులపై ఒత్తిడి

### కాళేశ్వరం బ్యారేజిలు పరిశీలించిన సిడబ్ల్యుపిఆర్‌ఎస్ సాంకేతిక నిపుణులు

**హైదరాబాద్,జూలై 27,ప్రభాతవార్త:** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వైఫల్యంపై విచారణ జరిపిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ నివేదిక సిద్ధం చేసి తెలంగాణ ప్రభుత్వంకు అందజేయడానికి తుదిమెరు గులు దిద్దడంతో సర్వత్రా అనిశ్చితి నెలకొంది. పినాకి చంద్రఘోష్ తుది నివేదిక అందజేయడానికి ఆదివారం హైదరాబాద్ రాగా ఆయ నకు డిప్యూటి ఇఎన్‌సి శ్రీనివాస్, సిఇ విజయభాస్కర్‌రెడ్డిలు విమా నశ్రయంలో లాంఛనంగా పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలి కారు. సోమవారం ఉదయం ప్రభుత్వంకు ఆయన నివేదిక అందిస్తే దానిని కెబినెట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉంటుందని భావిస్తున్నా రు. కాళేశ్వరం బ్యారేజిల నిర్మాణ లోపాలు, డిజైన్లు, నాణ్యతాప్రమా ణాలు, ఆర్థిక అంశాలపై విచారణచేశారు. కాగ్, ఎన్‌డిఎస్‌ఎ విజి లెన్స్ నివేదికలు కూడా ప్రామాణికంగా తీసుకొన్నారు. పిసిఘోష్ విచారణ కమిషన్‌ను 2024 మార్చిలో 3నెలల కాలపరిమితితో మొదట నియమించారు. లోక్‌సభ ఎన్నికలు కారణంగా అధికారులు అందుబాటులో లేకపోవడం, ఎన్నికల కోడ్ ఉండటంతో నిర్ణీత సమయంలో విచారణ ముందుకు సాగలేదు. 2024 ఆగస్టు నెల నుంచి నీటిపారుదలశాఖ ఇంజనీర్లను, పే అండ్ అకౌంట్స్, ఆర్థిక శాఖ, ఐఎఎస్, రిటైర్డు ఐఎఎస్, రిటైర్డు ఇంజనీర్లను, కాంట్రాక్టు సంస్థ లను విచారణ జరిపారు. దీని కోసం ఆరు పర్యాయాలు మే 31 2025 వరకు ఆయన విచారణ కాలపరిమితి పొడింగాల్సి వచ్చిం ది. ఐనప్పటికి ఆనాటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు, ఆనాటి నీటి పారుదలశాఖ, ఆర్థికశాఖ మంత్రుల విచారణ చేయడానికి పరిమిత సమయంలో వీలుకాకపోడంతో ఏడోసారి విచారణ జూలై 31 వరకు కాలపరిమితి పెంచారు. జూన్ రెండోవారంలోనే గత ప్రభు త్వంలో ఆర్థిక మంత్రులుగా పనిచేసిన ఈటెలరాజేందర్, హారీష్‌రా వులను అదే విధంగా నీటిపారుదలశాఖ మంత్రిగా పనిచేసినహరీష్ రావు, నీటిపారుదలశాఖ తన దగ్గరే పెట్టుకొన్న ముఖ్యమంత్రి కెసి ఆర్‌ను విచారణ చేశారు. జూన్12న కెసిఆర్ 115వసాక్షిగా విచారణ కమిటీ ముందుకు వచ్చి సవివరంగా విషయాలు జస్టిస్ ముందు వివరించారు. అఫిడవిట్ కూడా అందించారు. బిజెపి ఎంపి, ఆనాటి ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ విచారణ కమిటి ముందు కేబినెట్ అనుమతితోనే కాళేశ్వరం నిర్మించామని ఇది రాజకీయ నిర్ణయం కాదని ఆనాటి కెబినెట్ సమిష్టిబాధ్యత అని >>2




కొత్తగూడెంలో ఆదివారం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డి.సిఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి

## రైతులకు సరిపడా యూరియా అందించే బాధ్యత సర్కార్‌దే

### అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

### ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### ఇందిరమ్మ ఇండ్లు చారిత్రాత్మక పథకం

### ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారుల సమీక్షలో డి. సిఎం భట్టి

**కొత్తగూడెం, జూలై 27 - ప్రభాతవార్త:** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పురోగతిపై పాల్వంచలోని ఐడిఓసి సమావేశ మందిరంలో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ మరియు చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమీక్షలో జిల్లాల్లో వర్షాభావం, వరద ముంపు, సీజనల్ వ్యాధులు, ఎరువుల సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రేషన్ కార్డుల పం పిణీ, వనమహోత్సవ కార్యక్రమం, విద్యా రంగ అభివృద్ధి తదితర అంశాలపై సమగ్రంగా చర్చించబడింది. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దుర్శెట్టి పవర్ పాయిం ట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రులకు జిల్లాల ప్రస్తుత పరిస్థితులపై వివరాలు ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భారీ వర్షాలు, వరదలను ఎదుర్కొనేందుకు యాక్షన్ ప్లాన్‌తో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఇందిరా సౌర జలవి కాసం పథకం కింద ఈ రైతులకు సోలార్ పంపులు, డ్రిప్, స్ప్రిం క్లర్లు, ఉద్యానపంటల సాగుకు ఉచితంగా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. మూడు సంవత్సరాల్లో రూ.12,600 కోట్లు ఖర్చు చేసే ఈ పథకం ద్వారా గిరిజన రైతుల అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి జిల్లాలో మహిళా సంఘాల ద్వారా చేపల పెంపకాన్ని ప్రోత్స హించేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు 25 ఎకరాల స్థలంలో నిర్మించా లని, ఈ పాఠశాలలు ఇతర విద్యా సంస్థలకు ఆదర్శంగా ఉండేలా అభివృద్ధి చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై వర్షాకాలంలో ప్రత్యే క దృష్టి అవసరమని, వైద్య పరీక్షలు నిరంతరం నిర్వహించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా పేదల సంక్షేమానికి, పేదలను ఆర్థికం గా అభివృద్ధి పరచడానికే మహాలక్ష్మీ పథకం, 500 కే గ్యాస్ బండ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మీ పథకం కింద ఇప్పటివరకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు మహిళలు >>2

## ప్రాణహిత పరవళ్లు..

### సుంకేసుల జలాశయానికి వరద


### శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా నీరు.. ఒక గేటు ఎత్తివేత



**హైదరాబాద్,జూలై 27,ప్రభాతవార్త:** మహారాష్ట్ర, తెలంగాణతో పాటు మంచిర్యాల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద పోటె త్తింది. దీంతో అధికారులు ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి దిగువ కు నీరు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేశుల నుంచి శ్రీశైలానికి 90,692 క్యూసెక్కుల వరద వస్తున్నది. దీంతో 1,12,976 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడు దల చేస్తున్నారు. స్పిల్‌వే ద్వారా 26,744 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 20 వేల క్యూసె క్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,917 క్యూసెక్కులు దిగువకు వెళ్తున్నది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 882.10 అడుగుల వద్ద ఉన్నది. అదేవిధంగా ప్రాజెక్టు గరిష్ఠ నీటి నిల్వ 215.80 టీఎంసీలకు గాను ఇప్పుడు 199.27 టీఎంసీలు ఉన్నాయి. శనివారం రాత్రి భారీగా వరద ఉం డటంతో అధికారులు రెండు గేట్లు ఎత్తివేశారు. అయితే ఆది వారం ఉదయానికి ప్రవాహం తగ్గడంతో ఒకగేటును మూసి వేశారు. దీంతో ప్రస్తుతం ఒకగేటు గుండా 26,744 క్యూసె క్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తు న్నారు. ఈ నెల 8న శ్రీశైలం డ్యామ్ గేట్లను >>2

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

### నలుగురు నక్సల్స్ మృతి



**చర్ల, ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజా పూర్ జిల్లాలో గంగలూరు పోలీసు స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో భద్రతా బల గాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకా ల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో నలు గురు మావోయిస్టులు మృతిచెందారు. ఇం దులో ఇద్దరు మహిళలు ఉన్నారు. మృతి చెందిన వారిలో ఏరియా కమిటీ మెంబర్లు ముగ్గురు, మరో సభ్యుడు మృతిచెందారు. మృతిచెందిన ఇద్దరు మహిళలపై రూ.17 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ మాట్లాడుతూ.. గంగ లూరు పరిధిలోని అటవీ >>2



### కొత్తగా రేషన్ కార్డులు పొందిన కుటుంబాలకు త్వరలో ఆరోగ్యశ్రీ సేవలు 2

### మరో సంక్షేమ గురుకులంలో ఫుడ్ పాయిజనింగ్ 2

79 మంది విద్యార్థులకు అస్వస్థత..

ఆసుపత్రికి తరలింపు

## మరో ఇద్దరు రైతుల ఆత్మహత్యలు



**హైదరాబాద్,జూలై 27, ప్రభాతవార్త:** తెలంగాణలో రైతుల ఆత్మహ త్యలు కొనసాగు తూనే ఉన్నాయి. మూడు రోజుల క్రితం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అప్పుల బాధను తట్టుకోలేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడగా, తాజాగా మరో ఇద్దరు అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్ప డ్డారు. అప్పులు తెచ్చి పంటలు సాగు చేయ గా సరైన దిగుబడి రాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది తెలంగాణలోని వేర్వేరు ప్రాం తాలకు చెందిన ఇద్దరు రైతులు బలవన్మ రణానికి పాల్పడ్డారు. రాష్ట్రంలోని నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం సుర్జాపూర్ గ్రామానికి చెందిన సంఘ రాములు (65) పంట దిగుబడి రాక, చేసిన అప్పులు 20 లక్షల రూపాయల వరకు చేరుకోవడంతో మనస్తాపానికి గురయ్యారు. పొలంలోనే మంచె గుంజకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అలాగే >>2




# సరోగసీ ముసుగులో 'సృష్టి' మోసం!


### పిల్లలు లేని దంపతుల ఆశలను క్యాష్ చేసుకుంటున్న వైనం

- వెలుగులోకి సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ లీలలు
- డిఎన్‌ఎ టెస్ట్‌తో బయటపడిన డాక్టర్ మోసాలు
- సంతానం కోసం రూ.లక్షల్లో ఫీజు వసూళ్లు
- డబ్బు ఆశ చూపి నవజాత శిశువుల కొనుగోలు
- ఎవరైనా ప్రశ్నిస్తే ఇక అంతే సంగతులు
- కేసు నమోదు.. డాక్టర్ సహా పలువురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన నార్త్‌జోన్ డిసిపి రష్మీ



ఆదివారం మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న నార్త్ జోన్ డిసిపి రష్మీ పెరుమాళ్

**హైదరాబాద్, కంటోన్మెంట్, జులై 27, ప్రభాతవార్త:** సంతానం కోసం వచ్చిన దంపతులను ఐవిఎఫ్, సరోగసీ తదితర పేర్లతో మోసం చేస్తున్న కిలాడీ వైద్యురాలు ఎట్టకేలకు పోలీసులకు చిక్కింది. యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ వ్యవహారంలో తవ్వేకొద్ది అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఫెర్టిలిటీ సెంటర్ల మోసాల తీరు, నవజాత శిశువుల విక్రయాలపై నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ ఆదివారం >>2




## రెండు దశల్లో 'స్థానిక' పోరు

### ఏర్పాట్లు ముమ్మరం చేసిన అధికారులు

### కొత్త ఓటర్ల జాబితా సిద్ధం

**హైదరాబాద్, జులై 27, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్ని కలను రెండు దశల్లో నిర్వహించాలని తెలంగాణ సర్కార్ ప్రతిపాదించింది. బ్యాలెట్ బాక్సుల లభ్యత, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది ప్రణాళికపై దృష్టి సారించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల తుది జాబితా తయారీని వేగవంతం చేసింది. ఆరు నెలల్లో మరణించిన వారి పేర్లు తొలగించి, కొత్త ఓటర్లను నమోదు చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామంయూనిట్‌గా వార్డుల వారీగా జాబితాను రూపొం దిస్తున్నారు. కొత్త ఓటర్ల చేరికతో మొత్తం సంఖ్య పెరిగే అవకాశం ఉంది. తెలంగాణలో ఎంపీ టీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలను రెండు దశల్లో నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదించింది. గతంలో మూడు దశల్లో జరిగిన ఎన్నికలు జరగ్గా.. ఈసారి రెండు దశల్లోనే ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు పంచాయతీరాజ్ శాఖ ఎన్నికల సంఘానికి తెలిపింది. దీనికి అనుగుణంగా అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని సీఈఓలు, డీపీవోలకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సుల లభ్యత, కేటాయింపులను సమీక్షించా లని, ఏదైనా అదనపు బాక్సులు అవసరమైతే వెంటనే రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించా లని పంచాయతీరాజ్‌శాఖ పేర్కొంది. అలాగే, పోలింగ్ కేంద్రాల ఎంపిక, కేటాయింపులు, >>2



ఆదివారం ముంబయిలో శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాకరేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ థాకరే

# ప్రాణహిత పరవళ్లు..

>> మొదటిసారి ఎత్తిన విషయం తెలిసిందే. మొత్తం నాలుగు (6, 7, 8, 11) గేట్లను నీటిని విడుదల చేశారు. అనంతరం వరద తగ్గుముఖం పట్టడంతో గేట్లను మూసివేశారు. కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో ప్రాణహిత పరవళ్లు తొక్కుతోంది. నదిలో వరద ప్రవాహం అధికంగా ఉండటంతో సరిహద్దు ప్రాంతాల ప్రజలు నాటు పడవల ద్వారా మహారాష్ట్రకు సాగించే రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం లెనిన్ కాలనీవెంకట చెరువు ఆటవీ ప్రాంతంలో కొండల నుంచి వస్తున్న వర్షపు నీటితో సోమాలమ్మ జాలువారుతోంది. కనువిందు చేస్తున్న ఈ జలపాతం వద్దకు చేరుకోవాలంటే చర్ల నుంచి వెంకట చెరువు గ్రామం వరకు 5 కిలోమీటర్ల మేర రహదారి ఉంటుంది. తర్వాత మూడు కిలో మీటర్లు అడవిలో నడిచి వెళ్లాలి. స్థానికంగా ఉన్న పర్యాటకులు తరలివచ్చి జలపాతంలో స్నానాలు చేస్తున్నారు. ఎగువన తుంగభద్ర డ్యామ్ నుంచి పెద్దఎత్తున నీటిని విడుదల చేస్తుండటంతో జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి శివారులోని సుంకేసుల జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. ఆదివారం 48 వేల క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లోగా వచ్చి చేరుతోంది. దీంతో 12 గేట్లను ఒక మీటరు మేర ఎత్తి 47,800 క్యూసెక్కుల నీటిని దిగువనున్న శ్రీశైలం జలాశయానికి విడదుల చేస్తున్నట్లు డ్యామ్ అధికారులు తెలిపారు.

**తెలంగాణకు ఎల్లో అలర్ట్‌తో వానహెచ్చరిక**

తెలంగాణలో రాగల రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్క భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వివరించింది. సోమవారం నుంచి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది.

## కొత్తగా రేషన్ కార్డులు పొందిన కుటుంబాలకు త్వరలో ఆరోగ్యశ్రీ సేవలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై27:** తెలంగాణలో కొత్తగా రేషన్ కార్డులు పొందిన కుటుంబాలకు త్వరలో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయంపై వైద్య, ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ఇప్పటి వరకు రేషన్ కార్డుల్లో నమోదైన కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందుతున్న సంగతి తెలిసిందే. అయితే 2025 జనవరి 1 నాటికి రాష్ట్రంలో ఉన్న మొత్తం 89.95 లక్షల రేషన్ కార్డులకు అనుబంధంగా 2.81 కోట్ల మంది పేర్లు ఆరోగ్యశ్రీ పోర్టల్‌లో నిక్షిప్తమయ్యాయి. వీరికి నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా నిబంధనల మేరకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి. ఈ ఏడాది జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు సుమారు 6 లక్షల కొత్త కార్డులు జారీ కాగా, వాటితో కలిసి మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 95.56 లక్షలకు చేరుకుంది. ఇందులో కొత్తగా చేరిన లబ్ధిదారుల సంఖ్య 30 లక్షలు. వీరి వివరాలు త్వరలో ఆరోగ్యశ్రీ పోర్టల్‌లోకి ఎక్కించనున్నట్లు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను తగిన ఆదేశాలు జారీ చేశారు. డిసెంబరు 2023లో ప్రభుత్వం మారిన తర్వాత ఆరోగ్యశ్రీ సేవల వినియోగం మరింత పెరిగింది. మంత్రి దామోదర వెల్లడించిన వివరాల ప్రకారం, కొత్త ప్రభుత్వ పాలనలో ఇప్పటివరకు 10.72 లక్షల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు లభించాయి. ఈ సేవల కోసం ప్రభుత్వం ఆసుపత్రులకు మొత్తం రూ.1,590 కోట్లకు పైగా బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. ప్రతి నెలా సగటున రూ.100 కోట్ల వరకు ప్రభుత్వం బిల్లుల చెల్లింపులు చేయడంతో ప్రైవేట్ ఆసుపత్రులు కూడా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం 461 ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు ఈ సేవలు అందిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన అన్ని ఔషధాలు కూడా ఉచితంగా అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

# ఇద్దరు రైతుల ఆత్మహత్యలు

>> కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామానికి చెందిన కరివేద సంపత్‌రెడ్డి (49) రెండున్నర ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇటీవల కూతురు వివాహానికి 6 లక్షల రూపాయల వరకు అప్పు చేశారు. అయితే వ్యవసాయం కలిసి రాక, పంటలు దెబ్బతిని నష్టాల పాలైన ఆయన చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక ఇంట్లోని రేకుల షెడ్డుకు టవల్‌తో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు.

# మరో సంక్షేమ గురుకులంలో ఫుడ్ పాయిజనింగ్

## 79 మంది విద్యార్థులకు అస్వస్థత

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా తెలంగాణలోని మరో గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయింది. దీనిపై రాష్ట్ర సంక్షేమ శాఖ అధికారులు సీరియస్ అయ్యారు. ఈ సంఘటనపై తక్షణం విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జిల్లా అధికారులను అదేశించినట్లు తెలియవచ్చింది. రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడలో ఉన్న బిసి బాలికల గురుకుల పాఠశాలలో రాత్రి భోజనం చేసిన తర్వాత విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో 79 మంది బాలికలను పాఠశాల సిబ్బంది దవాఖానకు తరలించారు. ప్రస్తుతం అందరి పరిస్థితి నిలకడగా ఉన్నదని వైద్యులు వెల్లడించారు. వీరిలో ఇప్పటికే కొందరు డిశ్చార్జి అవగా, మరికొందరు దావాఖానాలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. పూర్తిగా తోడుకోని పెరుగు తినడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలుస్తున్నది.

# రెండు దశల్లో 'స్థానిక' పోరు

>> దశలవారీగా ఎన్నికల సిబ్బందికి విధులు తదితర ఏర్పాట్ల ప్రణాళికను రూపొందించాలని సూచించింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం, రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతుండటంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్ల ప్రక్రియను వేగవంతం చేసింది. ఎన్నికలకు అత్యంత ముఖ్యమైన ఓటర్ల తుది జాబితా తయారీపై దృష్టి సారించింది. పంచాయతీరాజ్ శాఖ నిర్ణయం ప్రకారం, పంచాయతీ ఎన్నికల కోసం కొత్త ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని వార్డుల వారీగా ఓటర్ల జాబితాను తిరిగి తయారు చేస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు పంచాయతీ ఎన్నికల కోసం జాబితాను రూపొందించి ఎంపీడీవోల లాగిన్ ద్వారా టీపోల్ పోర్టల్‌లో నమోదు చేశారు. అయితే, పంచాయతీలు, వార్డుల సంఖ్య పెరగడం లేదా తగ్గడం నేపథ్యంలో మళ్లీ ఒకసారి జాబితా సిద్ధం చేయాలని ఎన్నికల కమిషన్ సూచించింది. కొత్తగా ఓటర్ల జాబితాను రూపొందించడంతో కొన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. పాత జాబితా రూపొందించి ఆరు నెలలు పూర్తయినందున, ఈ మధ్యకాలంలో మృతిచెందిన వారి పేర్లు తొలగిస్తారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

>> ప్రాంతంలో మావోయిస్టుల ఉనికి తెలుసుకున్న భద్రతా బలగాల ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టగా మావోయిస్టులు తారస పడడంతో కాల్పులలు జరిగాయన్నారు. ఈ కాల్పుల్లో ఏరియా కమిటీ సభ్యులు కుంగా, లగేట్, భీమేష్, నిహాల్ ఉన్నట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్ ప్రాంతం నుంచి ఎస్ఎల్ఆర్ రైఫిల్స్ 3, ఇన్‌సాస్ 3 మెగజైన్, 303 రైఫిల్, బీజీఎల్ రాకెట్ లాంచర్, సింగిల్‌షాట్, 315 బోర్ రైఫిల్, 12బోర్ గన్, ఏకే 47కు చెందిన 8 రౌండ్లు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. జనవరి 2024 నుంచి నేటి వరకు 425 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారని అన్నారు. వర్షాకాలం క్లిష్ట పరిస్థితుల్లో భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తూ అంకిత భావంతో తమ విధులను కొనసాగిస్తున్నారని అన్నారు.

## వారం - వర్జ్యం

28-07-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
చవితి రా.11.28
పూర్వఫల్గుణి సా.5.39
వర్జ్యం : రా.1.25-3.08
దు.మ.12.40-1.32, మ.3.15-4.07
శుభసమయం:ఉ.9.15-9.50, సా.6.30-7.15
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** సన్నిహితుల నుండి సహాయ సహకారాలు అందిస్తారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం:** దూరప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకొంటారు. ఇంతకాలం పడ్డ శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది.

**మిథునం:** నూతన ప్రయత్నాలు అనుకూలించి ముందుకు సాగుతారు. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు.

**కర్కాటకం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**సింహం:** అకారణంగా వివాదాలు ఏర్పడ వచ్చు. జాగ్రత్తగా వుండండి. షేర్లు, క్రయ విక్రయాలలో స్వల్పంగా లాభాలు పొందుతారు.

**కన్య :** వివాహ, ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. పారిశ్రామిక, సాంకేతిక రంగాల వారికి అన్ని విధాలుగా అనుకూలంగా వుండును.

**తుల :** ఇంటా బయటా అనుకూల స్థితి ఏర్పడుతుంది. ఓర్పు, నేర్పులతో దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు.

**వృశ్చికం:** సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది.

**ధనుస్సు:** కొత్తమిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సోదరుల కలయిక.

**మకరం:** ఆర్థికలావాదేవీలు సంతృప్తి కరంగా సాగుతాయి. రుణబాధల నుండి విముక్తి పొందుతారు.

**కుంభం:** ఇంటా బయటా అనుకూలంగా వుండును. అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి.

**మీనం :** విలువైన వస్తు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. అరుదైన ఆహ్వానాలు అందుకొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సరోగసీ ముసుగులో 'సృష్టి' మోసం!

>> తన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజస్థాన్‌కు చెందిన దంపతులు సంతానం కోసం గతేడాది ఆగస్టులో సికింద్రాబాద్‌లో గల యూనివర్సల్ సృష్టి ఐవిఎఫ్ సెంటర్‌ను సంప్రదించారు. దీంతో వారికి పలు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ నమ్రత ఐవిఎఫ్ పద్ధతిలో పిల్లలు ప్రసవించడానికి అవకాశం లేదని, సరోగసీ పద్ధతిలో బిడ్డను పొందవచ్చని సూచించింది. అందుకు అంగీకరించిన దంపతుల నుంచి సరోగసీకి కావాల్సిన సాంపిల్స్(అండం, వీర్యం)ను సేకరించి విశాఖపట్నంలో గల తమ ఫెర్టిలిటీ సెంటర్‌లో అద్దె గర్భం దాల్చడానికి మహిళను ఏర్పాటు చేశామని నమ్మబలికారు.

**రూ. 25 లక్షల నుంచి రూ. 40 లక్షలు వసూలు..**

సరోగసీ విధానం ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు మొత్తం రూ. 40 లక్షల వరకు ఖర్చు అవుతుందని, అద్దె గర్భం దాల్చిన మహిళకు రూ. 5 లక్షలు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. జూన్, 2025లో విశాఖపట్నంలో ఆ మహిళ ప్రసవించిందని, పండంటి బాబు జన్మించాడని ఆ దంపతులకు తెలిపారు. ఎంతో ఆనందంతో విశాఖపట్నం వెళ్లి బిడ్డను స్వంతం చేసుకున్న ఆ దంపతులకు ఆ బిడ్డకు తమ పోలికలు కనిపించక పోవడంతో అనుమానం వచ్చి బాబుకు డీఎన్ఏ టెస్ట్ చేయించారు. రిపోర్టులో బాబు తల్లిదండ్రులు తాము కాదని తెలుసుకున్న దంపతులు డాక్టర్‌ను సంప్రదించాలని ప్రయత్నం చేసినా ఆమె కాలయాపన చేస్తూ వస్తోంది. అలాగే లాయర్ ప్రాక్టీస్ చేస్తున్న తన కుమారుడితో బెదిరింపులకు పాల్పడింది. దీంతో వారు తమకు జరిగిన అన్యాయంపై గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌పై దాడులు నిర్వహించి ఐవిఎఫ్, సరోగసీ, స్కానింగ్ తదితర వాటికి ఉపయోగించే అనేక వైద్య పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన అట్లూరి నమ్రత అలియాస్ పచిపాల నమ్రత(64)తో పాటు ఆమె కుమారుడు అడ్వకేట్ పచిపాల జయంత్ క్రిష్ణ(25), విశాఖపట్నం సృష్టి ఫర్టిలిటీ సెంటర్ మేనేజర్ సి.కళ్యాణి(40), ల్యాబ్ టెక్నీషియన్ గొల్లమండల చెన్నరావు(37), గాంధీ దవాఖానలో అనస్థీషియా వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న నార్గుల సదానందం(41), అస్సాంకు చెందిన ధనశ్రీ సంతోషి(38), శిశువును విక్రయించిన దంపతులు మోహమ్మద్ అలీ అదిక్(38), నసీర్ బేగం(25)లను అరెస్ట్ చేసినట్లు డీసీపీ వెల్లడించారు. ముందుగా మోసపోయిన దంపతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని, కానీ, డాక్టర్ నమ్రత చేసిన మోసాల తీరు, శిశువుల క్రయ, విక్రయాలపై చైల్డ్ ట్రాఫికింగ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం శిశువును శిశువిహార్ సంరక్షణలో ఉంచినట్లు డీసీపీ తెలిపారు.

**రూ. 90 వేలకు శిశువు కొనుగోలు..**

పోలీసులు నిర్వహించిన సోదాల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. సరోగసీ పద్ధతి ద్వారా బిడ్డకు జన్మనివ్వవచ్చని ఆ దంపతులను నమ్మించిన వైద్యురాలు అసలు వారికే సరోగసీ ప్రక్రియనే ప్రారంభించకుండా వేరే వారికి జన్మించిన బాబును వారి బిడ్డగా నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే అస్సాం రాష్ట్రానికి చెందిన దంపతులు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. వారికి డబ్బు ఆశ చూపి వారికి జన్మించిన శిశువును ఆ దంపతులకు అందజేశారు. ఇందుకోసం వారికి కేవలం రూ. 90 వేలు ఇచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఇదే తరహాలో సంతానం కోసం వచ్చిన అనేక మంది దంపతులను మోసం చేసి లక్షల రూపాయలు గడించినట్లు పోలీసులు గుర్తించారు.

**2021 ఫెర్టిలిటీ సెంటర్ మూసివేత..**

మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు వ్యతిరేకంగా గర్భం దాల్చిన మహిళలకు అక్రమ పద్ధతిలో స్కానింగ్ చేస్తూ శిశువు ఆడ, మగ అని తెలపడంతో పాటు ఆడ శిశువును వద్దనుకునే దంపతుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి గర్భస్రావం అయ్యేలా చేస్తుందనే ఆరోపణల నేపథ్యంలో 2021లో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌కి సంబంధించిన లైసెన్స్‌ను డీఎంహెచ్‌వో రద్దు చేశారు. దీంతో పాటు ఆమెపై రెండు తెలుగు రాష్ట్రాల్లో 10 వరకు కేసులు ఉన్నట్లు పోలీసులు తమ విచారణలో గుర్తించామన్నారు. అక్రమార్జనకు అలవాటు పడిన డాక్టర్ నమ్రత ఇతర వైద్యుల పేరుతో నకిలీ లైసెన్స్‌లు పొంది ఆసుపత్రిని నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ, ఆమెపై ఉన్న కేసుల నేపథ్యంలో యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌కు అసలు అనుమతులు ఇవ్వలేదని డీఎంహెచ్‌ఓ వర్గాలు తెలిపాయి.

**కమర్షియల్ సరోగసీ విధానం రద్దు..**

ప్రస్తుతం ఇండియాలో కమర్షియల్ సరోగసీ విధానం రద్దు చేసినట్లు డీసీపీ మీడియాకు వివరించారు. అయితే వివాహం జరిగి 5 ఏళ్లు గడిచినా సంతానం కలగని దంపతులు కోర్టును ఆశ్రయించి, తమ సమీప బంధువులు ఎవరైనా సరోగసీ విధానం(అద్దె గర్భం) దాల్చడానికి ఒప్పుకుంటే మాత్రం కనవచ్చని స్పష్టం చేసింది. ఈ నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా కమర్షియల్ సరోగసీ నిర్వహిస్తే వారికి కఠిన చర్యలు తప్పవని డీసీపీ రష్మీ పెరుమాళ్ హెచ్చరించింది.

# బాధ్యత సర్కార్‌దే

>> చేశారన్నారు . భారతదేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేశామన్నారు. దీనికిగాను ప్రతి సోమవారం వారం నిధులు విడుదల చేస్తున్నామన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా చేయడానికి గాను బ్యాంకు లింకేజీ ద్వారా లక్ష కోట్ల రూపాయలు రుణాలు మంజూరు చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. చేపపిల్లల పంపిణిలో ఈ సంవత్సరం ప్రయోగాత్మకంగా మహిళా సంఘాల ద్వారా చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు స్థాపించడం ద్వారా వారిని అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్చార్జి మంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి పని చేయాలని అన్నారు. వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని, రైతుల సమస్యలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, యూరియా తక్కువ ఉన్నట్టు తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు విద్యాభివృద్ధికి మలుపుతిప్పే కార్యక్రమమని అభివర్ణించారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ. .రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధి మోడల్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గత పాలనలో అభివృద్ధి కార్యక్రమాలు లేవన్న ఆయన, ఈ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా చేయడంపై కట్టుబడి ఉందన్నారు. వరదలు, వర్షాలకు సంబంధించి అన్ని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. జిల్లాలో సరిపడినంత యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. అధికారులు ప్రజా సంక్షేమ ప్రభుత్వ లక్ష్యాన్ని ముందుంచుకొని పనిచేయాలని అన్నారు. వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్క సంరక్షణ చేపట్టాలన్నారు. రెవెన్యూ శాఖలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆగస్టు 15 నాటికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసుకుని పంపిణీ చేయు విధంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు నెలలో శ్రావణమాసం సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు జరిగేటట్లు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను సరఫరా చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రతివారం ఇందిరమ్మ ఇండ్లకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని పేదవారి సంక్షేమం కోసం రూపొందించిన పథకం అన్నారు. దీనిని ప్రజల్లోకి తీసుకోవలసిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధుల పైన ఉందన్నారు. పంచాయతీరాజ్ మరియు ఆర్ అండ్ బి శాఖ పరిధిలోని పెండింగ్ లో ఉన్న అన్ని పనులను త్వరితగతను పూర్తి చేయాలన్నారు. రహదారుల వెంట ఏర్పడిన గుంటలను పూడ్చాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, అలా జరగకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్ ఐఏఎస్, ఎస్పి రోహిత్ రాజు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి, అటవీ శాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, టి జి ఐ డి సి చైర్మన్ మువ్వ విజయ్ బాబు, జిల్లా అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తరాఖండ్ హరిద్వార్‌లోని మానస దేవి ఆలయంలో ఆదివారం తొక్కిసలాట జరిగిన అనంతరం భద్రతా చర్యలు చేపట్టిన పోలీసులు, ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది

# నేడు సర్కార్‌కు కాళేశ్వరం నివేదిక?

>> జస్టిస్ ముందు తెలిపారు. దీనితో కెబినెట్ నిర్ణయాలు అందించాలని జస్టిస్ పిసిఘోష్ ప్రభుత్వంను కోరారు. రాష్ట్రకెబినెట్‌లో ప్రస్తుతం వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్న తుమ్మలనాగేశ్వరరావు కెసిఆర్ కెబినెట్‌లో రోడ్లుభవనాలుశాఖ మంత్రిగా పనిచేశారు. కెబినెట్‌లో అలాంటి నిర్ణయం జరుగలేదని వెల్లడించడంతో కెబినెట్ నిర్ణయం అనే అంశం వివాదంగా మారింది. మొత్తానికి తెలంగాణ ప్రభుత్వం కెసిఆర్ హయాంలోని కెబినెట్ నిర్ణయాలు జస్టిస్‌కు అందజేసింది. కెసిఆర్, ఈటెల రాజేందర్, హరీష్‌రావులు విచారణ కమిటి ముందు హాజరవడంతో పిసిఘోష్ ఇచ్చే నివేదికపై తెలంగాణ ప్రజలు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే విజిలెన్స్ నివేదిక ప్రభుత్వానికి అందజేశారు. కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యానికి కారకులైన 17 మందిపై క్రిమినల్ కేసులు పెట్టాలని, 33 మందిపై శాఖపరమైన చర్యలు, పదవీ విరమణ చేసిన 7 మందికి పెన్షన్‌లో కోత విధించాలని విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆనివేదిక ఆధారంగా ప్రభుత్వం బహుళ కోణాలలో కాళేశ్వరం అవినీతి ఇంజనీర్లపై విరుచుకుపడుతోన్నది. మరోవైపు ఎన్‌డిఎస్ఎ నివేదిక కూడా వచ్చింది. ఆ నివేదిక ఆధారంగా ఇఎన్‌సి జనరల్ అనిల్ కుమార్‌ను బదిలీచేసి సెక్రటేరియట్‌లో రిపోర్టుచేయమని ఆదేశాలు జారీచేశారు. అనిల్‌కుమార్ గ్రౌటింగ్ చేసి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజిల భూభౌతిక పరిస్థితి ఎన్‌డిఎస్ఎ అధికారులు అంచనా వేయకుండా అక్కడ అనేక ఆనవాళ్ళు లేకుండా రూపుమాపినారని నివేదించారు. దీనితో ఎవరి కోసం ఈ చర్యలు అనిల్‌కుమార్ చేపట్టారో ఆ ఇంజనీర్ నూనెశ్రీధర్ ఇంటిపై కూడా ఎసిబి రైడ్ చేసి అనేక దస్తావేజులు అక్రమ ఆస్తులు స్వాధీనం చేసుకొని కటకటాల వెనక్కి పంపారు. విజిలెన్స్,ఎన్‌డిఎస్ఏ నివేదిక ఆధారంగా గజ్వేల్ ఇఎన్‌సి హరీరామ్ ఇంటిపై కూడా ఎసిబి రైడ్ చేసి ఆయనకు శ్రీకృష్ణజన్మస్థానం చూపారు. తాజాగా రిటైర్డు ఇంజనీర్ మురళీధర్‌రావును కూడా ఎసిబి కస్టడిలోకి తీసుకొని ప్రశ్నించింది. ఎన్‌డిఎస్ఎ,విజిలెన్స్ నివేదికలతోనే ప్రభుత్వం నీటిపారుదలశాఖ అధికారులపై చర్యలు వేగం చేయడంతో జస్టిస్ పిసిఘోష్ నివేదిక సోమవారం అందిస్తే దానిపై కెబినెట్‌లో చర్చ జరిగితే ఇక ఎంత మంది ప్రముఖులపై కేసులు వేస్తారో అనే శంక కలుగుతోంది. మరోవైపు కేబినెట్ నిర్ణయాలు ఇవ్వడానికి ప్రభుత్వం వెనుకాడటంతో జస్టిస్ ఇచ్చే నివేదిక ప్రభుత్వానికి ప్రతికూలంగా ఏమైనా సూచనలు ఏమైనా జస్టిస్ వెల్లడిస్తారా అనే అనిశ్చితి కూడా ఉంది. మేడిగడ్డ,సుందిళ్ళ, అన్నారం కాంట్రాక్టు సంస్థలు,ఐఎఎస్,రిటైర్డుఐఎఎస్, ఆనాటిపాలకులపై చర్యలు ఉండబోతాయని చర్చజరుగుతోంది.

**కాళేశ్వరం బ్యారేజిల పరిశీలించిన సిడబ్ల్యూపీఆర్ఎస్ సాంకేతిక నిపుణులు**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నైరుతి రుతుపన కాలం ముగిసాకే వరద పూర్తిగా తగ్గిన తర్వాతే పరీక్షలు చేపట్టే అవకాశం ఉంటుందని సెంట్రల్ పవర్ అండ్ వాటర్ రిసెర్చ్ స్టేషన్ పుణె నిపుణుల బృందం తేల్చింది. గురువారం మేడిగడ్డను,బుధవారం అన్నారం, మంగళవారం అన్నారం బ్యారేజిలను సౌరభిత్‌సింగ్ పాటు ముగ్గురు నిపుణులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద తీవ్రతను కూడా వారు పరిశీలించారు. ఎన్‌డిఎస్ రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు పరీక్షలు చేపట్టడానికి వరదలు అడ్డుగా ఉన్నాయని తెలంగాణ ఇంజినీర్లకు, ఏజెన్సీ ప్రతినిధులకు సూచించినట్టు తెలిసింది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లతో పాటు మేడిగడ్డ బరాజ్ పునరుద్ధరణపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇప్పటికే తుది నివేదికను సమర్పించింది. బరాజ్‌లపై సమగ్రమైన జియో టెక్నికల్ అధ్యయనాలు, అధునాతన నదీగర్భంలోని భౌగోళిక పరిస్థితుల అంచనాలు అవసరమని ఆ నివేదికలో వెల్లడించింది. మేడిగడ్డ బరాజ్ దిగువన ఏర్పడిన ఖాళీ ప్రదేశాన్ని గ్రౌటింగ్ చేయడం వల్ల ప్రస్తుతం పరీక్షలు నిర్వహించినా కచ్చితమైన ఫలితాలు వచ్చే అవకాశమూ లేదని నివేదికల్లో తెలిపింది. ఈ నేపథ్యంలో తాజాగా సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణుల బృందం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను సందర్శించింది. పరీక్షలను ఏవిధంగా నిర్వహించాలనే అంశంపై రాష్ట్ర ఇంజినీర్లు, ఏజెన్సీ ప్రతినిధులకు సూచనలు చేసింది. బరాజ్‌లకు ఎగువ, దిగువ ఇరువైపుల నుంచి 60 మీటర్ల దూరంలో బోర్లు వేసి కోర్ శాంపిళ్లను సేకరించాలని నిపుణుల బృందం నిర్ధారించినట్టు అధికారులు వెల్లడించారు.

ఆ శాంపిళ్లను తదుపరి విశ్లేషణకు పంపాలని నిపుణుల బృందం సూచించినట్టు తెలిసింది. పరీక్షల పర్యవేక్షణకు, డాటా విశ్లేషణకు అందించే సాంకేతిక సహకారానికి రూ.2.5 కోట్లు అవసరమని, ఆ మొత్తాన్ని ముందుగానే చెల్లించాలని సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణుల బృందం వెల్లడించింది.

# 'ఆపరేషన్ సింధూర్‌తో' ప్రపంచానికి భారత్ సత్తా తెలిసింది

## చెన్నై పర్యటనలో ప్రధాని మోడీ

**చెన్నై,జూలై 27:** ఆపరేషన్ సింధూర్‌తో భారత్ బలం తెలిసిందని, ఉగ్రస్థావరాలను ధ్వంసంచేయడంలో మేకిన్ ఇండియా కీలక భూమిక వహించిందని ప్రధాని మోడీ అన్నారు. మాల్దీవుల పర్యటన తర్వాత తమిళనాడులోని తూత్తుకుడికి చేరిన ఆయన రూ.450 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విస్తరించిన ఎయిర్‌పోర్టు కొతనత టెర్మినల్‌నుప్రారంభించారు రాష్ట్రంలో రూ.4900 కోట్లతో పూర్తిచేసిన వివిద రహదారులు, రైల్వేమార్గాలను ఆయన జాతికి అంకితంచేసారు. తర్వాత ఆయన మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో భారత్ అభివృద్ధిలో నడుస్తోందన్నారు. తమిళనాడును అభివృద్ధిచేసే ప్రక్రియ 2014లోనే ప్రారంభం అయిందని, ఈ 11 ఏళ్లలో రహదారులు, ఇంధనం, విమానాశ్రయాలు సహా పలుపథకాలుపూర్తిచేసామన్నారు. తూత్తుకుడి విమానాశ్రయం కొత్త టెర్మినల్ ద్వారా ఏడాదికి 20 లక్షలమంది రాకపోకలు సాగించే వీలు కలుగుతోందని అన్నారు. పౌరవిమానాయన మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ దక్షిణ తమిళనాడు ముఖద్వారంగా తూత్తుకుడి మారుతున్నదని, వాణిజ్యం అభివృద్ధిచెందుతున్నదని కొత్త విమానాశ్రయాలవల్ల లక్షలమందికి ఉపాధి లభిస్తోందని చెప్పారు. రూ.550 కోట్లతో నిర్మిస్తున్న రెండువేల మెగావాట్ల కుడంకుళం అణువిద్యుత్‌ప్రాజెక్టు ట్రాన్స్‌మిషన్‌లైన్ రాబోయే ఏళ్లలో దేశానికి స్వచ్ఛమైన విద్యుత్‌ను అందిస్తుందని అన్నారు. దేశంలో మొట్టమొదటి వర్టికల్ వంతెన పంబన్‌లో నిర్మించామని గుర్తుచేసారు. బ్రిటన్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందంతో 99శాతం భారతీయ ఉత్పత్తులకు ఎలాంటి పన్నులు లేవని, తమిళనాడు యువత చిన్న పరిశ్రమలకు ఎంతోప్రయోజనం కలుగుతుందన్నారు. మహాకవి సుబ్రహ్మణ్య భారతీయార్‌కు తన నియోజకవర్గం కాశీతో సంబంధాలున్నా యని, కాశీ తమిళ సంగం వంటి కార్యక్రమాలతో ఉమ్మడి సాంస్కృతిక వారసత్వం నిరంతరం బలోపేతంచేస్తున్నట్లు మోడీ స్పష్టంచేసారు. అలాగే చోళచక్రవర్తి రాజేంద్రచోళ జయంతి సందర్భంగా ఆదివారం తమిళనాడులోజరిగిన తిరువతిరై వేడుకల్లో పాలుపంచుకున్న మోడీ గంగైకొండ చోళపురం ఆలయంలో జరిగే ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయంలో ప్రధాని మోడీ ప్రత్యేక ప్రార్థనలు చేసారు. చోళరాజుల్లో రాజేంద్రచోళ అత్యంతశక్తివంతమైన, దార్శనిక పాలకులని అన్నారు. ఆయన నాయకత్వంలో చోళ సామ్రాజ్యం దక్షిణ, ఆగ్నేయాసియా మొత్తం విస్తరించిందని,తన విజయయాత్రలతో గంగైకొండ చోళపురం సామ్రాజ్య రాజధానిగా స్థాపించినట్లు మోడీ గుర్తుచేసారు. గంగైచో ళపురంలోని ఆలయం 250 సంవత్సరాలకపైగా శివభక్తి స్మారక నిర్మాణం నాటిరాజుల పాలనా నైపుణ్యానికి ప్రతీకగా నిలిచిందన్నారు.

## అంతరిక్ష రంగంలో స్టార్టప్‌లు 200

>> చెందుతున్నాయి. ఐదేళ్ల క్రితం 50 అంకుర సంస్థలు ఉంటే ఇవాళ 200కి పైగా ఉన్నాయని నరేంద్ర మోడీ అన్నారు. మహారాష్ట్రలో 12 కోటలను ప్రపంచ వారసత్వ సంపదగా యూనెస్కో గుర్తించింది. కొన్నేళ్ల క్రితం రాయగఢ్‌కు వెళ్లాను. అది నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అస్సాంలోని కజిరంగా నేషనల్‌పార్క్‌లో గడ్డి భూమి పక్షులకు నిలయం. అక్కడ 40 రకాలు ఉన్నాయి. టెక్నాలజీ బృందాలు వాటి కూతలు, ఏఐ ఆధారంగా లెక్కించాయి. టెక్నాలజీ, సెన్సివిటీ కలిస్తే ప్రతిదీ తేలిక అవుతుందని మోడీ పేర్కొన్నారు.

## 32 మండలాల్లో సూపరింటెండెంట్లకు ఎంపిడిఒ ఇన్‌చార్జి బాధ్యతలు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 27: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 144 మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)ల పోస్టులు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. కొత్తగా ఏర్పడిన 32 మండలాలకు సైతం ఇప్పటి వరకు ఎంపీడీవో పోస్టులు మంజూరు కాలేదు. ఈ పోస్టులన్నింటినీ గ్రూప్ 1 ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. అయితే కేసుల నేపథ్యంలో ఈ పోస్టుల భర్తీ ప్రక్రియలో జాప్యం నెలకొంది. టీజీపీఎస్సీ గ్రూప్ 1 రాత పరీక్ష ముగిసినప్పటికీ ఫలితాలు ఇప్పటి వరకు విడుదల కాలేదు. మరోవైపు స్థానిక ఎన్నికల దృష్ట్యా ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉండరాదని ఎన్నికల సంఘం చెప్పడం.. ఇరకాటంలో పడేసింది. దీంతో వేసవిలోనే కొత్త నియామకాలు జరిగేవరకు కింది స్థాయి అధికారులను ఇన్‌చార్జులుగా నియమిస్తూ.. కానీ బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. తాజా ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ శాఖ మండల పంచాయతీ అధికారులకు, మండల పరిషత్ సూపరింటెండెంట్లకు ఎంపీడీవోల బాధ్యతలను అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో టీజీపీఎస్సీ గ్రూప్ 1 ఫలితాలు వెలువడి కొత్త ఎంపీడీవోలు విధుల్లో చేరే వరకు వీరు విధుల్లో కొనసాగనున్నారు.

## మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తగా ఇంజినీరింగ్ కాలేజీ

### 4 కోర్సుల్లో అడ్మిషన్లకు అనుమతి..

### రూ. 46.20 లక్షల నిధులు మంజూరు

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మరో కొత్త ఇంజనీరింగ్ కాలేజీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. మహబూబ్ నగర్ జిల్లా సలీంనగర్‌లో కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా జారీ చేశారు. మహబూబ్ నగర్ జిల్లా, ధర్మాపూర్, సలీమ్ నగర్‌లో జికె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ పేరుతో కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీని ఏర్పాటు చేస్తున్నట్టు జివో ఆర్‌టి నంబర్ 109ని జారీ చేశారు. ఈ విద్యా సంవత్సరం 2025-26 నుంచే 4 ఇంజనీరింగ్ కోర్సులను ప్రారంభించాలని నిర్ణయించారు. బి టెక్‌లో ఏఐ అండ్ ఎంఎల్, సిఎస్ఈ, కంప్యూటర్‌సైన్స్ అండ్ ఐటీ, బిటెక్-ఐటీలో ఒక్కో కోర్సులో 60 సీట్ల చొప్పున అడ్మిషన్లను తీసుకోనున్నారు. మహబూబ్‌నగర్‌లో కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటుకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసిటిఈ) అనుమతి ఇవ్వడంతో జెఎన్‌టియు హైదరాబాద్ కూడా కాలేజీ ఏర్పాటుకు అనుమతించడంతో కొత్త ఇంజనీరింగ్ కాలేజీని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి వివిధ అవసరాల కోసం రూ. 46.20 లక్షలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులో స్పష్టం చేసింది. ప్రస్తుతం జరుగుతున్న ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగానే అడ్మిషన్లను తీసుకోనున్నారు.

### మరికల్‌లో దారుణం..

## కన్నకూతురిపైనే అత్యాచారం

**నారాయణపేట ప్రతినిధి, జూలై 27, ప్రభాతవార్త :** నాన్నంటే రక్షణ. తండ్రి చేయి పట్టు కుని నడిస్తే బిడ్డకు కొండంత ధైర్యం. బయటవాళ్లు ఏమైనా అంటే మా నాన్నకు చెబుతా అని బెదరిస్తారు పిల్లలు. అలాంటి తండ్రే అఘాయిత్యానికి పాల్పడుతుంటే ఆ ఆడబిడ్డ బయటకు చెప్పుకోలేకపోయింది. ఇక వివరాల్లోకి వెళ్తే నారాయణపేట జిల్లా మరికల్ మండలం పూసలాపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి భార్య, కూతురుతో కలిసి ఉంటున్నాడు. అతడి కూతురికి 10యేళ్లు. ప్రస్తుతం అయిదో తరగతి చదువు తోంది. అయితే శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తండ్రి కూతురిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలికకు తీవ్రరక్తస్రావం కావడంతో ఈ విషయం తల్లికి చెప్పింది. శనివారం ఉదయం ఆ బాలికను మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. దీంతో అనుమానం వచ్చిన వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఆస్పత్రికి వచ్చిన పోలీసులు ఈ అఘాయిత్యానికి సంబంధించిన వివరాలు ఆ బాలికను అడిగిన తెలుసుకున్నారు. విషయాన్ని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేయడంతో సమాచారం అందుకున్న మరికల్ ఎస్ఐ హుటాహుటిన గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. తండ్రి పరారీలో ఉన్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

## సినీ కార్మికులకే చిత్రపురి కాలనీ

### అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** హైదరాబాద్ చిత్రపురి కాలనీ సినీ కార్మికులకు మాత్రమేనని చిత్రపురి అసోసియేషన్ అధ్యక్షులు వల్లభనేని అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. కాలనీకి సంబంధం లేని వారు కూడా కోట్ల రూపాయల మేర అవినీతి జరిగిందంటూ ఆరోపిస్తున్నారని, అటువంటి వారి వద్ద సరైన ఆధారాలుంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ చిత్రపురి కాలనీలో 6 నెలలకోసారి సమావేశంలో కుటుంబ సభ్యుల్లా సమస్యలపై చర్చించుకుంటామని తెలిపారు. చిత్రపురి కాలనీలో 4,713 కుటుంబాలు ఇప్పటికే నివాసం ఉంటున్నారని పేర్కొన్నారు. రూ.700 కోట్ల నుంచి రూ.850 కోట్ల మధ్య ఉన్న చిత్రపురి కాలనీ లావాదేవీలకు సంబంధించి కొందరు సుమారు రూ.3 వేల కోట్లకు పైగా అవినీతి జరిగినట్లు మాట్లాడుతున్నాని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల కొంతమంది చలో ఫిలిం ఛాంబర్, చలో గాంధీభవన్ అంటూ బయటికి వస్తున్నారని విమర్శించారు.

ఈ స్థలం ఉచితంగా రాలేదని, కోర్టులో ఉన్న కొన్ని విషయాలపై మాట్లాడలేనన్నారు. 2009లోనే పర్మిషన్లు తీసుకుని రో హౌసులు నిర్మించగా, 2017లో కూడా మరికొన్ని పర్మిషన్లతో బి+2గా మరి కొన్ని రో హౌసులు నిర్మించినట్లు వెల్లడించారు. అన్నింటినీ పూర్తి అనుమతితోనే నిర్మించినట్లు తేల్చిచెప్పారు. కొంతమంది కేసులు పెట్టడంతో నిర్మాణాలకు బ్రేక్ పడిందన్నారు. ప్రస్తుతం ఉన్న రేట్లు కాలనీపై ఉన్న అప్పును దృష్టిలో ఉంచుకునే నిర్ణయించాం. సఫైర్ సూట్ నిర్మించేందుకు అన్నీ పర్మిషన్లతోనే ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. మొత్తం 51 అంతస్థుల భవనంలో సఫైర్ సూట్ ప్లాన్ చేస్తున్నామని చెప్పారు.

కాలనీలో చిత్ర పరిశ్రమకు చెందిన ఎవరికీ అన్యాయం జరగదని, సరైన మెంబర్షిప్ ఉంటే కచ్చితంగా వారికి ప్లాట్ వచ్చేందుకు పూర్తి సహకారం ఉంటుందన్నారు. సెప్టెంబర్‌లో జరిగే జనరల్ బాడీ మీటింగ్‌లో ఆరోపణలు చేసే వారు అధారాలు ఇస్తే దాని ఆధారంగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

### కొండాపూర్‌లో వెలుగుచూసిన ఏపి ముఠాల పార్టీలు

### 11 మందిపై కేసు నమోదు, 9 మంది అరెస్ట్.. ఆరు కార్లు, డ్రగ్స్ స్వాధీనం

## సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీ..

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** వీకెండ్ వచ్చిందంటే చాలు.. సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో మద్యం విందులు.. డ్రగ్స్ వినియోగాలు అమ్మాయిలు.. డాన్సులు.. రేవ్ పార్టీలు.. ఇలా ఒకటేమిటి కొండాపూర్ ఏరియాలో జరుగుతున్న చిత్రవిచిత్రాలు ఇవి.. వివరాల్లోకి వెళ్తే.. కొండాపూర్ ఎస్వీ నిలయం అనే సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో ఏపీకి చెందిన కొన్ని ముఠాలు అక్కడివారిని వీకెండ్ సందర్భంగా హైదరాబాద్ కు తీసుకువచ్చి హైదరాబాద్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీలు నిర్వహిస్తున్నారు. ఇలాంటి రేవ్ పార్టీని శనివారం రాత్రి స్టేట్ ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ బి టీం ఎస్పై నంద్యాల బాలరాజు ఇతర సిబ్బంది కలిసి దాడి చేసి పట్టుకున్నారు. విజయవాడకు చెందిన నాయుడు అలియాస్ వాసు, శివం రాయుడు అనే కొంతమంది గుడ్డు వచ్చిన కాకుండా మారుపేరులతో మారు బ్యాంక్ అకౌంట్ మారు ఆధార్ కార్డులతో డబ్బున్న సరా బులను తీసుకు వచ్చి రెండు రోజులపాటు ఎంజాయ్ చేయించి తీసుకు వెళుతుంటారు.ఇలాంటి ముఠాను ఎస్టిఎఫ్ బి టీం పట్టుకున్నారు వీరందరిని శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సిఐ సంధ్య తెలిపారు.వీరి వద్ద నుంచి 2.080 కేజీల గంజాయిని, 50 ఓజీ కుష్ గంజాయిని,11.57 గ్రాముల మ్యాజిక్ ముష్రూమ్ ను, 1.91 గ్రాముల చెరస్ డ్రగ్స్. నాలుగు కార్లను 11 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని 9 మందిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో కింగ్‌కెన్ షేర్ రాహుల్ (డ్రగ్స్‌ను తెప్పించే వ్యక్తి ఆర్గనైజర్ ప్రవీణ్ కుమార్ అలియాస్ మన్నే అప్పికొల్లు అశోక్‌కుమార్, నమ్మెల సాయి కృష్ణ హిట్ జోసెఫ్ తోట కుమారస్వామి అడపా యశ్వంత్ శ్రీధర్, నంద సమత తేజలను అరెస్ట్ చేశారు. వీరితోపాటు మరో ముగ్గురు కూడా కేసు నమో దు చేయగా వారు పరారీలో ఉన్నట్లు సిఐ తెలిపారు.

**ఏపికి చెందిన వాహనాలపై ఆరా తీస్తున్న అధికారులు**

రేవ్ పార్టీలో పట్టుబడిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాహనాలపై ముఖ్యంగా కార్లపై అధికారులు ఆరా తీస్తున్నారు. టొయోటా ఫార్చ్యూనర్ కార్ రిజిస్ట్రేషన్ నెం : ఏపి 39ఎస్ఆర్ 1, ఫోర్డ్ కార్ రిజిస్ట్రేషన్ నెం :ఏపి 39 సియు 7154 నెంబర్ల ఆధారంగా అధికారులు ఆయా వాహనాలు ఎవరి పేరు మీద ఉన్నాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ముఖ్యంగా టయోటా ఫార్చ్యూనర్ కార్ నెం : ఏపీ 39 ఎస్ఆర్ 1 పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ వాహనం ఏపికి చెందిన ఒక ప్రముఖ ప్రజా ప్రతినిధికి చెందిన కారు అని ప్రచారం జరుగుతుండటంతో అధికారులు ఆ దిశగా కూడా దర్యాప్తు చేస్తు న్నారు.సాధారణంగా ఇటువంటి ఫ్యాన్సీ నంబర్లను ప్రజాప్రతినిధులు,ప్రముఖ వ్యాపారస్తులు, సినిమా రంగాలకు చెందిన వారే ఉపయోగించడం గమనార్హం.

## దుబాయ్ వెళ్లిన పాతబస్తీ మహిళ డ్రగ్స్ కేసులో అరెస్టు

### మా కూతురు అమాయకురాలు: తల్లిదండ్రుల ఆవేదన



దుబాయ్‌లో డ్రగ్స్ కేసులో అరెస్టయిన అమీనా బేగం.

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** దుబాయ్‌లో బ్యూటీ పార్లర్ ఉద్యోగం కోసం వెళ్లిన పాత బస్తీలోని కిషన్‌బాగ్‌కు చెందిన ఓ మహిళ అక్కడ డ్రగ్స్ కేసులో అరెస్టయి జైలు పాల య్యింది. అయితే తమ కూతురు అమాయ కురాలని, ఆమెకు ఏ పాపం తెలియదని, ఎవరో అన్యాయంగా ఇందులో ఇరికించారని ఆమె తల్లిదండ్రులు చెబుతున్నారు. వివరాలు ఇలావున్నాయి. కిషన్‌బాగ్‌కు చెందిన అమీనా బేగం (24) వివాహిత. ఆమె భర్త అ యూబ్ ఖాన్ ప్రైవేటు ఉద్యోగి. వీరికి ఐదేళ్ల కుమారుడు వున్నాడు. పాతబస్తీలోని ఓ ఏజెంట్ ద్వారా మే 18వ తేదీన దుబాయ్‌లో బ్యూటీ పార్లర్ లో ఉద్యోగం నిమిత్తం ఆమె శంషాబాద్ విమానాశ్రయం నుంచి దుబాయ్‌కు వెళ్లింది. అయితే అమీనా బేగం దుబాయ్ విమానాశ్రయంలో దిగగానే ఆమె వద్ద వున్న బ్యాగ్‌ను అక్కడి కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. అయితే ఒక బ్యాగులో నిషిద్ధ మాదక ద్రవ్యాలు వుండడంతో పోలీసులు వెంట నే అరెస్టు చేశారు. ఆమె ప్రస్తుతం దుబాయ్ లోని అబుదాబి జైల్లో వుంది. అయితే ఈ ఘటనపై అమీనా బేగం తల్లిదండ్రులు మీడియాతో మాట్లా డుతూ తమ కుమార్తె దుబాయ్‌కు వెళ్లే సమయంలో హైదరాబాద్‌లో ఎవరో ఒక బ్యాగ్ ఇచ్చి దీనిని దుబా య్‌లోని తమ మనుషులకు ఇవ్వాలని కో రారని, ఇందులో మాదకద్రవ్యాలు వున్న విషయం తమ కుమార్తెకు తెలియదని వారు తెలిపారు. తమ కుమార్తెకు తెలియ కుండా జరిగిన ఈ నేరం లో ఆమె ఇరుక్కుని జైలు పాలైందని వారు ఆవేదన చెందారు. ఈ విషయంలో కేంద్రం వెంటనే జోక్యం చేసుకుని తమ కుమార్తెను విడిపించి భారత్‌కు తిరిగి తీసుకురావాలని వారు వేడుకున్నారు. తమ మనవడు అనారోగ్యంతో బాధపడుతున్నాడని వారు తెలిపారు. ఈ విషయంలో కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌ను ప్రత్యేకంగా వేడుకున్నారు. ఈ కేసులో అమీనా బేగంను దుబాయ్‌కు పంపిన ఏజెంట్‌ను విచారిస్తే అన్ని విషయాలు తెలు స్తాయని వారు తెలిపారు. కాగా దీనిపై పాత బస్తీలోని బహదూర్‌పురా పోలీసు అధికారులతో మాట్లాడగా ఈ విషయమై తమకు ఇంతవరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కెసిఆరే కాదు ఇంకా వందమంది వచ్చినా బిఆర్ఎస్‌ను బతికించలేరు!

### ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** కెసిఆరే కాదు ఇంకా వందమంది వచ్చినా బిఆర్ ఎస్‌ను బతికించలేరని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. రేవంత్‌రెడ్డిని డీగ్రేట్ చేయడానికి కేటీఆర్ ఎంత ప్రయత్నిస్తుంటే అంత కంతకు పైకి ఎదిగిపోతుండు అని ఆయన అన్నారు. కెటిఆర్, హరీష్ రావు జగదీశ్ రెడ్డి ఏమి చేయలేకపోగా ఇంకా పరువు తీసుకుంటున్నారని విమర్శించారు. బుడంకాయలు, వంకాయలు, దోసకాయలు రేవంత్ రెడ్డిని ఏమి చేయలేవు అని అన్నారు. కెసిఆర్ చేతకాకనే కామ్ గా ఇంట్లో పడుకున్నాడు. ఇక మీ చేత ఏమైతది మీ భాషను మార్చుకోకపోతే టీమ్ బి వస్తది మీరు తట్టుకోలేరు అని జోస్యంచెప్పారు. కెసిఆర్ ను కాపాడే శక్తులు ఇక బిఆరెస్‌ను బతికించే పరిస్థితి లేదు ప్రజల మిమ్మల్ని బండకేసి బాదితే ఇంట్లో పడుకున్నారు, గడువుతీరిన పార్టీని ఎంత బతికించాలనుకున్నా వృథా అని ఆయన అన్నారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసు..

## కేంద్రమంత్రి బండి సంజయ్ వాంగ్మూలం వాయిదా

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి స ంజయ్ సోమవారం నాడు సిట్ అధికారులకు ఇవ్వాల్సిన వాంగ్మూలం వాయిదా పడింది. ముందుగా నిర్ణయించిన దాని ప్రకారం ఈ నెల 28వ తే దీన సిట్ అధికారులకు ఆయన వాంగ్మూం ఇవాల్సి వుంది. ఈ మేరకు ఈ నెల 23వ తేదీన ఆయన అధికారులకు సమాచారం ఇచ్చారు. అంతకు నాలుగు రోజుల ముందే ఆయన వాంగ్మూలం ఇవ్వాల్సి వున్నా పార్లమెంట్ సమావేశాల దృష్ట్యా ఈ నెల 28వ తేదీకి దానిని వాయిదా వేశారు. కా గా సోమవారం నాడు కూడా పార్లమెంట్ సమావేశాలు జరగనుండడం, ఆపరేషన్ సిందూర్‌పై చర్చ వుండడంతో విచారణకు రాలేనని బండి సంజ య్ సిట్ అధికారులకు ఆదివారం నాడు సమాచారం అందించారు. దీనికి సిట్ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ కేసులో ఇప్పటికే బిజెపి ఎంపిలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డితోపాటు ఈటల రాజేందర్, పిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ సహా పలువురు సిట్ అధికారులకు వాంగ్మూలం ఇవ్వడం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్ విషయంలో నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్ రావు పై బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేయడం విదితమే. ఫోన్ ట్యాపింగ్‌కు ప్రభాకర్ రావు పూర్తి బాధ్యత వహించాలని ఆయన కోరారు.

## పాలిసెట్-2025లో నేడు ఫైనల్‌ఫేజ్ సీట్ల కేటాయింపు

### మొదటి విడతలో 18,984 మందికి సీట్ల కేటాయింపు

### 115 ప్రభుత్వ, ప్రైవేట్ డిప్లమో కాలేజీల్లో 28,996 సీట్లు

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజినీరింగ్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్-2025 ఫైనల్ ఫేజ్ సీట్ల కేటాయింపు నేడు(సోమవారం) చేపట్టనున్నారు. ఇప్పటికే మొదటి విడత సీట్ల కేటాయింపు చేపట్టగా.. ఈ నెల 19తో కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 23 నుంచి ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌ను చేపట్టారు. ఈ నెల 23న స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించగా.. ఈ నెల 24న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించారు. ఈ నెల 24, 25 తేదిల్లో ఫైనల్ ఫేజ్‌కి సంబంధించి వెబ్ ఆప్షన్లకి అవకాశమిచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన విద్యార్థులకు నేడు (సోమవారం) సీట్ల కేటాయింపు చేయనున్నారు. పాలీసెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా మొదటి విడతలో 18,984 మందికి సీట్ల కేటాయింపు చేశారు. పాలీ సెట్ -2025లో 80,949 మంది అర్హత సాధించగా వారిలో మొదటి విడతలో 20,811 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. ఆప్షన్లు ఇచ్చిన వారిలో 18,984 మందికి సీట్లను కేటాయించగా మరో 10,012 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 115 ప్రభుత్వ, ప్రైవేట్ డిప్లమా కాలేజీల్లో 28,996 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం సీట్లలో మొదటి విడతలో 65.5 శాతం సీట్లు కేటాయించారు. 59 ప్రభుత్వ కాలేజీల్లో 13,964 సీట్లు అందుబాటులో ఉంటే 11,455 సీట్లను(82శాతం) కేటాయించారు. 56 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 15,032 సీట్లు అందుబాటులో ఉంటే.. వాటిలో 7529 సీట్లను (50.10 శాతం) కేటాయించారు. ఈడబ్ల్యూ ఎస్ కోటాలో 713 సీట్లను కేటాయించారు. ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో భాగంగా నేడు సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సీటు పొందిన విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ ఇవ్వడానికి ఈ నెల 28 నుంచి 30వరకు అవకాశం కల్పించారు.

## బిజెపి, బిఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటే

### వారిది ఫెవికాల్ బంధం

### చొప్పదండి ఎమ్మెల్యేల మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** బిజెపి, బిఆర్ఎస్ రెండు వేరువేరు కాదని మొదటి నుంచి చెబుతున్నామని.. పదేళ్లుగా వాళ్లమధ్య ఫెవికల్ బంధం ఉందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం సిఎల్‌పి కార్యాలయంలో మాట్లాడుతూ ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపికి బిఆర్ఎస్ మద్దతు ఇచ్చినప్పుడే ఆ పార్టీల బంధం బయటపడింది.బిజెపిను బిజెపికి హోల్ సేల్ గా అమ్మడానికి కెటిఆర్ ఒప్పందం చేసుకున్నాడు. ఇడి సిబిఐ కేసులు వాళ్ళ కుటుంబ సభ్యుల పైన రాకుండా ఉంటే బిఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేస్తామని అన్నారని సీఎం రమేష్ చెప్పారు. సిఎం రమేష్ ను కెటిఆర్ కలిసింది నిజామా కదా చర్చలు జరిగింది వాస్తవం కదా అని నిలదీశారు. బిఆర్ఎస్ విలీనం కోసం చర్చలు వాస్తవమే అని బండి సంజయ్ అన్నారని సమాధానం చెప్పాలని అన్నారు. సిఎం రమేష్ ను తీసుకువస్తా చర్చకు రండీ అని కెటిఆర్‌ను మంత్రి బండి సంజయ్ పిలిచారు.ఇంకా తేలుకుట్టిన దొంగల ఎందుకు ఉన్నావ్ కెటిఆర్ ఎప్పుడూ వెళ్తున్నవో చెప్పు అని కోరారు. పదేళ్ల తెలంగాణ ప్రజలను మోసం చేసింది చాలదా ఇంకెన్నేళ్ళు మోసం చేస్తారు అని కెటిఆర్ ప్రశ్నించారు. కంచె గచ్చిబౌలి భూముల లో అవకతవకలు జరిగితే ఇడి, సిబిఐ వచ్చేవి కదా అని మేడిపల్లి సత్యం సందేహం వ్యక్తంచేశారు. అనేక కాంట్రాక్టులు ఆంధ్రా కాంట్రాక్టర్లకు కట్టబెట్టింది మీరు.8 ఎంపీలు బిజెపి గెలవడానికి కారణం బిఆర్ఎస్ మాత్రమే అన్నారు.బిఆర్ఎస్ గంపగుత్తగా బీజేపీ కి ఓట్లు అమ్ముకున్నారు. బిఆర్ఎస్, బిజెపి ఒప్పందంలో భాగంగానే బిజెపి కి డమ్మీ అధ్యక్షుడిని నియమించారుపదేళ్లు దోచు కొని బిఆర్ఎస్‌ను బిజెపికి అమ్మడానికి ప్రయ త్నాలు చేశారు. కవిత కూడా బిఆర్ఎస్ ను బిజెపి లో విలీనం చేయాలని ప్రయత్నం చేశారు అని చెప్పింది.పదేళ్లలో విద్యార్థులు,యూనివ్సిటీ లు, కాలేజీలు గుర్తుకురాలేదు.బిఆర్ఎస్ కి ఓటు వేస్తే మురిగిపోయినట్లే బిఆర్ఎస్ కి ఓటు వేస్తే బిజెపి కి వేసినట్లే.. ప్రజలు ఆలోచించాలి అన్నారు.

## మరో ఇద్దరు రైతుల ఆత్మహత్యలు

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. మూడు రోజుల క్రితం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అప్పుల బాధను తట్టుకోలేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడగా, తాజాగా మరో ఇద్దరు అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అప్పులు తెచ్చి పంటలు సాగు చేయగా సరైన దిగుబడి రాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది తెలంగాణలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. రాష్ట్రంలోని నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం సుర్జాపూర్ గ్రామానికి చెందిన సంఘ రాములు (65) పంట దిగుబడి రాక, చేసిన అప్పులు 20 లక్షల రూపాయల వరకు చేరుకోవడంతో మనస్తాపానికి గురయ్యారు. పొలంలోనే మంచె గుంజకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అలాగే కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామానికి చెందిన కరివేద సంపత్‌రెడ్డి (49) రెండున్నర ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇటీవల కూతురు వివాహానికి 6 లక్షల రూపాయల వరకు అప్పు చేశారు. అయితే వ్యవసాయం కలిసి రాక, పంటలు దెబ్బతిని నష్టాల పాలైన ఆయన చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక ఇంట్లోని రేకుల షెడ్డుకు టవల్‌తో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు.

## స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నిర్లక్ష్యం తగదు

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య



బిసి విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూలై 27, ప్రభాతవార్త:** బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్ మెంట్ పథకాల అమలుపై తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో రాష్ట్ర యువజన సంఘం నాయకులు జిల్లపల్లి అంజి, నీల వెంకటేష్‌ల అధ్యక్షతన వేలాది మంది బీసీ విద్యార్థులతో కలసి, స్కాలర్ షిప్పులు, ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారీ ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్నో స్కీములకు అప్పులు తెచ్చి అమలుచేస్తున్న ప్రభుత్వం, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే పథకాలకు మాత్రం నిధులు విడుదల చేయకుండా, పథకాలను నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవటంతో ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌లో రెండు దఫాలుగా విద్యార్థులకు మూడు వేల కోట్లు విడుదల చేశారని, మన రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, 20 నెలలు గడిచిపోతున్నా 20రూపాయలు కూడా విద్యార్థుల కోసం విడుదల చేయలేదని విమర్శించారు. బీసీ విద్యార్థులకు కాలేజి హాస్టల్స్‌లో సీట్లు దొరకక, విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ప్రభుత్వం 100 బీసీ కాలేజీ హాస్టల్స్ ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ట్రస్ట్ బ్యాంకు పేరుతో పాత పథకాలను ఎత్తివేసే కుట్రలను ప్రభుత్వం మానుకోవాలని హితవుపలికారు. బీసీ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతూ ఉంటే ఈ ప్రభుత్వం ఓర్వలేక పోతోందని విమర్శించారు. రాష్ట్రంలో పెండింగ్ ఉన్న 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు మొత్తం ఆరువేల కోట్ల రూపాయలను తక్షణమే విడుదల చేయాలని, బీసీ గురుకుల పాఠశాలలో 20శాతం సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థులపై ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు మోడీ రామ్‌దేవ్, అనంతయ్య, రాజేందర్, శివయాదవ్, నరేష్‌గౌడ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 7న గోవాలో జాతీయ ఒబిసి మహాసభ

### రాజకీయాలకు అతీతంగా బిసిలు ఐక్యం కావాలి

### మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎంపిలు ఈటల, అసదుద్దీన్, వద్దిరాజు రవిచంద్ర


**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** దేశంలోని బిసిలంతా రాజకీయాలకతీతంగా ఐక్యం కావలసిన అవసరం ఉందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆగస్టు 7న గోవాలో జరిగే జాతీయ ఓబీసీ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ ఓబిసి మహాసభల పోస్టర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించినట్టు తెలిపారు. పోస్టర్‌ను ఎంపిలు ఈటల రాజేందర్, అసదుద్దీన్ ఓవైసీ, వద్దిరాజు రవిచంద్ర ఆవిష్కరించినట్టు జాజుల తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, మహాత్మ జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కురుమ, జాజుల లింగం గౌడ్, పాలకూరి కిరణ్, నాగరాజు గౌడ్, గణం నరసింహ, ఇంద్రం రజక, పవన్ సాయి గౌడ్, బండిగారి భరత్, పాల్గొన్నారు. ఆగస్టు 7న గోవాలో జరిగే 10వ జాతీయ ఓబిసి మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ బిజెపి లోక్‌సభ సభ్యులు, మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఎంఐఎం అధ్యక్షులు అసదుద్దీన్ ఒవైసీ, బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర బిసి సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి మహాసభల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారని తెలిపారు.

మహాసభలకు హాజరుకావాలని ఈటలకు వారి ఇంటి వద్ద, అలాగే అసదుద్దీన్ ఓవైసీకి దారుసలెంలో, ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు వారి నివాసంలో మహాసభలకు అతిథులుగా హాజరుకావాలని ఆహ్వాన పత్రికలను అందజేసినట్టు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బిసిలకు మంచి రోజులు రానున్నాయని, బిసిల చైతన్యం కోసం నిరంతరం బిసి సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ చైతన్యాన్ని ఇదే విధంగా ముందుకు కొనసాగించి బిసిలు తాము కోల్పోతున్న హక్కులను సాధించుకోవాలని, జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో తమ వాటాను సాధించుకోవడం కోసం రాజకీయ పార్టీలకు అతీతంగా అందర్నీ కలుపుకొని ముందుకు కొనసాగాలన్నారు. ఆగస్టు 7న గోవా రాష్ట్రంలోని డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ స్టేడియంలో జరిగే జాతీయ 10వ మహాసభలకు దేశ నలుమూలల నుండి హాజరై బిసిల ఐక్యతను చాటాలని, ఓబిసి మహాసభలకు తాము కూడా హాజరు అవుతామని ఎంపిలు వెల్లడించారని తెలిపారు.

## 'శాంతి చర్చలు- ప్రజాస్వామిక అన్వేషణ' ఆవిష్కరణ

### పాల్గొన్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి. చిత్రంలో జస్టిస్ బి.చంద్రకుమార్, జి.హరగోపాల్ తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 27, ప్రభాతవార్త:** పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జి.హరగోపాల్ (ఇంటర్వ్యూలు-ప్రసంగాల వ్యాసాల) రచించిన 'శాంతి చర్చలు-ప్రజాస్వామిక అన్వేషణ' అనే పుస్తకాన్ని ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుద ర్శన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాం గం కల్పించిన స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృ త్వం దేశంలో ఉండాలని, వీటిని కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. శాంతి చర్చలు అనేవారు ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని, మైనింగ్ ఆపరేషన్‌ను అపడం ఎవరి తరం కాదన్నారు. మైనింగ్ ఆపరేషన్‌లో ఆదివాసీలను భాగస్వామ్య చేయగలుగుతామా అనే విషయాన్ని ఆలోచించాలని సూచించారు. ప్రస్తుతం బిహార్‌లో జరుగుతున్న పరిణామాలు తెలంగాణలో జరిగినా అశ్చర్యపోనక్కరలేదన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాటాడుతూ మనిషికి ప్రాణం ముఖ్యమని, ఆది మావోయిస్టులదైనా, ఆది వాసీలదైనా, పోలీసులదైనా ఒక్కటేనని, ప్రాణాలను కాపాడానికి కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు.

కే ంద్ర ప్రభుత్వం కేవలం ఆర్థిక పరమైన విషయాలనే ఆలోచిస్తున్నదని, ఆదివాసీలను పట్టించుకోవడం లేదని, అటవీ భూము లను అదానీ, అంబానీలకు అప్పగించడానికే పని చేస్తున్నదన్నారు. 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి గెలిస్తే ఆతరువాత ఎన్నికలు జరుగుతాయన్న గ్యారంటి లేదన్నారు.

కేంద్రంలోని వ్యవస్థలన్నీ బిజెపికి అను కూలంగా పనిచేస్తున్నాయని, ఆర్ఎస్ఎస్, బిజెపి ఫాసిజం దేశంలోకి వచ్చిందని, ఈ ఫాసిజంను లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి గుర్తించాలని, ఫాసిజంకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేసే పోరాటానికి అందరం ఏకం కావాలన్నారు. లేకపోతే తెలంగాణలో బిజెపి ప్రభుత్వం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో పుస్తక రచయిత జి.హరగోపాల్, వనమాల, ప్రొఫెసర్, డిఎన్, ప్రొఫెసర్ జి.విజయ్, రాజేంద్రబాబు అర్వీణి, ఎం.రాఘవాచారి, పి.బి.స్వామి పాల్గొన్నారు.

వార్త

మన జీవితం మనం చేసిన పనులను బట్టి అంచనా వేస్తాం. కాని జీవించిన కాలాన్ని బట్టి కాదు.

న-ఎ. బెర్గ్

# 'అమ్మ'తనానికి అమానవీయ సృష్టి!

తెలుగు రాష్ట్రాల్లో విశ్వామిత్ర 'సృష్టి కి దారులు తెరిచిన కొందరు డాక్టర్ల చేతిలో ఎందరో 'సంతుష్టి లేని దంపతులు మోసపోవడం, అదీ అమానవీయ పద్ధతుల ద్వారా కావడం విచారకరం. జుగుప్సాకరం కూడా. ఈ దందా నడిపే వారికి అండదండలుగా అండ, వీర్య కణాలు సేకరించే సంస్థలు కూడా ఇప్పుడు పోలీసుల దర్యాప్తులో ఇరుక్కున్నాయి. సంతానలేమితో సతమతమవుతున్న వారు, శారీరక అనారోగ్యాల రీత్యా ఇక పిల్లలు కనే అవకాశం లేనివారు, దంపతులిద్దరిలో ఎవరి వీర్యమైనా సంతానోత్పత్తికి పనికిరాని సందర్భంగా సరోగసికి పద్ధతిలో పిల్లల్ని కనడం ఈ మధ్యకాలంలో అందరూ ఆహ్వానిస్తున్నదే. కానీ తన భర్త వీర్యకణాల ద్వారా సంతానం కావాలని ఆశించిన ఓ స్త్రీమూర్తి ఆశలు సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ డాక్టర్ల నిర్వాకంతో భగ్నమయ్యాయి. కానీ ఇంత దారుణంగా తమ దంపతులు కోరుకున్నట్లుగా భర్త వీర్యకణంతో కాకుండా వేరొకరి వీర్యంతో పుట్టిన బిడ్డను సాకాల్సి వచ్చింది. దారుణమేమిటంటే ఒప్పందాన్ని చట్టబద్ధంగా వినియోగించినట్లయితే ఇప్పుడు ఈ సంఘటన బయటకు పొక్కేది కాదు. కానీ బయట ఎక్కడో సేకరించిన పురుషుల వీర్యకణాలను వినియోగించడం, అవి కూడా జన్యుపరంగా క్యాన్సర్ రోగి వీర్య కణాలు కావడమే బెడిసికొట్టింది. రాజస్థాన్‌కు చెందిన సోనియా దంపతులు విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్‌లలో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లను నడుపుతున్న నిర్వాహకులను కలిసారు. ఐవిఎఫ్, సరోగసి, ఐయుఐ పద్ధతుల ద్వారా తాము సంతాన సాఫల్యాన్ని కలిగించగలమని విస్తృత ప్రచారం వారికి కలిసొచ్చింది. కానీ తాజాగా వీర్య కణాల మార్పు వారి కొంప తీసింది. ఫెర్టిలిటీ సెంటర్‌ను హైదరాబాద్‌లో సంప్రదిస్తే ఆమెకు కృత్రిమ పద్ధతిలో సంతానం కలిగించేందుకు ఒప్పందం కుదిరింది. వైద్య పరీక్షలకు మరో 66 వేల రూపాయలు కూడా చెల్లించారు. అనుకున్న 30 లక్షలు సమర్పించాక ఈ ప్రక్రియలో అన్ని ఏర్పాట్లు జరిగిపోయాయి. ఆ బిడ్డను సాకుతుండగా అనారోగ్యం, ఆఖరికి చివరకు క్యాన్సర్ సోకిందని తెలియగానే ఆ జంట హతాశులయ్యారు. దంపతులు ఇద్దరి కుటుంబాల్లో క్యాన్సర్ రోగ చరిత్ర లేనందున డిఎన్‌ఏ పట్టుబడతారు. 'సృష్టి వారు నిరాకరించారు. ఆపై తమ సందేహం తీర్చుకునేందుకు ఢిల్లీలోని వసంత్ కుంజ్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో డిఎన్‌ఏ పరీక్షలు చేయించుకోగా అవి సరిపోలేదు. దాంతో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌పై సోనియా దంపతులు హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్ని సజావుగానే ఉందనుకుంటే సోనియా భర్త వీర్యాన్ని ఎందుకు వినియోగించ లేదు. ఇవన్నీ ఈ కేసును డీల్ చేసిన డాక్టర్లు, కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తేల్చాలి. డబ్బు సంపాదనకు ఇలాంటి మార్గాన్ని ఎంచుకున్న డాక్టర్ను వైద్య వృత్తి క్షమించదు. గతంలో ఇదే డాక్టర్ కొన్ని అక్రమాలతో బయటపడి ఆమె క్లినికల్ లైసెన్స్ రద్దయ్యాయి. మరొకరి పేరిట క్లినిక్ నిర్వహిస్తున్నారని దర్యాప్తులో తేలింది. తమకు అందిన ఫిర్యాదుతో సృష్టి సెంటర్‌ను పోలీసులు, వైద్య, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేయగా ఒక్కటొక్కటిగా లోపాలు, పాపాలు బయటపడుతున్నాయి. దాంతో క్లినిక్‌కి అనుమతులు అక్రమాలు వంటి వాటిని పరిశీలించి కేసులు పట్టిష్ట పరచడానికి నిపుణుల జోక్యం అవసరం ఉంది. ఇటువంటి సంస్థలు ప్రక్రియలు ప్రయోగాలకు చెక్ పెట్టకపోతే మాతృత్వం వెక్కివెక్కి ఏడుస్తుంది. మారుతున్న కాలంలో సంతాన సాఫల్య కేంద్రాలు కొంత వరకు సమర్థనీయమే. కానీ అనుచిత కార్యక్రమాలను అనుమతించరాదు. దంపతులను దగా చేయడమే కాదు. తీరా బిడ్డను పరిశీలించాక కానీ అసలు విషయం వారు తెలుసుకోలేకపోయారు. పుట్టిన బిడ్డ ముఖ కవళికలు రంగు, హావభావాలు, రంగు, ఆహార్యం, ఆరోగ్య పరిస్థితులు వంటి అంశాలు తల్లిదండ్రులతో పోలనప్పుడు మాత్రమే, మళ్ళీ డిఎన్‌ఏ పరీక్షల కోసం వెళ్ళడం ఈ ప్రక్రియలో ప్రధానం. ఫెర్టిలిటీ స్కానింగ్ సెంటర్‌లపై ఎన్ని దాడులు జరిపినా, అక్కడ ఐవీఎఫ్‌కు మోస పోయిన వారు నోరెత్తితే తప్ప ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి దాపురిస్తోంది. దగాకోరు ఆలోచనలతో నగరాలలో విచ్చలవిడిగా వెలుస్తున్న ఫెర్టిలిటీ సెంటర్‌లపై వైద్యశాఖ నిరంతర నిఘా ఉండాలి. సరోగసి చట్టబద్ధమే అయినా, వంచనను సహించకూడదు. హైదరాబాద్ జిల్లాలో 49, రంగారెడ్డిలో 40, మేడ్చల్ జిల్లాలో 30 వరకు ఐవిఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్లున్నా మరికొన్ని అనధికారంగా సాగుతున్నాయి. ఐవీఫ్ ద్వారా గర్భధారణ అవసరం అనుకున్న వారికి అత్యాధునిక చికిత్స, నిరంత పర్యవేక్షణ పేరిట 20 నుంచి 30 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తుంటారు. ఈ సరోగసి ఫెర్టిలిటీ సెంటర్కు అనుబంధంగా స్పెర్మ్ కలెక్ట్ చేస్తున్న సెంటర్ల నిర్వాకంపై టాస్కోర్స్ దాడులు చేసి ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఐవీఎఫ్ సెంటర్లకు స్పెర్మ్ కలెక్ట్ సెంటర్లకు అవినాభావ సంబంధం ఉంటుంది. వీటి రెండిటి మీద వైద్య ఆరోగ్యశాఖ నిఘా తప్పనిసరి. యువకుల వీర్యం కోసం వారికి డబ్బు ఆశ చూపి వారికి పోర్న్ చిత్రాలు చూపిస్తూ వీర్య సేకరణ, అలాగే అండ సేకరణ ఈ సెంటర్ల నిత్య విధి. అనుమతిలేని విధానాలు ,అక్రమ పద్ధతులను నివారించేందుకు వైద్యారోగ్య శాఖ స్పష్టమైన చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఈ పాపంలో అధికారుల భాగస్వామ్యం కూడా క్షమార్హం కాదు!



సంతృప్తే మనిషికి సహజమైన సంపద. భోగాలు, విలాసాలు కృత్రిమమైన దారిద్ర్యం వంటివి.

సోక్రటీస్



అందరిలోనూ శక్తిసామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగంలోనే అసలు సమస్య.

రామకృష్ణ పరమహంస

## ప్రజావాక్కు



### సుప్రీం కోర్టు స్టే ఆర్డర్

జూలై 2006లో ముంబై లోకల్ రైళ్లలో 189 మంది మరణానికి 800మంది గాయాల పాలవడానికి కారణమైన వారిని ప్రత్యేక కోర్టు సుదీర్ఘంగా విచారణ జరిపి 12 మందికి శిక్ష విధించింది. వీరు ముంబై హైకోర్టును ఆశ్రయించగా వీరు నిర్దోషులని తీర్పు ఇచ్చింది. మరి ఈ దారుణానికి కారణమైన దోషులెవరు? నేరాలు జరుగుతున్నాయి. సాక్ష్యాలు లేవని కోర్టులు శిక్షలు విధించకపోతే నేరాలు, ఘోరాలు జరుగుతూనే ఉంటాయి. నేరాలను కళ్లతోచూసినా సాక్ష్యం చెప్పడానికి భయపడుతున్నారు. నేరస్తులను తమ్మినిబిమ్మని చేసి శిక్షలు పడకుండా రక్షించే న్యాయవాదులున్నారు. న్యాయమూర్తులు కూడా నేరం చేసిన వారిని గుర్తించినా సాక్ష్యాలు లేక విడిచి పెడుతున్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన స్టే ఆర్డరు ఏ రూపం దాలుస్తుందో వేచి చూడాలి.

- ఎన్.రామలక్ష్మి, సికింద్రాబాద్

### తెలగ కులాన్ని బీసీగా గుర్తించాలి

దశాబ్దాలుగా అన్ని రంగాల్లో వెనకబడి కుంగిపోతున్నా తెలగ కులాన్ని బీసీగా గుర్తించాలి. గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాల్లో కాపు కులంతో తెలగ కులాన్ని జతచేయడం వల్లనే ఉత్తరాంధ్రలో ఉన్న తెలగ కులాన్ని బీసీగా గుర్తించడంలేదు. ఎందుకంటే కాపులు ఆర్థికంగా బలమైన వారు కాని తెలగకులస్తులు కేవలం వ్యవసాయాన్ని నమ్మి ఆర్థికంగా ఎదగలేకపోయారు. రిజర్వేషన్లు లేకపోవడం వల్ల ఉద్యోగులు సంపాదించలేకపోయారు. అందుకే ఉత్తరాంధ్రలో తెలగకులాన్ని జాగృతం చేయాలి.

- జి. అశోక్ కుమార్, విశాఖపట్నం

### డిఏ బకాయిలు చెల్లించాలి

కరోనా సమయంలో నిలిపివేసిన 18 నెలల డిఏ బకాయిల చెల్లింపువిషయంలో నేషనల్ కౌన్సిల్‌ఆఫ్ జాయింట్ కన్సల్టెటివ్ మెషినరీ స్టాండింగ్ కమిటీ 63 వ సమావేశంలో ప్రభుత్వం తిరిగి చెల్లించాలి అని వాక్కాణించడం కొంచెం ఆలోచించవలసిన విషయం. ఆసమయంలో కుదేలైన ఆర్థిక వ్యవస్థ వల్ల ఈ నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. అందువల్ల 8వ వేతన సంఘం పూర్తిగా అమలు చేయ దానికి అడిగే హక్కు తప్పకుండా ఉంది.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### ఓటీటీ వేదికలపై నిషేధం

సంస్కృతి, మానవీయ విలువలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం 25 ఓటీటీ వేదికలపై నిషేధం విధించడం సకాలంలో తీసుకున్న కీలక చర్య. ఉల్లూ, ఎఎల్టీటీ, బిగ్‌షాట్స్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారాలపై అశ్లీల, అసాంస్కృతిక కంటెంట్ యువతను దారితప్పిస్తోంది. దీని ప్రభావంతో వ్యక్తిగతం నుంచి సామాజిక స్థాయిలో నెగటివ్ ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అసభ్య కంటెంట్ వల్ల యువతలో అసత్య ఆశలు, మానసిక వక్రీకరణ, బాధ్యత లేని ప్రవర్తన పెరుగుతున్నాయి. బాల్య దశలోనే అసభ్య పదజాలం, అసాంఘిక ప్రవర్తన వ్యాపిస్తోంది. కుటుంబ విభేదాలు, మానసిక దిగజారాలు, నేరప్రవృత్తుల వరకు పరిమితమవుతున్నాయి. ఓటీటీలు, సినిమాలు, సోషల్ మీడియా వేదికలు ప్రజలకు సమర్థవంతమైన సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత కలిగి ఉంటాయి. లాభదోపిడీ కోసమే కొన్నిసంస్థలు అసభ్యతను ప్రధానంగా నిలుపుతున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్,శ్రీకాకుళం

### ప్రభుత్వ కార్యాలయాలను ఆధునీకరించాలి

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కార్పొరేషన్ డివిజన్ వారు తహసీల్ పౌరసరఫరాల మొదలగు ప్రాథమికపరిపాలన కార్యాలయాలు చాలావరకు అధ్వాన్నస్థితిలో ఉన్నవి. ఈ భవనాలను శుభ్రపరచకపోవడం వలన అత్యంత భయంకర దృశ్యంగా కనిపిస్తుంటాయి. సున్నం రంగులు వేసినట్టు కనిపించడం లేదు. కొన్ని కార్యాలయాలు పై అంతస్తులో ఉండడం వలన స్త్రీలు వయోధికులు మెట్లమార్గం నుండి పోవడంగగనంగా మారుతున్నది. కంప్యూటర్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు ఉపయోగించే కేబుల్స్ కరెంటు వైర్లు వేలాడుతుంటాయి. ప్రభుత్వాలకు ప్రజలకు ప్రధాన వారధులైన ఈ కేంద్రాల ఆలనాపాలన పట్టించుకోకపోవడం శోచనీయమైన అంశం.

- దండంరాజు రాంచందర్ రావు, పాత బోయినపల్లి

### ఉపాధి హామీ కార్యక్రమాలు చేపట్టాలి

భూమి అభివృద్ధి కార్యక్రమాల వల్ల భూమి చదును పనుల వల్ల రైతు కోణంలో ఉపాధిహామీ పని రైతులకు ఉపయోగకరంగా మారుతుంది. బీడు భూమిని సాగులోకి తేవడం వల్ల రైతు భూమి పంటకు యోగ్యంగా మారడం వల్ల రైతు సంపద కూడా పెరుగుతుంది. నీటి వసతి పెరగడంతో ఉపాధి హామీ ద్వారా మిగులు బీడు భూమి సాగులోకి వచ్చింది. ప్రభుత్వం ఇటువంటి పనిని ప్రోత్సహించాలి.

-భారత అవినాష్, జనగామ

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రకృతి పరిరక్షణలో వివేకం ఏదీ!

**చలితో వణికిపోయే యు.ఎస్, కెనడా వంటి దేశాల్లో కూడా ఎండలు పెరగడం, వివిధ దేశాల్లో భారీ వర్షాలు ముంచెత్తడం భారతీయ నగరాల్లో తీవ్ర ఉష్ణోగ్రతలు, ఊహించని వరదలు, కరువు పరిస్థితులు ఇలా ఒకదానికొకటి పొంతన లేని పరిస్థితులు నెలకొనడానికి వాతావరణంలోని అవాంఛనీయ పరిణామాలే కారణం. సకల అనర్థాలకు మూలకారణం ప్రకృతి విధ్వంసం. ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించడానికి పదాలు చాలవు. అయితే ఈ వర్ణన కొంతకాలానికి గతచరిత్రలా మిగిలిపోయే ప్రమాదం పొంచి ఉన్నది. మానవ జీవన సౌందర్యం మసకబారే రోజులు ఏర్పడుతున్నాయి. మానవ స్వార్థం మాన వాళికే మృత్యుగీతం ఆలపించే తరుణం ఆసన్నమైనది.**



సుంకవల్లి సత్తిరాజు

ఇటీవల చైనా, దక్షిణ కొరియాల్లో వైఫా తుఫాను సృష్టించిన బీభత్సం గురించి మాటల్లో చెప్పలేం. 150కి. మీటర్ల వేగంతో వీచిన పెనుగాలుల ఉధృతికి వందలాది భవనాలు నేలమట్టమయ్యాయి. భారీ వర్షం వలన జన జీవితాలు కకావికలమైనాయి. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. రోడ్డు, రవాణా, కమ్యూనికేషన్ వ్యవస్థలు కుప్పకూలిపోయాయి. ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందిన అంతర్జాతీయ నగరం హాంకాంగ్ హడలెత్తిపోయింది. తైవాన్ టైఫూన్ ప్రళయ గర్జనతో ఘోషించింది. వియత్నాం విలయాన్ని చవిచూసింది. పాకిస్థాన్ భారీ వర్షాలతో భీతిల్లింది. పాక్‌లోని పంజాబ్ ప్రాంతంలో భారీ ప్రాణ నష్టం సంభవించింది. ప్రకృతి విలయ తాండవం ఎంతో మంది ప్రాణాలను బలితీసుకుంటున్నది. భువన గగనాలను శాసిస్తున్నామని విర్రవీగే మానవ విజ్ఞానం ప్రకృతి ముందు మోకరిల్లక తప్పడం లేదు. ఎందుకిలా జరుగుతున్నది? ప్రకృతి ప్రకోపానికి కారణమేమిటి? ప్రకృతి సృష్టిస్తున్న విలయానికి అడ్డుకట్ట వేయలేమా? ప్రకృతిని ధ్వంసం చేయడమే ప్రళయానికి కారణమన్న సంగతిని ఎందుకు గుర్తించలేకపోతున్నాం. ప్రకృతిని పరిరక్షించగలిగితేనే ధరిత్రిలో మానవులు సుఖసౌఖ్యాలతో మనుగడ సాగించగలరు. పచ్చదనానికి పాడె కడితే మానవ పయనం కాటికే దారితీస్తుంది. ఈ సత్యాన్ని గ్రహించక తాత్కాలిక సౌకర్యాల కోసం మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కోవడం ఆత్మహత్యాసదృశం. భవిష్యతరాలకు భద్రమైన సమాజాన్ని అందించాలనే ధ్యేయంతో ప్రతీఏటా జూలై 28వ తేదీని 'ప్రకృతి పరిరక్షణ దినం'గా పాటిస్తున్నాం. పలురకాల కాలుష్య కారకాలతో, వ్యాధులతో, వైరస్‌లతో ప్రపంచం అతలాకుతలమైపోతున్న నేపథ్యంలో 2025వ సంవత్సరం జూలై 28 వ తేదీన జరిగే ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవానికి ప్రాధాన్యత పెరిగింది. మన ముందు తరాలు ముందు చూపుతో ప్రకృతి పట్ల శ్రద్ధ చూపేవారు. పంచభూతాలను ఆరాధ్య దైవాలుగా భావించేవారు. ప్రాచీన కాలం నాటి పెద్దల ఆచారాలను మనం అవహేళన చేశాం. మూఢ నమ్మకాలని కొట్టి పడేశాం. వారు ఆచరించి, ఆరాధించిన ప్రతీ పని వెనుక ఒక పరమార్థం దాగి ఉంది. నాటి మన పెద్దల ఆచార వ్యవహారాలు, జీవన విధానం వారి ముందు చూపుకు నిదర్శమని వర్తమాన పరిణామాలను బట్టి అవగతమవుతున్నది. పచ్చదనం పట్ల వారికున్న మక్కువ, నీటి వినియోగంలో పొదుపు, ఆరోగ్య పరిరక్షణకు అవలంభించిన విధానాలు, వనమూలికలతో వైద్యం, మొక్కల పెంపకం, పశు పెంపకం, వివిధ జీవరాశుల మనుగడ పట్ల ఆసక్తి, అందుకు వారు అవలంభించిన విధానం, మనకు తిండినిచ్చిన నేలతల్లిని కృతజ్ఞతాభావంతో ఆరాధించడం, ప్రతీ పర్వదినానికి ఒక అర్థాన్ని సూచించడంలోని లోతైన విశ్లేషణ మానవ జాతి పదికాలాల పాటు సుభిక్షంగా వర్ధిల్లాలనే వారి ఆకాంక్షను వెల్లడిస్తున్నది. ప్రకృతి పట్ల వారు కనబరచిన ఆరాధ్యభావం అనుసరణీయం. నాటి పెద్దల హితోక్తులు నేటికీ శిరోధార్యం. అయితే గత తరాల దార్శనికతను మూఢత్వంగా భావించి, హేళన చేసి, ఆధునికత్వం పేరుతో ప్రకృతిని పరిహసించిన ఫలితాన్ని నేడు మనం అనుభవిస్తున్నాం. ప్రకృతి సిద్ధమైన జీవన విధానాన్ని విస్మరించి, మన జీవితాలను మనమే ఛిన్నాభిన్నం చేసుకుంటున్నాం. అడవులు విధ్వంసమైపోతున్నాయి. త్రాగునీటికి, సాగునీటికి ప్రాంతాల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి. చినుకు పడితే జనారణ్యాలన్నీ సంద్రంలా మారిపోతున్నాయి. భారీవర్షాల వలన జరిగిన నష్టం, వరదల వలన ప్రజలు పడుతున్న అగచాట్లు కేవలం ప్రకృతి ప్రకోపం వలన సంభవించినవిగా మాత్రమే చెప్పడం సత్యదూరం. ఈ ఉత్పాతాలకు మానవ వైఫల్యాలు చాలా వరకు కారణం.





ప్రస్తుతం జనాభా విపరీతంగా పెరిగింది. రెండు వందల సంవత్సరాల క్రితం ప్రపంచ జనాభా కేవలం వంద కోట్లు. వంద సంవత్సరాల క్రితం సుమారు 318 కోట్లు, 2025 నాటికి ప్రపంచ జనాభా 820 కోట్లకు చేరుకున్నది. 'ఇంతింతై వటుడింతై' అన్న మాదిరిగా ఆకాశమే హద్దుగా, భూమ్యాకాశాలను ఆక్రమించే విధంగా పెరిగి పోయిన జనాభా ప్రకృతి విధ్వంసానికి దారి తీసింది. మానవ స్వార్థం పరాకాష్ఠకు చేరుకుంది. మానవ తప్పిదాలే మానవాళికి ముప్పుగా పరిణమించాయి. సహజ వనరులు తరిగిపోతున్నాయి. మానవ అవసరాలు పెరిగిపోతున్నాయి. గాలి, నీరు కలుషితమై పోయింది. పచ్చదనం హరించుకుపోయింది. వాహన కాలుష్యం పెరిగి పోయింది. 'గ్లోబల్ వార్మింగ్' దుష్ఫలితాలను చవిచూస్తున్నాం. పీల్చే గాలిలో, త్రాగే నీటిలో, తినే తిండిలో స్వచ్ఛత లోపించింది. నాణ్యతా ప్రమాణాలు లోపించాయి. ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంచనాకు అందని విధంగా ఉంది. మానవ దురాలోచన దూరదృష్టిని హరించింది. ప్రకృతిని పరిహసించింది. మానవేతర జీవరాశులు అంతర్థానమైపోతున్నాయి. ప్రకృతి సమతుల్యత లోపించింది. అంటువ్యాధులు ప్రబలిపోతున్నాయి. శాస్త్రజ్ఞులకు అంతుబట్టని బ్యాక్టీరియాలు, వైరస్‌లు విజృంభిస్తున్నాయి. ప్రస్తుత మానవ తప్పిదాలు రోగగ్రస్థమైన ప్రపంచాన్ని రాబోవు తరాలకు అందించడమే ధ్యేయంగా అప్రతిహతంగా కొనసాగుతున్నాయి. ప్రకృతిని పరిరక్షించడంలో ఇకనైనా జాప్యం లేకుండా కట్టుదిట్టమైన చర్యలుచేపట్టాలి. రాబోయే మానవ విలయాన్ని ఆపాలి. తరిగిపోతున్న సహజ వనరులను కాపాడాలి. కాలుష్యరహితమైన ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వినియోగించాలి. రసాయనాల వాడకాన్ని తగ్గించగలగాలి. సహజ సిద్ధమైన జీవన శైలిని అలవాటు చేసుకోవాలి. మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత నివ్వాలి. వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి, పునర్వినియోగానికి అనువైన చర్యలు చేపట్టాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని జీరోస్థాయికి తగ్గించాలి. భూతాపాన్ని తగ్గించడానికి ప్రపంచ దేశాలన్నీ ఏక త్రాటిపైకి రావాలి. ఈ విషయంలో పారిస్ ఒప్పందాన్ని తు.చ తప్పకుండా అమలు చేయాలి. వాతావరణంలో సంభవించే మార్పుల వలన భవిష్యత్తులో అనేకభౌగోళిక మార్పులు జరిగే అవకాశముంది. చలితో వణికిపోయే యు.ఎస్, కెనడా వంటి దేశాల్లో కూడా ఎండలు పెరగడం, వివిధ దేశాల్లో భారీ వర్షాలు ముంచెత్తడం భారతీయ నగరాల్లో తీవ్ర ఉష్ణోగ్రతలు, ఊహించని వరదలు, కరువు పరిస్థితులు ఇలా ఒకదానికొకటి పొంతన లేని పరిస్థితులు నెలకొనడానికి వాతావరణంలోని అవాంఛనీయ పరిణామాలే కారణం. సకల అనర్థాలకు మూలకారణం ప్రకృతి విధ్వంసం. ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించడానికి పదాలు చాలవు. అయితే ఈ వర్ణన కొంతకాలానికి గతచరిత్రలా మిగిలిపోయే ప్రమాదం పొంచి ఉన్నది. మానవ జీవన సౌందర్యం మసకబారే రోజులు ఏర్పడుతున్నాయి. మానవ స్వార్థం మాన వాళికే మృత్యుగీతం ఆలపించే తరుణం ఆసన్నమైనది. పచ్చని ప్రకృతి ఒడిలో పసిపిల్లల వలే ఆనందంతో జీవించే ఆరోగ్యవంతమైన వాతావరణం భువిపై కనుమరుగైపోతుంటే, సహజత్వంలో ఉన్న మాధుర్యాన్ని మరచి, కృత్రిమంగా జీవించే కాలాన్ని ఖరీదు పెట్టి కొనుక్కునే చేటుకాలం దాపురించింది. పండు వెన్నెల్లో పరవసించే కాలం పరిసమాప్తమైనది. ప్రకృతిలో సేద తీరడం మాని, కృత్రిమ, కలుషిత ఆధునిక జీవనవ్యవస్థలో స్వాంతన పొందాలని ఆశిస్తున్నాం. ఇదే మానవ జీవన క్రమంలో మౌనంగా వచ్చి చేరిన మహావిపత్తు. పచ్చదనం హరించబడింది. ప్రకృతి మానవ పరిహాసానికి గురౌతున్నది. ఒకవైపు భూ ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మరోవైపు వాతావరణంలో అవాంఛనీయ పరిణామాలు ఏర్పడుతున్నాయి. గ్రీన్‌హౌస్ వాయువుల ప్రభావంతో సంభవిస్తున్న వాతావరణ మార్పులు అనేక విపత్కర పరిణామాలకు దారి తీస్తున్నాయి. జీవరాశుల మనుగడకు గ్రీన్‌హౌస్ వాయువులు ఎంత ముఖ్యమో, వీటి ప్రభావం అధికమైతే అంతే ప్రమాదం. గ్రీన్‌హౌస్ వాయువులు లేకపోతే భూతల ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీకి పడిపోతాయి. కాబట్టి ఈ వాయువులు తగు పరిమాణంలో ఉండాలి. కాలుష్యాన్ని పెంచే ఇంధనాల వాడకం విపరీతంగా పెరిగిపోతున్నది. మానవ దుశ్చర్యల వలన ప్రకృతి ప్రకోపిస్తున్నది. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్నది. కలుషిత కారకాలతో, అవాంఛనీయ వాతావరణ మార్పులతో భూగ్రహం నిర్జీవంగా మారే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికేమానవ స్వార్థానికి ప్రకృతి చాలావరకు విధ్వంసం కాబడింది. ఇకనైనా మేల్కొని ప్రకృతిపరిరక్షణ చర్యలను వేగవంతంచేయాలి. పచ్చదనాన్ని పెంపొందించాలి. సకల జీవరాశులు ప్రకృతిలో మమేకమై జీవించాలి. ప్రకృతి సమతుల్యత, పరి రక్షణ మీదనే భవిష్య ప్రపంచమనుగడ ఆధారపడి ఉన్నది. •

# ఆత్మహత్యలను అదుపు చేయలేమా?

డాక్టర్. వై. సంజీవ కుమార్

రోజు రోజుకు పెరిగిపోతున్న ఆత్మహత్యలు, చిన్న పెద్ద, అనే తారతమ్యం లేకుండా, చదువుకున్న వాళ్లు, చదువు లేని వాళ్లు కూడా ఒక్క క్షణాన్ని విస్మరించి ప్రాణాలను తీసుకుంటున్నారు. ఉన్నతమైన స్థానాల్లో ఉన్న వ్యక్తులు కూడా ఆత్మహత్యలకు పాలుబడడం అనేది సమాజం విస్తుపోయేలా ఉంది. ఆర్థికభారం అని కొందరు, చదువులలో విజయం సాధించలేదని కొందరు, ప్రేమలో విఫలంఅయ్యామని, కుటుంబ కలహాలు ఇలా అనేకం ఉన్నాయి. కానీ ఎవ్వరికి వాళ్లు ఆ సమస్యల పట్ల నియంత్రణ కోల్పోవడం వాళ్లను వాళ్లు కోల్పోయేలా చేస్తుంది అనడానికి నిదర్శనాలే ఈ ఆత్మహత్యలు. జీవితంలో ప్రతి ఒక్కరు ఏదో ఒక సమస్యతోనే ఉన్నారు. అనేక సమస్యలతో ఉన్నవాళ్లు కూడా నిత్యం జీవితాన్ని నిలుపోవడానికి పోరాటం చేస్తున్నారు. జీవితమంటే అన్ని ఎదురుకొని సాగడమే. అన్నిటిని ఎదుర్కోలేనప్పుడు మానసిక సంఘర్షణ మొదలవుతుంది. సంఘర్షణ మొదలైనప్పుడే నమ్మినవాళ్లతో సమస్యలను పంచుకోవాలి. అప్పుడు మనస్సు బాధ తగ్గుతుంది. చెప్తే ఏమనుకుంటారో అనే ఆలోచనలతో కూడా మనస్సులోని సంఘర్షణలను పంచుకోలేకపోతున్నారు. ప్రాణం ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకోవాలి. ప్రాణం తీసుకుంటే మీ స్థాయికి మీరు మాయని మచ్చను మిగిల్చినవాళ్ళే అవుతారు. సమాజం కూడా మనిషిని బలహీనపరచడంలో ముందు ఉంటుంది. నెగటివ్‌ను ఎక్కువగా ప్రోత్సహిస్తున్నారు. ఎదుటి మనిషిలో మంచిని గ్రహిస్తే ఆ మనిషిలో చెడు ఉన్నాకూడా మంచివైపు మారే అవాకాశం ఉంటుంది. భారతీయ కుటుంబ వ్యవస్థ అంటేనే గొప్పప్రాధాన్యత, గౌరవం. ఆ కుటుంబ వ్యవస్థలో ఆధునికపోకడల వలన ఎవ్వరికి వారే యమునా తీరే అనేలా ఎవ్వరికివాళ్లే గొప్ప అనుకోని జీవిస్తూ నాలుగు గోడల మధ్య ఉండే మనస్పర్థలు, సమస్యలను బాజారుకీ ఈడుస్తున్నారు. అవమానాలను తట్టుకోలేని వాళ్లు బలవర్మణాల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రేమ అనేది జీవితంలో ఒక భాగమే అనేవిషయాన్ని యువత మర్చిపోయి జీవితమే ప్రేమ అనే భ్రమలో వెనకముందు ఆలోచించకుండా ఎదుటి వారి ప్రాణాలను బలిగొంటున్నారు. మరికొందరు వాళ్ల ప్రాణాలు వాళ్లే తీసుకుంటున్నారు. మిమ్మల్ని అల్లారుముద్దుగా పెంచి అహర్నిశలు కష్టపడి వాళ్ళ జీవితాలను పణంగా పెట్టి స్తోమత లేకున్నా మా పిల్లలు మంచి ఉన్నతమైన చదువులు చదవాలి, ఉన్నతంగా ఎదగాలి అని లక్షలకు, లక్షలు ఖర్చుపెట్టి చదివిస్తుంటే మీరు ఇచ్చే బహుమానాలు ఆత్మహతలు, జూదం ఆడటం, వ్యసనాలకు బానిస అవ్వడం. ఒక్క క్షణం ఆలోచిస్తే మీరు ఏమిటి అనేది మిమల్ని ప్రశ్నించుకుంటే తల్లిదండ్రుల గోష అర్థం అవుతుంది. ఉద్యోగం లేదని రాలేదని చనిపోవడం మీచదువును మీరు చంపడమే అవుతుంది. బ్రతకడానికి అనేక మార్గాలు, చదివిన చదువుకు ఉద్యోగం చేసేవాళ్లు ఎందరో ఉన్నారు. చదివిన ప్రతి ఒక్కరికి ఉద్యోగమే కావాలి అని కూర్చుకుంటే మనిషి మనుగడనే ఆగిపోతుంది. చదువు విజ్ఞానం మాత్రమే నేర్పుతుంది. బ్రతుకు బ్రతకాలంటే అనేక మార్గాలు, చిన్నదైనా, పెద్దదైన సిగ్గుపడకుండా చేసుకుంటూ వెళ్తే జీవితంలో ఎప్పుడో ఒకసారి మీ చదువే మీకు మార్గం అవుతుంది. అనాలోచితంగా మీరు తీసుకునే ఆ ఒక్క క్షణం నిర్ణయం మీ జీవితాలనే కాదు, మీ తల్లిదండ్రుల జీవితాలు బుగ్గిపాలు అవుతున్నాయి. మానసిక సంఘర్షణ నివారణకు మార్గాలను అన్వేషించకపోవడమే మనోవ్యాధి పెరిగి తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి ఒక్కరు మీవాళ్లు కాదు, విడిపోయే వాళ్ళు ఎవ్వరు మీ వాళ్లు కాదు. జీవితం రైలుబండి లాంటిది, సాగుతూనే ఉంటుంది. వచ్చే వాళ్లు వస్తుంటారు, దిగేవాళ్ళు దిగిపోతున్నారు, ఒక్క క్షణం ఆలోచిస్తే ఆత్మహత్య మూర్ఖపు ఆలోచనల నుంచి బయట పడతారు. చనిపోయి ఏమి సాధించలేరు. బ్రతికి సాధించి చూపండి. అప్పుడే మీ బ్రతుకుకి ఒక అర్థం ఉంటుంది. చిన్న పెద్దా అనే తారతమ్యం లేకుండా ఆత్మహత్యలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం కమిటీ వేసి ఆ కమిటీలో అన్ని విభాగాలను చేర్చి ఆత్మహత్యలు చేసుకోవాలనే ఆలోచన వచ్చినవారికి ఈ ప్రణాళిక మార్గం చూపించి పరిష్కారం చేయించేలా ఒక ప్రణాళికను సిద్ధం చేయాలి. దాన్ని వెంటనే అమలులో చూపాలి. •

# స్కూల్ బ్యాగుల మోతకు అంతుండదా!

లకావత్ చిరంజీవి

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన తరుణంలో విద్యార్థులపై మళ్ళీ బ్యాగు భారం మొదలైంది. నర్సరీ పిల్లాడి స్కూల్ బ్యాగు బరువు ఐదు కిలోలు పైన ఉన్నప్పుడు ఐదో తరగతి పిల్లాడి స్కూల్ బ్యాగ్ పుస్తకాల బరువు 12 కిలోలకు తక్కువ ఉండదు. అతి చిన్న వయసులోనే ఇంతా బరువు మోయడం వలన పిల్లలు ఇబ్బందులు పడుతుంటే పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదు. భావి భారత పౌరులు బడులకు ఆడుతూ.. పాడుతూ వెళ్లాల్సిన పిల్లలను అధిక బరువుతో పుస్తకాల సంచీ వెన్ను వంచుతోంది. దాని ఫలితంగా పట్టుమని 15 ఏళ్లు నిండక ముందే చాలా మంది నడుము, మెడనొప్పి, కండరాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. అవసరం ఉన్నా లేకున్నా పుస్తకాలు కొనిపించి పిల్లలపై మోయలేని భారాన్ని పాఠశాలల యాజమాన్యాలు వేస్తున్నారు. ఏళ్ల తరబడి బరువైన బడి సంచుల్ని మోయడం వల్ల యుక్త వయస్సు వచ్చేసరికి భుజాలు, వెన్నెముకకు సంబంధించిన సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. పాఠశాలలో బుక్స్ భారం తగ్గించి విద్యార్థులకు గుణాత్మక నైపుణ్య విద్యను అందించాలని విద్యాహక్కు చట్టం చెప్తున్నప్పటికీ ప్రైవేట్ విద్యాసంస్థలు పట్టించుకున్న పాపాన కనిపించడం లేదు. పుస్తకాల భారం తగ్గించాలంటే 2006లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకువచ్చినప్పటికీ 2020లో స్కూల్ బ్యాగ్‌పాలసీ ద్వారా సూచించినప్పటికీ వాటిని అమలు చేయడం లేదు. విద్యార్థులకు అవసరం ఉన్నా లేకపోయినా వేలాది రూపాయలు వెచ్చించి కిలోల కొద్దీ బరువులను విద్యార్థుల వీపునకు తగిలిస్తున్నారు. పుస్తకాల సంచుల మోతతో పాటు పాఠశాలలో సరియైన సదుపాయాలు లేక పిల్లల్లో అనారోగ్య సమస్యలకు కారణమవుతుంది. పోటీ చదువుల పేరిట అటు తల్లిదండ్రులు ఇటు పాఠశాల యాజమాన్యాలు పిల్లలపై పుస్తకాల భారం మోపుతున్నారు. తద్వారా చిన్నారులు విద్యార్థి దశ నుంచి నడుము నొప్పి, కండరాల బలహీనత, మెడ భుజాలు భాగాలలో నొప్పి కలుగుతుంది. అలసటతో బడి నుంచి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి నీరసపడిపోతున్నారు. 10 శాతం బరువు కన్నా ఎక్కువ బరువును మోస్తే పిల్లల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. చిన్న వయస్సు పిల్లలు ఎక్కువ బరువు మోస్తే వారి వారి శరీరం దెబ్బతినే అవకాశం ఉంది. భుజాలు, మెడ,



నడుము భాగాలలో నొప్పికలుగుతుంది. నీరసంగా అనిపిస్తుంది. విసుగు, తలనొప్పి లాంటి సమస్యలు ఎదురవుతాయి. పిల్లలకు పుస్తకాలతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించిన విద్యాబోధన ఉండాలి. ఈ విషయంలో పాఠశాల యాజమాన్యాలు, అధికారులు, తల్లిదండ్రులు చొరవ చూపాలని డాక్టర్లు సైతం అభిప్రాయపడుతున్నారు. పిల్లలు మోయాల్సిన బరువు కంటే అధిక బరువు మోస్తే (వెన్నెముక్క ఒకవైపు వంగిపోవడం) వంటి ఇబ్బందులు వస్తాయి. మరో కారణంగా పాదంపై పట్టు మారుతుంది. నడక తీరు పట్టు తప్పుతుంది. తద్వారా పిల్లలు మానసిక సమస్యలు ఎదుర్కొంటారు. బ్యాగును ఒక వైపే తగిలించుకొని నడవడం కారణంగా భుజం, మెడ నొప్పి వస్తుంది. బ్యాగును నడుము కింద వరకు వేలాడుతూ ఉండి నడిస్తే నడుము దెబ్బతినే అవకాశం ఉంటుంది. పిల్లల బ్యాగుల బరువు తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పిల్లల వీపులు వంగిపోయేలా పుస్తకాల బరువు మోయడం వల్ల వారి ఆరోగ్యం దెబ్బతింటుంది. దీని గురించి చాలా సంవత్సరాలుగా చర్చ జరుగుతున్నప్పటికీ, ఇప్పటికీ ఎవరూ పెద్దగా పట్టించుకునే పరిస్థితిలో లేరని చెప్పవచ్చు. 2020 సంవత్సరంలో ప్రభుత్వం ఒక నూతన పాలసీకి శ్రీకారం చుట్టినా అది అమలుకు నోచుకోలేదు. ప్రతి నెల ఒకటవ, మూడవ శనివారం నోబ్యాగ్ డే పద్ధతిని అమలు చేయాలని ఆదేశించినప్పటికీ ఇది ఎక్కడ అమలకు నోచుకున్న దాఖలాలు కనిపించడం లేదు. పాఠశాలలో అవసరం ఉన్న మేరకే పుస్తకాలు వినియోగించాలి. బడి సంచుల బరువు పై విద్యాశాఖ యంత్రాంగం నిరంతర నిఘా, పర్యవేక్షణ కొనసాగాలి. విద్యార్థుల బడి సంచుల బరువులని తనిఖీ చేసే ప్రక్రియతరచూ చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే పాఠశాలల యాజమాన్యాలపై అధికారులు తగిన చర్యలు తీసుకునే విధంగా కృషి చేయాలి. పిల్లల తల్లిదండ్రుల వైఖరి కూడా వింతగా ఉంటోంది. ఎక్కువ పుస్తకాలు ఇచ్చే పాఠశాల్లోనే చదువు బాగా చెబుతారని వారు నమ్మడంతో పాఠశాల యాజమాన్యం ఇదే అదునుగా భావించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ప్రతిరోజు విద్యార్థులు అన్ని పుస్తకాలు తీసుకెళ్లకుండా అవసరం మేరకే తీసుకెళ్లేలా పాఠశాలలో చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గించేలా ఆయా పాఠశాలలో ర్యాక్స్ ఏర్పాటు చేసి బుక్స్ అన్ని పాఠశాలలో ఉంచుతూ హోంవర్క్ బుక్స్ మాత్రమే ఇంటికి తీసుకెళ్లా చర్యలు చేపడితే విద్యార్థులపై కొంత భారాన్ని తగ్గించవచ్చు. •

# తిరువతిరై వేడుకల్లో ప్రధానిమోడీ ప్రత్యేక పూజలు!



**అరియలూర్ (తమిళనాడు)జూలై 27:** చోళ చక్రవర్తి రాజేంద్ర చోళ జయంతి సందర్భంగా ఇవాళ తమిళనాడులో తిరువతిరై ఉత్సవం వైభవంగా సాగుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గంగైకొండ చోళపురం ఆలయంలో జరుగుతున్న ఈ ఉత్సవానికి హాజరయ్యారు. ప్రధాని సాంప్రదాయ దుస్తులైన తెల్లటి ధోతీ, తెల్ల చొక్కా, మెడలో ధరించే అంగవస్త్రంతో ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలోని స్థానిక పండితులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

తమిళనాడులో తన రెండు రోజుల పర్యటన చివరి రోజున ఇవాళ, ప్రధానమంత్రి రాజేంద్ర చోళుడు ఆగ్నేయాసియాకు సముద్ర యాత్ర చేసి 1,000 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరుగుతున్న స్మారక కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. గంగైకొండ చోళపురం ఆలయ నిర్మాణ ప్రారంభానికి గుర్తుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రాజేంద్ర చోళ భారత చరిత్రలో అత్యంత శక్తివంతమైన, దార్శనిక పాలకులలో ఒకరు. అతని నాయకత్వంలో, చోళ సామ్రాజ్యం దక్షిణ ఇంకా ఆగ్నేయాసియా అంతటా విస్తరించింది. తన విజయ యాత్రల తర్వాత గంగైకొండ చోళపురాన్ని సామ్రాజ్య రాజధానిగా స్థాపించాడు. ఆయన అక్కడ నిర్మించిన ఆలయం 250 సంవత్సరాలకు పైగా శైవ భక్తి, స్మారకనిర్మాణం, పరిపాలనా నైపుణ్యానికి ప్రతీకగా ఉంది. ఈ ఆలయం యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా నిలుస్తోంది.

ఆలయంలోని శిల్పాలు, చోళ కాంస్యాలు, పురాతన శాసనాలకు ప్రసిద్ధి చెందాయి. ఇందులో భాగంగానే తిరువతిరై పండుగ కూడా గొప్ప తమిళ శైవ భక్తి సంప్రదాయానికి నిదర్శనగా పరిఢవిల్లుతోంది. అంతకుముందు, తమిళనాడులో రెండు రోజుల పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ తిరుచిరాపల్లి జిల్లాలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానికి ఘన స్వాగతం లభించింది. గంగైకొండ చోళపురం ఆలయానికి వస్తున్న క్రమంలోనూ ప్రధానికి తమిళనాడు ప్రజలు రోడ్ కు ఇరువైపులా నిల్చుని జయ జయ ధ్వానాలు చేశారు.

## నేను మాట్లాడిన తర్వాతే థాయిలాండ్ కాంబోడియా కాల్పుల విరమణ

### డొనాల్డ్ ట్రంప్ వెల్లడి



**వాషింగ్టన్,జూలై 27:** థాయ్‌ల్యాండ్, కంబోడియా నేతలు కాల్పుల విరమణపై చర్చలకు తక్షణమే అంగీకరించారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. థాయిలాండ్‌తో యుద్ధాన్ని ఆపడానికి కంబోడియా ప్రధాని హున్ మానెట్‌తో ఫోన్లో మాట్లాడానని తన సోషల్‌మీడియా ట్రూత్‌లో వెల్లడించారు. వారు యుద్ధం కొనసాగిస్తే అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు దెబ్బతింటాయని హెచ్చరించినట్లు చెప్పారు. కాల్పుల విరమణ సహా ఘర్షణ ముగింపు కోసం థాయిలాండ్ తాత్కాలిక ప్రధాని వెచాయాచాయ్‌తోనూ మాట్లాడినట్లు ట్రంప్ చెప్పారు. వెచాయాచాయ్‌తో జరిగిన సంభాషణ చాలా బాగుందని ట్రంప్ తెలిపారు. కంబోడియా లాగే థాయిలాండ్ కూడా తక్షణ కాల్పుల విరమణ, శాంతిని కోరుకుంటుందని తెలిపారు. థాయిలాండ్ కంబోడియా సరిహద్దులో వరుసగా నాలుగు రోజుల పాటు జరిగిన ఘర్షణల వల్ల 33మంది మరణించారు. లక్షా 50 వేల మంది స్వస్థలాలను వదిలి మరో చోటుకి వెళ్లారు. థాయ్‌లాండ్‌కంబోడియా మధ్య కొన్నేళ్లుగా సాగుతున్న సరిహద్దు వివాదం ఇటీవల తీవ్రమైంది. ఈ నేపథ్యంలో ఇరుదేశాలకు చెందిన సైన్యాలు పరస్పరం దాడులుచేసుకుంటున్నాయి. అయితే, సైనికులు, ఆయుధాలను సరిహద్దులకు తరలిస్తూ థాయ్‌లాండ్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని కంబోడియా సైన్యం ఆరోపించింది. యుద్ధ సన్నద్ధతను ప్రదర్శిస్తూ రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడింది. థాయ్‌లాండ్ చర్యలను అంతర్జాతీయ సమాజం ఖండించాలని కోరింది. థాయ్‌లాండ్ మాత్రం భిన్నంగా స్పందించింది. కంబోడియాతో చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. అయితే సరిహద్దుల్లో దుందుడుకు చర్యలకు కంబోడియా స్వస్తి పలికాలని షరతు విధించింది. ఈ క్రమంలోనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి పాత పాటే పాడారు. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని విజయవంతంగా ఆపానని మళ్లీ చెప్పారు. కంబోడియా, థాయ్‌లాండ్ మధ్య ఘర్షణ వాతావరణం నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, పాక్ మధ్య వాణిజ్యం ఆధారంగా యుద్ధాన్ని ఆపానని ట్రంప్ ఇప్పటికే పలుమార్లు చెబుతూనే వచ్చారు. భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన ఘర్షణలో 5 యుద్ధ ఫైటర్ జెట్లు కూలిపోయాయని తెలిపారు. ఈ యుద్ధాన్ని తానే ఆపానని, లేకపోతే అణు యుద్ధంగా మారేదేమో అని అన్నారు.

## ఆస్ట్రేలియాలో మరో భారతీయ విద్యార్థిపై కత్తితో దాడి

### తెగిపడిన చేయి

**కాన్‌బెర్రా, జూలై 27:** ఆస్ట్రేలియాలో భారత సంతతి పౌరులపై వరుస దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల ఓ భారత విద్యార్థిపై దుండగులు తీవ్రంగా దాడి చేసిన ఘటన మరవకముందే మరో భారత విద్యార్థిపై కత్తితో దాడి చేసినఘటన వెలుగులోకి వచ్చింది. మెల్‌బోర్న్‌లో ఉంటున్న భారత విద్యార్థి సౌరభ్ ఆనంద్ ఇటీవల ఓ ఫార్మసీ నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలోన దుండగులు అతడిపై కత్తితో దాడి చేసి.. తీవ్రంగా గాయపరిచినట్లు స్థానిక మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఘటనలో సౌరభ్ మెడ, తలకు తీవ్రగాయాలు కాగా.. చేయి తెగిపడింది.

సౌరభ్ ఆనంద్ ఆల్టోనా మెడోస్‌లోని ఓ ఫార్మసీ నుంచి మందులు తీసుకొని ఫోన్‌లో మాట్లాడుతూ ఇంటికి వెళ్తున్నాడు. ఆ సమయంలో ఐదుగురు యువకుల బృందం అతడిపై కత్తితో దాడి చేసింది. వారి సౌరభ్ మెడ నరకడానికి ప్రయత్నించగా.. అతడు తీవ్రంగా ప్రతిఘటించాడు. ఆ సమయంలో అతడి చేతిలోకి కత్తి దూసుకుపోయింది. అనంతరం శరీరంలోని పలుచోట్ల కత్తులతో తీవ్రంగా గాయపరిచి నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని.. తెగిపడిన చేతిని వైద్యులు మళ్లీ అతికించారని పోలీసులు పేర్కొన్నారు. దాడికి పాల్పడిన ఐదుగురు యువకుల్లో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇటీవల ఆస్ట్రేలియాలో భారతీయ విద్యార్థి చరణ్‌ప్రీత్ సింగ్‌పై దుండగులు దాడికి పాల్పడ్డారు. పదునైన వస్తువులతో కొడుతూ.. అతడిని దూషించారు. ఈ ఘటనలో చరణ్ ముఖం, వెనక భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానికులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. జాత్యంహంకారం కారణంగానే భారత విద్యార్థిపై దాడులకు పాల్పడ్డారని పలు మీడియా వర్గాలు వెల్లడించాయి.

## మానసాదేవి ఆలయంలో తొక్కిసలాట

### ఆరుగురు మృతి, అనేకమందికి గాయాలు



**హరిద్వార్, జూలై 27:** ఉత్తరాఖండ్ హరిద్వార్‌లోని మానసాదేవి ఆలయానికి వెళ్లే మార్గంలో తొక్కిసలాట జరిగింది. దీంతో ఆరుగురు భక్తులు మరణించారు. అనేక మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారు. గాయపడిన వారిని హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అయితే విద్యుద్ఘాతం జరుగుతుందనే పుకారువల్లే తొక్కిసలాటకు దారి తీసిందని అధికారులు తెలిపారు. ఆలయాన్ని కూడా మూసివేసినట్లు చెప్పారు.భక్తుల రద్దీ ఒక్కసారిగా పెరగడంతోనే ఇలాజరిగిందని, సహాయక చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

అయితే జులై 23వ తేదీన మాస శివరాత్రి జలాభిషేకం తర్వాత, లక్షలాది మంది కన్వర్ యాత్రికులు, సామాన్య ప్రజలు ఇప్పటికీ హరిద్వార్‌కు చేరుకున్నారు. శనీ,ఆదివారాలు కారణంగా పెద్ద సంఖ్యలో విచ్చేశారు. దీంతో భక్తుల రద్దీ ఒక్కసారిగా పెరగడంతోనే తొక్కిసలాట జరిగిందని సమాచారం. ఘటనలో గర్హ్వాల్ పోలీస్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే ఆరుగురు మరణించినట్లు ధ్రువీకరించారు. దాదాపు 35 మంది గాయపడిన వారిని ఆసుపత్రిలో చేర్చామని ఎస్ఎస్‌పీ ప్రమేంద్ర సింగ్ దోబాల్ వెల్లడించారు. ప్రస్తుతం వారంతా చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. అయితే ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో తొక్కిసలాట జరిగినట్లు సమాచారం అందిందని హరిద్వార్ జిల్లా మేజిస్ట్రేట్ మయూర్ దీక్షిత్ తెలిపారు. దర్యాప్తు తర్వాత మరింత సమాచారం తెలియజేస్తామని అన్నారు. అకస్మాత్తుగా పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడడం వల్ల తొక్కిసలాట జరిగిందని గాయపడిన వారిలో ఓ వ్యక్తి తెలిపారు.

ఆ సమయంలో తాను పడిపోయానని, చేయి విరిగిందని చెప్పారు. ఆలయ ప్రాంగణానికి కేవలం 2025 మెట్ల ముందు భక్తులను అదుపు చేయడానికి ఎవరు లేరని మరో బాధితుడు తెలిపారు. తాను 10-12 మందితో పాటు కింద పడిపోయానని చెప్పారు. మరోవైపు, తొక్కిసలాట కారణంగా ప్రాణనష్టం సంభవించిన నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ సంతాపం వ్యక్తం చేశారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కూడా స్పందించారు. హరిద్వార్‌లోని మానసాదేవి ఆలయం వద్ద తొక్కిసలాట జరిగినట్లు విచారకరమైన వార్తలు అందాయి. స్థానిక పోలీసుల, ఇతర రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకునిసహాయ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నాయి.ఆ విషయంలో నేను నిరంతరం స్థానిక పరిపాలనతో సంప్రదిస్తున్నాను.

పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాను. భక్తులందరి భద్రత కోసం నేను మాతా రాణిని ప్రార్థిస్తున్నానంటూ సీఎం పోస్ట్ చేశారు. ఒక పుకారు కారణంగా మానసాదేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 6 మంది మరణించారు మరియు అనేక మంది గాయపడ్డారు. దురదృష్టకర ఘటన జరిగింది. మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించా. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గాయపడిన వారికి సహాయం చేయడానికి అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50వేలు ఎక్స్‌గ్రేషియా అందించనున్నామని చెప్పారు.

## అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో..

# తెలుగు బాలుడు దుర్మరణం!

### సైక్లింగ్‌కు వెళ్లిన బాలుడిని ఢీకొన్న ట్రాలీ ట్రక్కు

**వాషింగ్టన్, జూలై 27:** తొమ్మిదేళ్ల బాలుడు రోడ్డుప్రమాదంలో మృతి చెందడంతో అమెరికాలో ఉంటున్న ఓ తెలుగు కుటుంబంలో విషాదం నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా ఈపూరు మండలం ముప్పాళ్లకు చెందిన తుర్లపాటి శ్రీనివాసరావు కుటుంబం అమెరికాలోని మిసోరి రాష్ట్రం జెఫర్‌సర్ సిటీలో ఉంటోంది.

శ్రీనివాసరావు ఈ నెల 24న సాయంత్రం 7 గంటలకు (అమెరికా కాలమానం ప్రకారం) తన చిన్నకుమారుడు యత్విక్‌సాయి (9)తో కలిసి సైక్లింగ్‌కు వెళ్లారు. శ్రీనివాసరావు సైకిల్‌పై ముందు వెళుతుండగా.. వెనుక యత్విక్‌సాయి తన స్నేహితులతో కలిసి సైకిల్ తొక్కుతూ వెళుతున్నాడు. ఆ సమయంలో ఓ రోడ్డు మలుపులో చెట్లు అడ్డుగా ఉండటంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు కనిపించలేదు. వేగంగా వచ్చిన ఓ ట్రాలీ ట్రక్కు బాలుడిని ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకెళ్లింది.

ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యత్విక్ సాయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. శుక్రవారం బాలుడికి అంత్యక్రియలు నిర్వహించారు. ఇక, బాలుడి మృతి సమాచారంతో ముప్పాళ్ల గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మనవడి మరణవార్త తెలుసుకున్న నాయనమ్మ విజయ గుండెలవిసేలా రోదిస్తున్న తీరు అక్కడి వారిని తీవ్రంగా కలిచివేసింది.

## ఎన్నికల్లో గణనీయంగా ఓట్లు చీలుస్తాం

### సర్కారు ఏర్పాటు నిర్ణయించేది మేమే...

### జన్‌సురాజ్‌పార్టీ అధినేత ప్రశాంత్‌కిశోర్



**పాట్నా, జూలై 27:** ఈ ఏడాది చివర్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో పార్టీల ప్రచార వేడి క్రమంగా పెరుగుతోంది. ప్రముఖ ఎన్నికల వ్యూహకర్తగా పేరుతెచ్చుకుని కొద్దికాలం క్రితం రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ప్రశాంత్ కిషోర్ తన రాజకీయ పార్టీ జన్ సురాజ్‌పై గట్టి అంచనాలే పెట్టుకున్నారు. తాజాగా ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ జన్ సురాజ్‌ను ఓట్లను చీల్చే పార్టీగా అభివర్ణించారు. కానీ ఇందులో ఒక ట్విస్ట్ కూడా ఉంటుందన్నారు. జన్ సురాజ్ ఓట్లను చీల్చే పార్టీ. కానీ మేము చాలా ఓట్లు చీల్చుకుంటాం అంతిమంగా ఎన్నికల్లో గెలుస్తాం అని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. తమ పార్టీ రాష్ట్ర రాజకీయ డైనమిక్స్‌లో గణనీయంగా మార్పులు తీసుకువస్తుందని చెప్పారు. జన్ సురాజ్ ప్రభావంతో చిన్న పార్టీల వర్కర్లు, సపోర్ట్ బేస్ ఇప్పటికే తమ క్యాంపులోకి వచ్చేసిందని, చిన్న పార్టీలు ఉనికి కోల్పోయినందున వాటి గురించి ప్రజలు చర్చించుకోవడం మానేశారని అన్నారు. ప్రస్తుతం బీహార్‌లో రాజకీయ సంభాషణలన్నీ ఆర్జేడీ సారథ్యంలోని కూటమి, బీజెపి,జేడీయూ కూటమి, జన్ సురాజ్ చుట్టూనే నడుస్తున్నాయని తెలిపారు. రెండో దెబ్బ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ జేడీయూపై పడుతుందని, జేడీయూ కార్యకర్తలు, మద్దతుదారులు, ఓటర్లు పెద్ద సంఖ్యలో జన్ సురాజ్ వైపు మళ్లుతున్నారని ప్రశాంత్ కిషోర్ చెప్పారు. జన్ సురాజ్ ఊపు ఇదేవిధంగా కొనసాగితే మూడో దెబ్బ బిజెపిపై పడుతుందని అన్నారు. రెండు రకాల బిజెపి మద్దతుదారులు జన్‌సురాజ్ వైపు మొగ్గు చూపుతున్నారని, నాయకత్వంపైన, లోకల్ స్థాయిలో పనితీరుపై భ్రమలు తొలగిపోయిన వారు, పైస్థాయిలో మోడీ బాగా పనిచేస్తున్నప్పటికీ రాష్ట్ర స్థాయిలో వైవిధ్యం కోరుకుంటున్న వారు ఈ జాబితాలోకి వస్తారని చెప్పారు.

ముస్లిం ఓటు బ్యాంకు సంప్రదాయంగా లాలూ ఆర్జేడీకి విధేయంగా ఉంటుందని, 30 ఏళ్లుగా ఇదే జరుగుతోందని, అయితే వారంతా ఇప్పుడు తమ వైపు మళ్లే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ప్రశాంత్ కిషోర్ తీసుకువచ్చిన జన్ సురాజ్ ఉద్యమం రాష్ట్ర ప్రజలను ఆకర్షించిందనే చెప్పాలి. అయితే, ఇదంతా ఓట్లుగా మార్చుకోగలదా అనే ప్రశ్న కూడా ఉంది. ప్రశాంత్ కిషోర్ నిజాయితీ, అట్టడుగు స్థాయి నుంచి చేపడుతున్న ప్రచారం బీహార్ రాజకీయాలపై ఏమేరకు ప్రభావం చూపనుందనే చర్చ కూడా జరుగుతోంది. ఆర్జేడీ సారథ్యంలోని మహాఘట్‌బంధన్, ఎన్డీయే కూటమి మధ్య పొత్తులు ఖరారై పోటీ రెండు కూటముల మధ్యే ఉంటుందని అనుకుంటున్న తరుణంలో జన్ సురాజ్ తెరపైకి వచ్చింది. దీంతో ప్రధాన పార్టీల సంప్రదాయ ఓట్ బ్యాంకును ఆ పార్టీ ఏమేరకు గండికొట్టనుందనేది ఆసక్తికరంగా మారుతోంది.

## ఆపరేషన్ సింధూర్‌పై నేటినుంచే లోక్‌సభలో చర్చ

**న్యూఢిల్లీ,జూలై 27:** ఆపరేషన్ సింధూర్‌పై సోమవారం నుంచి చర్చ జరగనుంది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభలో ఆపరేషన్ సింధూర్‌పై చర్చ కోసం కేంద్రం ఏకంగా 16 గంటల సమయం కేటాయించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సమక్షంలో ఈ చర్చ జరగనుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చర్చను ప్రారంభించనున్నారు. రాజ్యసభలోకూడా ఆపరేషన్ సింధూర్‌పై చర్చ జరగనుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రాజ్యసభలో ఈనెల 29 నుంచి 9 గంటలపాటు దీనిపై చర్చ జరుపనున్నట్లు వెల్లడించింది. రెండు సభల్లోనూ చర్చకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమాధానం ఇస్తారు. కాగా ఆపరేషన్ సింధూర్‌పై చర్చకు విపక్షాలు ఎప్పటి నుంచో పట్టుపడుతున్నాయి. భారత్, పాక్ మధ్యతానే కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదేకామెంట్స్ చేస్తుండటంపై కేంద్ర జవాబు చెప్పాలని రాహుల్ డిమాండ్ చేస్తున్నారు.

## రాజ్యాంగ హక్కులపై పౌరులకు అవగాహన కల్పించాలి

### సిజెఐ బిఆర్ గవాయ్

**శ్రీనగర్, జూలై 27:** హక్కులపై అవగాహన లేకపోతే ఎటువంటి ఉపయోగం లేదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పేర్కొన్నారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సమావేశంలో సిజెఐ ప్రసంగిస్తూ.. దేశంలోని పౌరులకు రాజ్యాంగం వారికి ఇచ్చిన హక్కులపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

గతంలో ఉన్నట్లుగా ఎటువంటి విభేదాలు లేకుండా అన్నివర్గాలు సామరస్యంగా జీవించే పాత కాశ్మీర్‌ను పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.గత 35 యేళ్లుగా కాశ్మీర్‌లోని పరిస్థితుల్లో చాలా మార్పులు, లోపాలు తలెత్తాయని.. వాటిని తొలగించడానికి వెంటనే చర్యలు చేపట్టాలని న్యాయవాదులకు సూచించారు. ఎటువంటి సవాళ్లు ఎదురైనప్పటికీ వెనుకడుగు వేయొద్దని పేర్కొన్నారు.

## మహిళల పథకంలో మగాళ్లూ లబ్దిదారులే!

### ఫోర్‌వీలర్ యజమానులు కూడా..

### కోట్లల్లో స్కీం సొమ్ముకొల్లగొట్టిన ఘనాపాటీలు

### ఆటకట్టించిన మహిళా శిశుసంక్షేమశాఖ




**భోపాల్,జూలై 27:** మహిళలకోసం ప్రవేశపెట్టిన పథకంలో లబ్దిదారులుగా మగరాయుళ్లు చేరిపోయారు. పథకం ప్రారంభించిన తర్వాత ఇప్పటివరకూ రూ.21.44కోట్ల నగదు వీరి ఖాతాల్లోకి బదలీఅయింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వ్యవస్థను తప్పుదారి పట్టించి మహిళలుగా తమ పేర్లునమోదుచేసుకున్నారు. సుమారుగా పది నెలల తర్వాతకానీ అధికారులు ఈ విషయం గుర్తించలేదు. వెంటనే పసిగట్టి అధికారులు వీరిపేర్లను తొలగించారు. కొన్ని కుటుంబాల్లో ముగ్గురుకూడా రిజిస్టర్ అయ్యారు. దీనివల్ల ప్రభుత్వానికి 1196 కోట్ల నష్టం వాటిల్లింది. గరిష్టపరిమితి వయసు 65 ఏళ్లుగాపెట్టినా అంతకుపైబడిన 2.87 లక్షలమంది మహిళలకు లబ్దిచేకూరినట్లు తేల్చారు. దీనివల్ల మరో 431.7 కోట్ల నష్టం వాటిల్లుతోంది. ఫోర్‌వీలర్ ఉన్న 1.62 లక్షలమంది మహిళలు కూడా లబ్దిదారుల్లో ఉన్నారు. వీరిపై సమగ్ర దర్యాప్తు చేస్తామని డిప్యూటీ సిఎం అజిత్‌పవార్ అన్నారు. మహారాష్ట్రలో బిజెపి సర్కారుప్రవేశపెట్టిన ఈ పథకం వల్లనే బిజెపి భారీ విజయం సాధించింది. అంతేకాకుండా ఈపథకం ఓటుబ్యాంకును పెంచింది. దీనితో తక్కువ ఆదాయం కలిగిన మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం 'లడ్కీ బెహన్ యోజన' స్కీమ్ ప్రవేశపెట్టినప్పటినుంచి ఇప్పటికీ కొనసాగుతోంది.

ఈపథకం కింద అర్హులైన మహిళలకు నెలకు 1500 రూపాయలు అందిస్తోంది. 21 నుంచి 65 సంవత్సరాల వయసు కలిగిన వారికి ఆర్థిక సాయం చేస్తోంది. మహారాష్ట్రలో మహాయుతి కూటమి అధికారంలోకి రావడానికి ఈ పథకం కూడా ఓ కారణం. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం కారణంగా ప్రభుత్వం విమర్శల పాలు అవుతోంది. ప్రభుత్వం మీద ఏకంగా భారీగా ఆర్థిక భారం పడుతోంది. లడ్కీ బెహన్ యోజన కింద ప్రభుత్వం 24.1 మిలియన్ మంది అర్హులైన ఆడవారికి వారికి 3,700 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. గత సంవత్సరం 1,640 కోట్లు ఖర్చు అయ్యాయి. అయితే, 24.1 మిలియన్లలో ఐదు లక్షల మంది అనర్హుల్ని ప్రభుత్వం గుర్తించింది. సాధారణంగా ఇంట్లో ఒక మహిళ ఉంటే 1500 రూపాయలు వస్తాయి. అదే ఇద్దరు ఉంటే 3000 వేలు వస్తాయి. ఇలా ఎంత మంది ఉంటే అన్ని 1500 రూపాయలు వస్తాయి.

ఇంట్లో ఒకరి కంటే ఎక్కువ మంది ఆడవాళ్లు ఉండటం వల్ల అదనంగా 1,196 కోట్ల రూపాయలు ఖర్చయింది. అయితే మహిళలకోసం ప్రవేశపెట్టిన ఈ స్కీముకు మగాళ్ల కూడా అప్లై చేసుకున్నారు. ఫేక్ ఐడీలు సృష్టించి పథకానికి అర్హత పొందారు. దాదాపు 14,298 మంది మగాళ్ల ఫేక్ గుర్తింపుతో ఈ పథకం కింద ఆర్థికసాయం పొందారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 10 నెలల పాటు ప్రతీ నెలా 1500 రూపాయలు పొందారు. వీరి కారణంగా ప్రభుత్వానికి 21.44 కోట్లు అదనంగా ఖర్చు అయింది. పది నెలల తర్వాత 'ది ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్' ఆ 14 వేల మంది గుట్టురట్టయింది. వారిని పథకం నుంచి తొలగించారు.

## సంక్షిప్తంగా..

### పాఠ్యాంశంగా ఆపరేషన్ సిందూర్




**న్యూఢిల్లీ,జూలై 27:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' వివరాలను స్కూల్ పుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చాలని కేంద్రం నిర్ణయించింది. ఈ విషయాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గతంలోనే ప్రకటించారు. తాజాగా ఈ విషయంపై 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎన్‌సిఇఆర్‌టి)' స్పందించింది. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే ఉద్దేశంతో ఆపరేషన్ సిందూర్‌ను సిలబస్‌లో చేర్చుతున్నట్లు ఎన్‌సిఇఆర్టీ తెలిపింది. పిల్లలకు జాతీయ భద్రత, సైనిక వ్యూహం, దౌత్యం ప్రాముఖ్యతను బోధించడమే ఈ నిర్ణయం వెనకున్న లక్ష్యమని తెలిపింది. ఇందుకోసం ఎన్‌సిఇఆర్టీ ప్రత్యేక మాడ్యూల్‌ను సిద్ధం చేసింది. ఈ మాడ్యూల్ రెండు భాగాలుగా విభజిస్తారు. ఒకటి 3-8 తరగతుల విద్యార్థుల కోసం, మరొకటి 9 నుంచి 12 తరగతుల విద్యార్థుల కోసం రూపొందిస్తారు. ఆదిత్య ఎల్1 చంద్రయాన్ అంతరిక్ష మిషన్‌లు, ఇటీవల శుభాన్షు శుక్లా 'అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)'కు వెళ్లిన అంశాలను కొత్త సిలబస్‌లో చేర్చనున్నట్లు అధికారులు తెలిపారు.

### పాఠశాల భవనం పైనుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య

**అహ్మదాబాద్, జులై 27:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోని నవరంగ్‌పురా ప్రాంతంలోని సోమ్ లలిత్ ప్రైవేట్ స్కూల్‌లో ఒక విద్యార్థిని హటాత్తుగా స్కూలుభవనం 4వ అంతస్తుపైనుంచి పడి చనిపోవడం కలకలం రేపింది. పాఠశాలలోని సిసిటివి ఫుటేజ్ ప్రకారం మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. ఈ వీడియో.. విద్యార్థిని నాలుగో అంతస్తు లాబీలో కీ రింగ్ చేతి వేలితో తిప్పుతూ నడుచుకుంటూ వెళ్లడం కనిపిస్తోంది. ఆ తర్వాత అకస్మాత్తుగా విద్యార్థిని రైలింగ్‌పైకి ఎక్కి కిందకి దూకేసింది. గమనించిన తోటి విద్యార్థులు పరుగున బాలికను పట్టుకునేందుకు వచ్చారు. కానీ అప్పటికే ఆలస్యమైంది. పై నుంచి దూకడంతో విద్యార్థిని తలకు బలమైన గాయం తగిలింది. చేతులు, కాళ్ళ ఎముకలు విరిగిపోయాయి. వెంటనే స్కూల్ యాజమన్యం బాలికను సమీపంలోని నిధి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఐసీయూలో చికిత్స పొందుతున్న బాలికను ఆమె తల్లిదండ్రులు తల్తేజ్‌లోని మరొక ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ బాలిక మరణించింది.

### భర్తప్రాణం తీసిన వివాహేతర సంబంధం!

**పాట్నా,జూలై 27:** బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో ఓ దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. ముఫాసిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లగునియా రఘుకాంత్ గ్రామంలో 30 ఏళ్ల సోను కుమార్ తన ఇంట్లో రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్నాడు. అతడి భార్య స్మితా ఝానే ఈ హత్య చేసిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాథమిక దర్యాప్తులో భాగంగా అనుమానంతో స్మితను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. సోను తండ్రి టుంటున్ ఝా మీడియాతో మాట్లాడుతూ సోను, స్మితలకు ఆరేళ్ల క్రితం వివాహం జరిగిందని, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పారు. అదే గ్రామానికి చెందిన హరిఓమ్ కుమార్ పిల్లలకు ట్యూషన్ చెప్పడానికి వారి ఇంటికి వచ్చేవాడని, తన భార్య ట్యూటర్‌తో అభ్యంతరకర స్థితిలో ఉండగా చూసినట్టు నా కొడుకు చెప్పాడని టుంటున్ ఝా పేర్కొన్నారు. ఈ ఘటన తర్వాత కొంతకాలం ట్యూటర్ రావడం మానేసినట్టు తెలిసింది. అయితే, సోను అన్నయ్య పిల్లలకు ట్యూషన్ చెప్పడానికి ట్యూటర్ తిరిగి రావడంతో మళ్లీ ఆ దంపతుల మధ్య కలతలు మొదలయ్యాయని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

### చిన్నస్వామి తొక్కిసలాటలో చిన్నారి ఆభరణాలు మిస్!

**బెంగళూరు,జూలై 27:** ఆర్సీబీ ఐపీఎల్ 2025 టైటిల్ విజయోత్సవాల సందర్భంగా జూన్ 4న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 13 ఏళ్ల బాలిక దివ్యాంశి మృతదేహం నుంచి రూ. లక్ష విలువైన ఆభరణాలు చోరీకి గురైనట్టు ఆమె తల్లి ఆరోపించింది. దివ్యాంశి తల్లి అశ్విని శివకుమార్ (35) కమర్షియల్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేశారు. అశ్విని శివకుమార్ ఫిర్యాదు ప్రకారం జూన్ 4 సాయంత్రం దివ్యాంశి మృతదేహాన్ని బౌరింగ్ అండ్ లేడీ కర్జన్ ఆస్పత్రి మార్చురీకి తరలించినప్పుడు ఆమె శరీరంపై 6 గ్రాముల బంగారు చెవిపోగులు, 56 గ్రాముల బంగారు గొలుసు ఉన్నాయి. అయితే, శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించినప్పుడు ఈ ఆభరణాలు పూర్తిగా మాయమయ్యాయి.

# మేడారం జాతకు రూ.5 కోట్లు విడుదల

## ఉత్తర్తులు జారీ చేసిన ప్రభుత్వం



**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్కసారలమ్మకు ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. భక్తులు, వీఐపీల కోసం రూ.5 కోట్లతో గెస్ట్ హౌస్ నిర్మాణం చేపట్ట నున్నారు. మంత్రి సీతక్క కృషితో నిధులు విడుదలయ్యాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు జాతర జరుగుతుంది. కాకతీయ రాజుల కాలం నుంచి వస్తున్న ఈ జాతరకు కోటి మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా.ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ములుగు జిల్లాలో ఈ జాతర జరుగుతుంది. ముఖ్యంగా.. జాతర సమయంలో భక్తులు, వీఐపీలు బస చేయడానికి వీలుగా మేడారంలో గెస్ట్ హౌస్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే నాలుగుసూట్ల గెస్ట్ హౌస్ నిర్మాణానికి ఆర్ అండ్‌బీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్ అనుమతులు ఇచ్చారు.

ఈ గెస్ట్‌హౌస్ నిర్మాణం, జాతర నిర్వ హణలో సౌకర్యాలను గణనీయంగా మెరుగు పరుస్తుంది. గెస్ట్ హౌస్ నిధుల మంజూరు వెనుక మంత్రి సీతక్క కృషి ఉందని.. ఆమె ప్రయత్నాలు ఫలించాయని స్థానికంగా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుంభమేళాను తలపించే ఈ సమ్మక్కసారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పటిష్టంగా... ప్రణాళికాబద్ధంగా ఉండాలని మంత్రి సీతక్క అన్నారు.

జాతరలో తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల ఏర్పాటు, విద్యుత్ శాఖ సేవలు, రోడ్ల మరమ్మతులపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక నిధులు కేటాయించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు.గత మేడారం జాతరకు సుమారు కోటి మందికి పైగా భక్తులు హాజరైనట్లు అధికారులు అంచనా వేశారు. ఇది జాతర ప్రాముఖ్య తను, దాని నిర్వహణకు అవసరమైన వనరులను తెలియజేస్తుంది. ఈ భారీ సంఖ్యలో వచ్చే భక్తులకు తాగునీరు, పారిశుద్ధం, వైద్య సేవలు, రవాణా సౌక ర్యాలు వంటి ప్రాథమిక వసతులు కల్పించడం ఒక పెద్ద సవాలు. కొత్తగా నిర్మించనున్న గెస్ట్ హౌస్, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణాన్ని అందిస్తుంది. ఇది జాతర నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, గిరిజన సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ప్రభుత్వ నిబద్ధతను చాటిచెబుతుంది. తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచే మేడారం సమ్మక్క సారలమ్మ వన దేవతల మహా జాతర తేదీలు ఇటీవల అధికారికంగా ఖరారయ్యాయి. ములుగు జిల్లా .. తాడ్వాయి మండలం, మేడారంలోని పుణ్యక్షేత్రంలో 2026 జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు ఈ అద్భుతమైన పండుగ జరగనుందని పూజారుల సంఘం వెల్లడించింది. ఆధ్యాత్మిక తేజస్సుతో వెల్లివిరిసే ఈ ఉత్సవం, లక్షలాది మంది భక్తులను ఆకర్షించి, దైవత్వాన్ని చాటిచెబుతుంది. మేడారం జాతర సుమారు 900 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన అపురూపమైన గిరిజన పండుగ. కాకతీయ రాజుల కాలంలో అన్యాయపు పన్నుల వసూళ్లకు వ్యతిరేకంగా సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు వంటి వనదేవతలు తమ ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేశారనే కథ ఈ జాతర వెనుక ఉంది. వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ, ప్రతి రెండేళ్లకు ఒకసారి ఈ మహా జాతరను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ జాతరను తెలంగాణ కుంభ మేళాగా అభివర్ణిస్తారు. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగలలో ఒకటిగా ఇది గుర్తింపు పొందింది. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో, పెద్ద జాతర మధ్యలో అంటే, 2025 ఫిబ్రవరిలో మేడారంలో మినీ జాతరను నిర్వహించారు. ఈ మినీ జాతర కూడా భక్తులకు వన దేవతల దర్శనం కల్పించే ఒక ముఖ్యమైన అవకాశంగా మారింది. ఈ మహా వేడుకకు దేశం నలుమూలల నుంచి, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రాంతాల నుంచి కూడా కోటి మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం విస్తృతమైన ఏర్పాట్లు చేస్తుంది.

### రాష్ట్ర, దేశ రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి

# ఓ ఉన్నత శిఖరం

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 27:** ఉత్తమ పార్లమెంటేరియన్, మాజీ కేంద్రమంత్రి, సూదిని జైపాల్‌రెడ్డి వర్థంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. రాష్ట్ర, దేశ రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి ఒక ఉన్నత శిఖరం, ప్రజాస్వామ్యం, రాజకీయాల పట్ల లోతైన అవగాహన ఉన్న వ్యక్తి జైపాల్‌రెడ్డి అని అన్నారు. ప్రతి అంశంపై అద్భుతమైన వాగ్ధాటి, చతురత ఆయన సొంతమన్నారు.

విద్యార్థి నాయకుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా అనునిత్యం ప్రజల కోసమే పని చేశారు. తెలం గాణ రాష్ట్ర సాకారంలో జైపాల్‌రెడ్డి పోషించిన పాత్ర ప్రజలెప్పుడూ మరిచిపోలేరని గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లో ఎప్పుడూ విలువల విషయంలో రాజీ పడ లేదని, నిష్కళంక నేతగా, విలువలకు ప్రతీకగా జైపాల్‌రెడ్డి నిలిచారన్నారు. దక్షిణాది నుంచి తొలిసారి ఉత్తమ పార్లమెం టేరియన్ పురస్కారం అందు కున్న నేతగా జైపాల్ రెడ్డి ఘనత సాధించారన్నారు. వారి ఆశయాలను, ఆకాంక్షలను ముందుకు తీసుకుపోవడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు.

# కెటిఆర్ ఆరోపణలు అవాస్తవం

## జూబ్లీహిల్స్ పోలీసుల ఖండన

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** తమపై మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత కెటిఆర్ చేసిన విమర్శలను జూబ్లీహిల్స్ పోలీసులు ఖండించారు. బిఆర్ఎస్ నేత గెల్లు శ్రీనివాస్ భార్యపై పోలీసులు హత్యాయత్నం కేసు అక్రమంగా నమోదు చేశారని కెటిఆర్ చేసిన ఆరోపణలో ఎంతమాత్రం నిజం లేదని జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు. దీనిపై ఆదివారం నాడు జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ సహా ఇతర అధికారులు మీడియాతో మాట్లాడారు. గెల్లు శ్రీనివాస్ సతీమణి శ్వేతపై ఎవిడెన్స్ ట్యాంపర్ కేసు మాత్రమే నమోదు చేశామని, హత్యాయత్నం కేసు నమోదు చేయలేదని వారు తెలిపారు. హైదరాబాద్ సిటీ పోలీసులకు రాజకీయంతో కానీ రాజకీయ నేతలతో కానీ సంబంధం లేదని, పక్కాగా చట్ట ప్రకారం తాము విధులు నిర్వహిస్తామని వారు వెల్లడించారు. అన్ని కేసుల విచారణ పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతుందని, తమపై ఎవరి ఒత్తిళ్లు లేవని వారు తెలిపారు. పోలీసులపై కె టిఆర్ తప్పుడు ఆరోపణలు చేయడం సరైంది కాదని, మాజీ మంత్రి అయిన ఆయన హోదాకు ఇది సరికాదని వారు హితవు పలికారు.

# ఫేషియల్ రికగ్నిషన్‌తో చేయూత

## పెన్షన్‌ల పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త :** తెలంగాణలో చేయూత పెన్షనర్లకు గుడ్‌న్యూస్. జూలై 29 నుంచి ఫేషియల్ రికగ్నిషన్ విధానం ద్వారా పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. వేలిముద్రలు సరిగా లేకపోవడం, మోసాలను నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. తొలిదశలో పోస్టాఫీసుల ద్వారా పెన్షన్ పొందే 23 లక్షల మందికి ఇది వర్తిస్తుంది. దీనికోసం ప్రత్యేక యాప్, కొత్త స్మార్ట్‌ఫోన్లు, శిక్షణ వంటి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఫేషియల్ రికగ్నిషన్ సాధ్యం కానివారికి బయోమెట్రిక్ లేదా గ్రామ కార్యదర్శుల ద్వారా పెన్షన్ అందజేస్తారు. ఈ కొత్త విధానంతో పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.తెలంగాణలో చేయూత పెన్షన్లు తీసుకునే వారికి గుడ్‌న్యూస్. ఇక నుంచి పెన్షన్లు తీసుకునే సమయంలో ఇబ్బందులు ఉండవు. జూలై 29 నుండి ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్) విధానం ద్వారా చేయూత పెన్షన్లను పంపిణీ చేయాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఈ వినూత్న పద్ధతి ద్వారా 44 లక్షల మంది లబ్ధిదారులకు పారదర్శకంగా పెన్షన్లు అందజేయటమ ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.ప్రస్తుతం అమలులో ఉన్న బయోమెట్రిక్ విధానంలో కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా, చాలా మంది వృద్ధుల వేలిముద్రలు అదృశ్యం కావడంతో వారికి పెన్షన్లు అందడం లేదు. అంతేకాకుండా, కొంతమంది పెన్షనర్ల నిధులను ఇతరులు మోసపూరితంగా కాజేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి, ప్రభుత్వం టీజీ ఆన్‌లైన్ సంస్థ సాంకేతిక సహకారంతో ముఖ గుర్తింపు విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది.మొదటి దశలో, పోస్టాఫీసుల ద్వారా పెన్షన్లు పొందుతున్న 23 లక్షల మందికి మాత్రమే ఈ విధానం వర్తిస్తుంది. నగరాలు, పట్టణాల్లోని బ్యాంకు ఖాతాల ద్వారా పెన్షన్లు పొందుతున్న 21 లక్షల మందికి ప్రస్తుత విధానమే కొనసాగుతుంది. ఈ కొత్త విధానం కోసం ప్రత్యేకంగా ఒక యాప్ రూపొందించారు. పోస్టుమాస్టర్లు, పోస్టుమ్యాన్‌లు, పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లకు ఈ యాప్‌ను ఉపయోగించటంపై ఇప్పటికే ట్రైనింగ్ ఇచ్చారు. సుమారు రూ. 13 కోట్లతో 6,000 మంది పోస్ట్‌మ్యాన్‌లు, పోస్టుమాస్టర్లకు కొత్త స్మార్ట్‌ఫోన్ల కొనుగోలుకు ఆర్డర్ ఇచ్చారు. రాష్ట్రస్థాయి అధికారులకు ఇప్పటికే శిక్షణ పూర్తి కాగా.. నేడు పోస్టల్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులకు శిక్షణ ఇస్తారు. అనంతరం వారు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటారు.సోమవారం పెన్షన్లకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుంది. మంగళవారం (జూలై 29) నుంచి ఈ కొత్త విధానాన్ని ప్రారంభించాలని అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులు పోస్టాఫీసుకి వెళ్లినప్పుడు వారి ఫోటో తీసి ఆధార్‌లో ఉన్న ఫోటోతో సరిపోల్చి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత వారికి పెన్షన్ చెల్లిస్తారు. ఒకవేళ ఎవరైనా ఫోటోలు తీయలేని పరిస్థితిలో ఉంటే, వారికి బయోమెట్రిక్ విధానం ద్వారా పెన్షన్ ఇస్తారు. ముఖ గుర్తింపు, బయోమెట్రిక్ రెండూ పనిచేయని సందర్భాలలో గ్రామ కార్యదర్శులు వేలిముద్రలు వేసి పెన్షన్ ఇప్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కొత్త విధానం వల్ల పెన్షన్ పంపిణీలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం వస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

### నేడు ట్రైబల్ వెల్ఫేర్ అడ్వైజరీ కమిటీ సమావేశం

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ అడ్వైజరీ కమిటీ సమావేశం నేడు(సోమవారం) జరగనుంది. ఉదయం 11 గంటలకు మాసబ్‌ట్యాంక్‌లో గల దామోదరం సంజీవయ్య సంక్షేమ(డిఎస్ఎస్) భవన్‌లో జరగనుంది. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్వర్యంలో సమావేశం జరగనుంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత జరుగుతున్న మొదటి ఆదివాసీ సంక్షేమ సలహా కమిటీ సమావేశం. సమావేశంలో పలు అంశాలను చర్చించనున్నట్టు తెలుస్తోంది.

# జూరాలకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

## 12 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

## 202 టిఎంసిలకు చేరిన శ్రీశైలం డ్యాం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 27, ప్రభాతవార్త:** ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. కర్ణాటకలోకి ఆల్మట్టి, నారాయపూర్ జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. నారాయణపూర్ జలాశయాలు నిండుకుండల్లా మారడంతో దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో జూరాలకు వరద పోటెత్తుతున్నది.



శ్రీశైలం నుంచి విడుదలవుతున్న వరద

జూరాల డ్యామ్‌కు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది. జలాశయానికి 10,8000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.226టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 32719క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 81000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్టు -2కు 750 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 550 క్యూసెక్కులు, కుడి కాలువకు 500క్యూసెక్కులు, సమాంతర కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 93962క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

### 198 టిఎంసిలకు శ్రీశైలం డ్యాం

### ఒక గేటు ద్వారా సాగర్‌కు నీటి విడుదల

శ్రీశైలం జలాశయానికి వరద స్థిరంగా కొనసాగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాం జలకళను సంతరించుకున్నది. దీంతో ప్రాజెక్టు ఒకగేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 34,088క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 31504క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 52,682 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం నుంచి 1,18,274 క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 882.825అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 198.8120 టీఎంసీలకు చేరింది. పవర్‌హౌజ్‌కు 66,417క్యూసెక్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.

# ఎప్‌సెట్-2025 సెకండ్ ఫేజ్.. అందుబాటులో 30,941 సీట్లు

### రెండు రోజుల్లో సీట్ల కేటాయింపు

### మొదటి విడతలో 59,980 మంది చేరిక

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. కౌన్సెలింగ్‌లో భాగంగా ఇప్పటికే మొదటి విడత సీట్ల కేటాయింపు పూర్తి కాగా.. రెండో విడత సీట్ల కేటాయింపుకి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది.

రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా ఈ నెల 25 నుంచి స్లాట్‌బుకింగ్‌కి అవకాశం కల్పించారు. 26న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ముగించారు. శనివారం, ఆదివారం వెబ్ ఆప్షన్లకి అవకాశం కల్పించారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 30 సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. అయితే మొదటి విడత కౌన్సెలింగ్‌కి రెండో విడత కౌన్సెలింగ్‌కి మధ్యలో అదనంగా కొన్ని ప్రైవేటు కాలేజీలకు అదనపు సీట్లను కేటాయించారు. దీంతో మొదటి విడతలో కంటే రెండో విడతలో సీట్లు పెరిగాయి. దీంతో రెండో విడతలో 30,941 సీట్లు అందుబాటులో ఉన్నట్టు కౌన్సెలింగ్ అధికారులు ప్రకటించారు.

మొదటి విడతలో మొత్తం ఇంజనీరింగ్ సీట్లు 1,07,444 సీట్లు అందుబాటులో ఉండగా.. అదనపు సీట్లతో కలిపి రెండో విడతకి 1,16,877కి పెరిగాయి. దీంతో కన్వీనర్ కోటా సీట్ల సంఖ్య 83,054 నుంచి 90,921కి పెరిగాయి.

మొదటి విడత సీట్ల కేటాయింపులో భాగంగా 77,561 సీట్ల కేటాయింపు చేయగా.. అందులో 59,980 మంది కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. దీంతో మొదటి విడతలో ప్రకటించిన సీట్లు, రెండో విడతలో అదనంగా పెరిగిన సీట్లతో కలిపి రెండో విడతలో 30,941 సీట్లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు రెండో విడతకి వెబ్ ఆప్షన్లు ఇవ్వగా.. ఈ నెల 30న సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు.

# బ్యాంకుల నిర్వచనం మారింది



## టెక్నాలజీని మిళితం చేస్తూ మార్పునకు అనుగుణంగా సేవలు

## దేశ ఆర్థిక వ్యవస్థలో సహకార బ్యాంకుల పాత్ర కీలకం

## ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** ఒకప్పుడు బ్యాంకులంటే కేవలం డబ్బుల డిపాజిట్, విత్‌డ్రా మాత్రమే అనుకునేవారు.. కానీ ఇప్పుడు ఆ నిర్వచనం మారిందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఖాతా దారుల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా టెక్నాలజీని మిళితం చేస్తూ మార్పులను అందిపుచ్చుకుంటూ వివిధ రకాల సేవలను బ్యాంకులు అందిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఆదివారం అగ్రసేన్‌బ్యాంక్ అమీర్ పేట్ బ్రాంచ్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. 'దేశ ఆర్థిక వ్యవస్థలో సహకార బ్యాంకుల పాత్ర కీలకం అన్నారు. ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు ఆర్థిక సేవలను అందించడంలో ఇవి ముందున్నాయని, ఆర్‌బిఐ వార్షిక నివేదిక 2024 ప్రకారం దేశవ్యాప్తంగా 8.5 కోట్ల మందికి పైగా ప్రజలు వీటి సేవలను వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. మొత్తం డిపాజిట్లు, రుణాలు రూ. 5.5 లక్షల కోట్ల మార్కును దాటాయని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.

**క్రెడిట్, డిపాజిట్ నిష్పత్తి 66.7 శాతం..**

తెలంగాణలో 48 అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు 321 శాఖల ద్వారా అర్బన్, సెమీ - అర్బన్ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నాయని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో వీటి బిజినెస్ టర్నోవర్ రూ.17వేల కోట్లు. క్రెడిట్, డిపాజిట్ నిష్పత్తి 66.7 శాతం. కూకట్ పల్లి, మలక్ పేట్, అమీర్ పేట్ తదితర ప్రాంతాల్లో క్రియాశీలకంగా ఉన్నాయన్నారు.

**తెలంగాణ మోడల్ పాథ్..**

సహకార బ్యాంకులు లాభాపేక్షతో కాకుండా, ఖాతా దారుల ప్రయోజనాల కోసం కమ్యూనిటీ ఆధారిత సేవలను అందిస్తున్నాయని తెలిపారు. కేర్(కమ్యూనిటీ ఫోకస్డ్, అఫర్డబుల్ యాక్సె సిబుల్ క్రెడిట్, రిలేషన్‌షిప్ బేస్డ్ బ్యాంకింగ్, ఎంపవరింగ్ లోకల్ ఎంటర్‌ప్రెన్యూర్స్) మోడల్‌లో పని చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సహకార రంగ బ్యాంకుల అభివృద్ధికి పాథ్ పిఎటిహెచ్ (పాలసీ సపోర్ట్, యాక్సెస్ టూ డిజిటల్ టూల్స్, ట్రైనింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్, హైబ్రిడ్ ఫైనాన్స్ ఎకోసిస్టమ్స్) మోడల్‌ను అనుసరిస్తుంది. యువత, వెనుకబడిన వర్గాలకు స్వయం ఉపాధి రుణాలు, మహిళా స్వయం సహాయక బృందాలకు రుణ అనుసంధానాలు, గ్రీన్ లోన్స్ వంటి పథకాలను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అగర్వాల్ సమాజ్ ప్రెసిడెంట్ అనిరుధ్ గుప్తా, టిబారుమల్ జ్యూవెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రాంభరోసే గుప్తా, సోమాని ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి అశోక్ కుమార్ సోమాని, అగ్రసేన్ బ్యాంక్ ఛైర్మన్ ప్రమోద్ కుమార్ ఖేడియా, సీనియర్ వైస్ ఛైర్మన్ నవీన్ కుమార్ అగర్వాల్, వైస్ ఛైర్మన్ సురేష్ కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి బిల్లుపై బిజెపి జాతీయ నాయకత్వం మౌనం

## తెలంగాణలో మాత్రం మద్దతు

## మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** బిజెపి జాతీయ నాయకత్వం బిసి బిల్లుపై మౌనంగా ఉంటే తెలంగాణలో బిజెపి అదే బిల్లుకు మద్దతు ఇస్తుందని ఆ పార్టీ ద్వంద్వవిధానంను మాజీ పిసిసి ప్రసిడెంట్ వి.హనుమంతరావు ఒక పత్రికా ప్రకటనలో ధ్వజమెత్తారు. బిసిలకు తెలంగాణ జనాభాకు అనుగుణంగా 42శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి ఎవరు ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని చేధించి అమలు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జ్యోతిరావ్‌బా పూలే, సావిత్రిభా పూలే వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి చదువు బోధించు అనే సూత్రంతో కృషిచేశారని అదే స్పూర్తితో కాంగ్రెస్ కులవివక్షలేని సమాజాన్ని రూపొందించేందుకు కృషిచేస్తుందని అన్నారు.మేం ఎంతో మాకు అంత అని భారత్‌జోడో యాత్రలో రాహుల్ గాంధీ ప్రమాణం చేశాడని దానికి అనుగుణంగా మా పోరాటం ఉంటుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రిజర్వేషన్ శాస్త్రీయంగా చట్టపరంగా ఏలాంటి చిక్కులు తలెత్తంగా బిసి గణన చేశారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. రాహుల్‌గాంధీ 21వ శతాబ్దం పూలే అని అభివర్ణించారు. రాహుల్‌గాంధీ వెనుకబడిన తరగతుల ఆర్థిక అభ్యున్నతికి సామాజిక సమానత్వంకు పాటుపడుతున్నారని అన్నారు.



# బాబును బస్టాండ్‌లో వదిలేసిన మహిళ ప్రియుడితో జంప్

## సిసి కెమెరాల ఫుటేజీ ద్వారా వారిద్దరి గుర్తింపు

## బాలుడిని కాపాడిన నల్గొండ టూటౌన్ పోలీసులు

**నల్లగొండ, జూలై 27, ప్రభాతవార్త:** తల్లి తన రెండు సంవత్సరాల బాలుడిని వదిలేయగా తక్షణమే స్పందించి సీసీ కెమెరాలు, ఫొటో ద్వారా గుర్తించి సు రక్షి తంగా రక్షి ంచి తల్లిదండ్రులకు అప్పగించిన నల్గొండ టూటౌన్ పోలీసులు ఇప్పుడు జిల్లావ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నారు. నల్లగొండ బస్టాండ్‌లో ఏడుస్తూ ఒంటరిగా ఉన్న 15 నెలల బాలుడిని గుర్తించిన ఆర్టీసీ సిబ్బంది తక్షణమే నల్లగొండ టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే టూటౌన్ ఎస్ఐ ఎర్ర సైదులు సైదులు తమ సిబ్బం దిని అప్రమత్తం చేసి ఘటనాస్థలానికి చేరుకుని తగిన ఆధారాలతో విచారణ ప్రారంభించారు. సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించి బాలుడిని బస్టాండ్‌లో వదిలి తల్లి వేరే వ్యక్తితో బైక్‌పై వెళ్లినట్లు గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ ఇన్‌స్టాగ్రామ్‌లో నల్గొండలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓ వ్యక్తికి పరిచయమై తన 15 నెలల బాలు డిని నిర్దాక్షి ణ్యంగా బస్టాండ్‌లో వదిలేసి అతనితో కారులో వెళ్లి నల్లగొండ పోలీస్‌స్టేషన్ పరిధి లోని ఒక రూమ్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించి మహిళ ను, ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వెంటనే తల్లిదండ్రులను గుర్తించి పిలి పించగా, వారితో సుదీర్ఘ కౌన్సిలింగ్ నిర్వహించి, చట్టబద్ధంగా బాలు డిని తిరిగి బాలుడి తండ్రికి అప్పగించారు. ఈ ఘటనపై నల్గొండ జిల్లా పోలీ సులు, ప్రజలు, శిశు సంక్షేమ సంస్థలు

# కిచెన్‌లో నిఘా నేత్రాలు.. ఫుడ్ పాయిజన్‌కు చెక్

## కమిటీలు, సేఫ్టీ అధికారుల తనిఖీలు

## త్వరలో మార్గదర్శకాలు విడుదల

## సంక్షేమ గురుకులాలపై సర్కార్ దృష్టి

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** తెలంగాణలోని సంక్షేమ గురుకులాల్లో తరచూ ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో సర్కార్ అప్రమత్తమైంది. ఫుడ్ పాయిజనింగ్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగం గా రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంక్షేమ గురు కులాల కిచెన్‌లలో ఇక నుంచి అత్యాధుని కమైన సీసీ కెమెరాలు ఏర్పాటుచేయనున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలిచ్చినట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురు కులాల్లో ఈ కెమె రాలను ఫిట్ చేయనున్నారు. ఇప్పటికే గురు కులాల సెఫ్టీలో భాగంగా ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ, నేరుగా కిచెన్ లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని ప్రభుత్వం ఒక నిర్ణయా నికి వచ్చింది. దీంతోపాటు అడిషనల్ కలెక్టర్లు, స్థానిక నేతలు, అధికారులతో కమిటీలు వేయనుంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం త్వరలోనే కలెక్టర్లకు జారీచేయనున్నది. వాన కాలం సీజన్ షురూ కాగానే రెగ్యులర్‌గా గురు కులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేస్తున్నాయి. దీంతో ఫుడ్ పాయిజన్ ఘటనలను సీరియస్‌గా తీసుకున్న సర్కార్ స్పష్టమైన యాక్షన్ ప్లాన్, సెక్యూరిటీ మెజర్స్‌తో ముందు కెళ్లాలని భావిస్తోంది. కాగా ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏ గురుకులాల్లోని కిచెన్‌లలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. అయితే ఈ దఫా తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సిందేనని ప్రభుత్వం ఆదేశాలు న్నాయి. ఈ కెమెరాలు ఏర్పాటు వెనక బలమైన కారణం ఉన్నదనే విషయాన్ని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రత్యేక రిపోర్టు కూడా ఉన్నట్లు పేర్కొంటున్నారు. గత కొన్ని రోజుల నుంచి వరుసగా గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయి. గత ఏడాదిలోనూ ఎక్కువగానే సంభవించాయి. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఘటనలపై వివిధ రూపాల్లో రహస్య విచారణ చేయించినట్లు తెలియవచ్చింది. ఈ విచారణ తర్వాత ఫుడ్ పాయిజన్ సంఘటనల్లో కుట్ర కోణం దాగినట్లు ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇలాంటివి పునరావృతం కాకుండా, ఒక వేళ చేసిన స్పష్టమైన ఆధారాలను పసిగట్టేందుకు సంక్షేమ గురుకులాల కిచెన్లలోనూ సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు సంక్షేమ శాఖల అధికారుల ద్వారా వెల్లడవుతోంది. ఈ సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించనున్నారు. అక్కడ్నుంచి ప్రత్యేక



టీమ్ సంక్షేమ గురుకులాలను మానిటరింగ్ చేయనున్నాయి. దీనితో పాటు, ఇక ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు కూడా రహస్య తనిఖీలు చేయనున్నారు. ఎప్పటికప్పుడు శాంపిల్స్ సేకరించి టెస్టులు నిర్వహించనున్నారు. నిరక్ష ్యంపై వహించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకునేలా యాక్షన్ ప్లాన్ కూడా రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

## కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెట్టే సమయం వచ్చింది

## బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆగ్రహం

**ప్రభాతవార్త, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో:** త్వరలో జరగ బోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్ నాయకులకు కర్రు కాల్చి వాత పెట్టాలని, కాంగ్రెస్ పాలకులు డబ్బులు దండుకోవడానికే పనిచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పాలకులు డబ్బులు దండుకోవడానికే పనిచేస్తుస్తున్నారని టెండర్లు పిలిచి ప్రజాధనం లూటీ చేశారని అన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బిఆర్ ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణ రెడ్డి అధ్యక్షన ఏర్పాటు చేసిన సమావేశానికి బిఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరైనారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. జరుగుతున్న అవినీతిపై అసెంబ్లీలో నిలదీస్తామని తెలిపారు. కమీషన్లు వచ్చే చోటనే కాంగ్రెస్ పాలకులు పనిచేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గృహలక్ష్మీ ్మ పథకం కింద మహిళలకు 3వేల ఇళ్లు మంజూరు చేశామని తెలిపారని పథకం పేరు మార్చి లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరినప్పటికీ పట్టించుకోలేదని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న 3వేల మందికి లబ్ధి చేకూరే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలని చెప్పి కాంగ్రెస్ నేతలు ప్రజలను బురిడీ కొట్టించారని కేటీఆర్ ఆరోపించారు. ఇంట్లో ఉన్న అత్తాకోడళ్లకు పింఛన్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని అన్నారు. అత్తకు రూ.4వేలు, కోడలికి రూ.2500 ఇస్తామని ఇచ్చింది లేదని చెప్పారు. ఆడబిడ్డలకు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున రేవంత్ రెడ్డి బాకీ ఉన్నారని తెలిపారు. కల్యాణలక్ష్మీ ్మ కింద తులం బంగారం అని చెప్పి మభ్యపెట్టారని మండిపడ్డారు. రైతుబంధు రూ.15వేలు ఇస్తామని రెండు నెలలు ఎగ్గొట్టారని అన్నారు. ఎన్నికలు వస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇస్తోందని తెలిపారు. సమయం దొరికినప్పుడే కాంగ్రెస్ నేతలకు వాత పెట్టాలని అన్నారు. కాంగ్రెస్ నేతల బెదిరింపులకు ఎవరూ భయపడొద్దని స్పష్టం చేశారు. కర్రుకాల్చి వాత పెట్టకపోతే కాంగ్రెస్ నేతలకు బుద్ధిరాదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎరువుల కోసం క్యూలైన్‌లో నిలబడిన రోజులు ఉన్నాయా అని కేటీఆర్ ప్రశ్నించారు. పరకాలకు వస్తుంటే పలుచోట్ల రైతులు క్యూలైన్‌లో నిలబడి కనిపించారని తెలిపారు. ఈ ముఖ్యమంత్రికి సమయానికి యూరియా ఇచ్చే సోయి లేదని విమర్శించారు. కోటిమందిని కోటీశ్వరులను చేస్తామని ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన తీర్పిస్తే దిగి వచ్చి పథకాలు అమలు చేస్తారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇంటికి వచ్చిన మన బీఆర్ఎస్ నాయకులను ఆదరించాలని కోరారు. కేసీఆరే వచ్చిండని కడుపులో పెట్టుకుని చూసుకోవాలన్నారు. టిఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష ్యంగా ముందుకు సాగాలని అన్నారు సమన్వయంతో ముందుకు వెళ్లి టిఆర్ఎస్ను అధికారంలోకి తెప్పించుకోవాలని సూచించారు. సమావేశంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్ పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి, నన్నపనేని నరేందర్, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, ఆయా మండలాల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ప్రద ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# కాంగోలో తిరుగుబాటుదారుల ఘాతుకం.. 21 మంది మృతి

**బ్రెజ్జవిల్లే, జూలై 27:** ఆఫ్రికా దేశమైన కాంగోలో ఇస్లామిక్ స్టేట్ మద్దతు కలిగిన తిరుగుబాటుదారులు రెచ్చిపోయారు. ఓ చర్చి ప్రాంగణంలో జరిపిన దాడుల్లో దాదాపు 21 మంది మృతి చెందారు. తూర్పు కాంగో కోమాండాలోని ఓ క్యాథలిక్ చర్చి ప్రాంగణంలో అలైడ్ డెమోక్రటిక్ ఫోర్సెస్ (ఎడిఎఫ్) సభ్యులు తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో కాల్పులకు తెగబడ్డారు. ఈ హింసాత్మక ఘటనలో అనేక ఇళ్లు, దుకాణాలు కూడా దహనమయ్యాయి.

'సాయుధ తిరుగుబాటుదారులు దాదాపు 21 మందిని కాల్చి చంపారు. మూడు మృతదేహాలు కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. అదేవిధంగా అనేక ఇళ్లు దహనమయ్యాయి. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి' అని ఓ సామాజిక కార్యకర్త మీడియాకు వెల్లడించారు. కాంగో సైనిక ప్రతినిధి సైతం ఈ దాడులను ధ్రువీకరించారు. అయితే.. ఈ ఘటనలో 10 మంది మరణించినట్లు చెప్పారు.

ఇస్లామిక్ స్టేట్‌తో ముడిపడి ఉన్న ఎడిఎఫ్ తిరుగుబాటు సంస్థ.. ఉగాండా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో సరిహద్దు ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. పౌరులే లక్ష్యంగా అనేక సంవత్సరాలుగా దాడులకు పాల్పడుతోంది. 2013 నుంచి ఇప్పటివరకు దాదాపు 6,000 మందిని బలిగొన్నట్లు నివేదికలు ఉన్నాయి. ఎడిఎఫ్‌పై అమెరికా, ఐరాస భద్రతామండలి ఆంక్షలు విధించాయి.

# సిఎం రేవంత్‌రెడ్డితో జర్నలిస్ట్ రానా అయ్యూబ్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 27:** ప్రముఖ జర్నలిస్ట్, రచయిత రానా అయ్యూబ్ ఆదివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. భారతదేశానికి సంబంధించిన రాజకీయ, సామాజిక అంశాలపై రాసే తన తదుపరి పుస్తకానికి సంబంధించిన సమాచారం సేకరణలో భాగంగా ఈ సమావేశం జరిగినట్లు సమాచారం. వాషింగ్టన్ పోస్ట్ అభిప్రాయ కాలమిస్టుగా పనిచేస్తున్న రాణా అయూబ్ తన మొదటి పుస్తకం 'గుజరాత్ ఫైల్స్: అనాటమీ ఆఫ్ ఎ కవర్‌అప్'తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. ఆమె ప్రస్తుతం రాస్తున్న కొత్త పుస్తకంలో దేశ రాష్ట్రాల పాలన, ప్రజల సమస్యలు, రాజకీయ నాయకుల దృక్పథాలను లోతుగా పరిశీలించాలనే ఉద్దేశ్యంతో ఈ భేటీ జరిపినట్లు తెలుస్తోంది.

# యూరియాపై బిజెపివి అర్థంలేని మాటలు

## రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నులే కేటాయింపు

## లెక్కలతో బిజెపి రాష్ట్ర చీఫ్ రామచందర్‌రావుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 27:** రాష్ట్రానికి యూరియా సరఫరా కొరతపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు వ్యవసాయరంగంపై కనీసం అవగాహన లేకుండా మాట్లాడడం విడ్డూరంగా ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి యూరియా కేటాయింపులు, సరఫరా అంశాలపై అవగాహన లేకుండా, రాష్ట్ర రైతాంగాన్ని తప్పుదోవ పట్టించేలా మట్లాడడం సరికాదని మంత్రి తుమ్మల హితవు పలికారు.

ఆదివారం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావుకు యూరియా సరఫరాకు సంబంధించి పూర్తి లెక్కలతో మంత్రి తుమ్మల లేఖ రాశారు. యూరియాపై బిజెపివి అర్థంలేని మాటలని ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వ్యవసాయరంగంపై కనీసం అవగాహన లేకుండా, ఒక రాష్ట్రానికి పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ నిజనిజాలు బేరీజు వేసుకోకుండా మాట్లాడడం సరికాదని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసిందని చెప్పడం వారికి, వారి పార్టీకి రాష్ట్ర రైతాంగం పట్ల ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. రైతాంగం విషయంలో ఎలాంటి రాజకీయాలకు తావివ్వకూడదని ఎకన్నోసార్లు వ్యవసాయ మంత్రిగా తాను విన్నవించినప్పటికీ కేంద్రం వైఖరి మారడం లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి రాష్ట్రానికి కేంద్రం ఈ ఖరీఫ్ సీజన్ మొత్తానికి కేవలం 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే కేటాయించిందని, ఇది కూడా తెలియకుండా 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసిందని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం రైతులను తప్పుదోవ పట్టించడం ఇకపై మానుకోవాలకని మంత్రి తుమ్మల సూచించారు. ఇప్పటికే పలు సందర్భాల్లో గణాంకాలతో సహా కేంద్ర రసాయన మంత్రికి, రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, సహాయ మంత్రి బండి సంజయ్‌లకు కూడా లేఖలు రాశామని తెలిపారు.

# ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్.. రెండో మ్యాచ్ డ్రా

## నేడు టైబ్రేక్స్ గేమ్, విజేత ఎవరో తేలనుంది

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 27:** ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ (ఎఫ్ఐడిఈ వుమెన్ వరల్డ్ కప్) ఫైనల్స్ ఆసక్తికరంగా సాగుతోంది. ఫస్ట్ గేమ్ ను డ్రాగా (శనివారం)ముగించిన భారత అమ్మాయిలు కోనేరు హంపి, దివ్య దేశముఖ్ లు రెండో గేమ్‌ను కూడా ఆదివారం డ్రా చేశారు. దీంతో తుది ఫలితం టై బ్రేక్స్‌తోనే తేలనుంది. సోమవారం టై బ్రేక్స్ అనంతరం.. విజేత ఎవరో తేలనుంది. కాగా.. ఫస్ట్ గేమ్‌ను నల్లపావులతో ఆడిన కోనేరు హంపి.. రెండో గేమ్ ను తెల్లపావులతో ఆడారు. దివ్య కూడా అదే స్థాయిలో పావుల్ని కదపడంతో.. గేమ్ డ్రా అయింది. సోమవారం మ్యాచ్‌లో గెలిచిన వారే ఫీడే మహిళల ప్రపంచ కప్ ఫైనల్ విజేతగా నిలుస్తారు.

# భగవత్ ప్రసాదంగా భావిస్తా

## అన్నప్రసాద వితరణ నిరంతరాయంగా కొనసాగాలి:

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**తిరుమల,జూలై 27ప్రభాతవార్తప్రతినిధి:** భగవం తుని సన్నిధిలో భక్తులతో కలసి అన్నప్రసాదం స్వీకరించడం భగవత్ ప్రసాదంగా భావిస్తానని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు. టిటిడి నిర్వ హిస్తున్న అన్నప్రసాదం వితరణ కార్యక్రమాన్ని భక్తులందరూ ఉపయోగించుకోవడం చాలా సం తోషమన్నారు. ఈ పరంపర ఇలాగే కొనసాగు తుండాలని ఆయన ఆకాంక్షించారు. భక్తులకు సేవచేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శ్రీవారిసేవ చేయడం సంతోషించదగిన విష యమని, అనుసరించదగిన గొప్పశుభపరిణా మమన్నారు. అన్నప్రసాద వితరణకు అయ్యే ఖర్చును వివిధ రూపాలలో విరాళంగా భక్తులకు సమర్పించడమనేది జీవితంలో లభించిన ఓ పవిత్రమైన అవకాశంగా భావించాలన్నారు. అలాంటి అవకాశం ఉపయోగించుకునేందుకు దాతలైన భక్తులు ఇంకా ముందుకు రావాలని వెంకయ్యనాయుడు కోరారు. అన్నప్రసాదం చాలా రుచిగా, నాణ్యతగా అద్భుతంగా ఉందని అభినందించారు. ఆదివారం మధ్యాహ్నం తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని వెంకయ్యనాయుడు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్‌రెడ్డితో కలసి సందర్శించారు. ఇక్కడ శ్రీవారి సేవకులతో ,భక్తులతో ఆప్యా యంగా పలకరించి వారివారి సేవలను అభినం దించారు. భక్తులు కూడా అన్నప్రసాదం బావుం దని, నాణ్యత మెరుగుపడిందని మాజీ ఉప రాష్ట్రపతికి తెలిపారు.




# టిసిఎస్‌లో 12వేల మందికి ఉద్వాసన

## కృత్రిమమేథ రాక ఫలితం..

## అదేమీలేదు.. కేవలం సర్దుబాటు మాత్రమే: టిసిఎస్ సిఇఒ

**ముంబయి, జూలై 27:** కృత్రిమ మేధ (ఎఐ) రాకతో ప్రయోజనాల సంగతి ఏమోగానీ ఐటీ ఉద్యోగాలపై దీని ప్రభావం మాత్రం తీవ్రస్థాయిలోనే ఉంది. ఏఐ పుణ్యమాని ఇప్పటికే పలు దిగ్గజ సంస్థలు తమ స్టాఫ్‌ను తగ్గించుకుంటున్నాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) సైతం భారీగా ఉద్యోగాల కోత (లేఆఫ్స్)కు సిద్ధమైంది. వచ్చే ఏడాది వరకూ తమ స్టాఫ్‌లో 1,200 వేల మందిని తొలగించాలని కంపెనీ నిర్ణయించింది. ప్రధానంగా మధ్య స్థాయి, సీనియర్ హోదాలోని వాళ్లను ఇంటికి పంపేందుకు సన్నాహకాలు చేస్తున్నట్టు ఆదివారం కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కే.కృతివాసన్ మాట్లాడుతూ ఐటీ రంగంలో ఏఐతో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. అందులో ఉద్యోగాల్లో కోత కూడా ఒకటి అని అన్నారు. మెటా సహా పలు సంస్థలు లే ఆఫ్స్ ప్రకటిస్తుండగా భారత కంపెనీ టీసీఎస్ కూడా తమ సిబ్బందిని 2 శాతానికి తగ్గించుకునే పనిలో నిమగ్నమైంది. వచ్చే ఏడాది వరకూ దాదాపు 12 వేల మందిని తొలగించేందుకు ప్రణాళికలు చేస్తోంది టీసీఎస్. 'ఐటీ రంగంలో ఈమధ్య చాలా మార్పులు వస్తున్నాయి. కృత్రిమ మేధ, ఆపరేటింగ్ మోడల్ మార్పులు ఇలా కొత్త సాంకేతికత పుట్టుకొచ్చింది. అందుకు అనుగుణంగానే ఎవరైనా నడుచుకోవాలి. అందుకే లే ఆఫ్స్‌కి సిద్ధమవుతున్నాం. అలా అనీ మాకు తక్కువ మందే కావాలని నేను చెప్పడం లేదు. ఇది కేవలం ఒక సర్దుబాటు చర్య మాత్రమే. తొలగించిన వాళ్లకు వేతనంతో పాటు మంచి ప్యాకేజీ ఇస్తాం. నోటీస్ పీరియడ్ సమయానికి జీతం చెల్లిస్తాం. వీటితో పాటు ఆరోగ్య బీమాను కొనసాగిస్తూనే వాళ్లు ఇతర సంస్థల్లో ఉద్యోగం సాధించడానికి అవసరమైన సహకారం అందిస్తామని కృతివాసన్ పేర్కొన్నారు.

# గొప్ప దార్శనికుడు ఎపిజె అబ్దుల్‌కలాం

## వర్ధంతి రోజున ప్రధాని మోడీ నివాళులు




**న్యూఢిల్లీ, జూలై 27:** భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కలాం ఒక స్ఫూర్తిదాయక దార్శనికుడని, గొప్ప శాస్త్రవేత్త అని, ఆదర్శవంతమైన దేశభక్తుడని ప్రధాని కొనియాడారు. దేశ యువతకు ఆయన ఆలోచనలు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని పేర్కొన్నారు. ఆదివారం కలాం వర్ధంతి సందర్భంగా ప్రధాని మోడీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా స్పందించారు. మన ప్రియతమ మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు ఆయన వర్ధంతి నాడు నివాళులర్పిస్తున్నాను. దేశం పట్ల ఆయనకున్న అంకితభావం ఆదర్శప్రాయం. అభివృద్ధి చెందిన, బలమైన భారత్‌ను నిర్మించేందుకు ఆయన ఆలోచనలు దేశంలోని యువతను ప్రేరేపిస్తాయని మోడీ తన పోస్ట్‌లో రాశారు. రాష్ట్రపతి కాకముందే రాష్ట్ర రత్నగా ప్రజల మన్ననలు పొందిన అరుదైన వ్యక్తి కలాం అని గతంలో మోడీ ప్రశంసించిన విషయం తెలిసిందే. భారతదేశ 11వ రాష్ట్రపతిగా 2002 నుంచి 2007 వరకు సేవలందించిన డాక్టర్ కలాం, నిరాడంబర జీవితం, నిష్పక్షపాత వైఖరితో ప్రజలందరి గౌరవాన్ని పొందారు. మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన ఆయన, దేశ రక్షణ వ్యవస్థ బలోపేతానికి విశేష కృషి చేశారు. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు నేతృత్వం వహించి అగ్ని, పృథ్వీ వంటి శక్తివంతమైన క్షిపణుల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. 1998లో జరిగిన పోఖ్రాన్ అణు పరీక్షల్లోనూ ఆయన ముఖ్య సమన్వయకర్తగా వ్యవహరించారు. కలాం వర్ధంతి సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా కూడా నివాళులర్పించారు. కలాం జీవితం అద్భుతమైన పోరాటానికి, విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. భారత్‌ను అణుశక్తిగా నిలపడంలో ఆయన అందించిన సేవలు మరువలేనివని నడ్డా అన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందిస్తూ, కలాం జీవితంలోని నిరాడంబరత, దేశభక్తి యావత్ దేశానికే ప్రేరణ అని కొనియాడారు. ఆయన ఆలోచనలు శాస్త్ర, విద్యా రంగాలకు ఎప్పటికీ వెలుగునిస్తాయని తెలిపారు. ప్రజల రాష్ట్రపతిగా గుర్తింపు పొందిన డాక్టర్ కలాం, యువతకు, విద్యార్థులకు స్ఫూర్తినివ్వడాన్ని ఎంతగానో ఇష్టపడేవారు. 2015 జులై 27న షిల్లాంగ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా గుండెపోటుతో కుప్పకూలి తుదిశ్వాస విడిచారు.

## కలాంకు నివాళులు అర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 27:** మాజీ రాష్ట్రపతి, భారతరత్న డా.ఏ.పి.జె. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆ మహనీయునికి ఘనంగా నివాళులు అర్పించారు. విజ్ఞా నానికి ప్రతీకగా, విద్యార్థులు, యువతకు మార్గదర్శకునిగా నిలిచిన కలాం తన జీవితం మొత్తాన్ని దేశసేవకు అంకితం చేసిన మహాత్ముడని ఆయన గుర్తు చేశారు. కలాం ఆశయాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరు వారి విలువలు, ఆలోచనలను అనుసరిస్తూ స్ఫూర్తితో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.



# ఆరేళ్ల తర్వాత మాతోశ్రీకి వచ్చిన ఎంఎన్‌ఎస్ అధినేత రాజ్‌థాకరే

**ముంబై, జూలై 27:** మహారాష్ట్ర నవనిర్మాణ సేన చీఫ్ రాజ్ ఠాక్రే ఆరేళ్ల తర్వాత శివసేన యూబీటీ నేత ఉద్ధవ్ ఠాక్రే నివాసమైన మాతోశ్రీకి వెళ్లారు. రాజ్, ఉద్ధవ్ సోదరులిరువురూ సుమారు 30 నిమిషాల పాటు సమావేశమయ్యారు. వీరి సమావేశానికి ప్రత్యేకత ఉంది. ఆదివారంనాడు ఉద్ధవ్ ఠాక్రే పుట్టినరోజు కావడంతో మాతోశ్రీకి వచ్చిన రాజ్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజ్ ఠాక్రే వెంట ఎంఎన్ఎస్ సీనియర్ నేతలు బాలా నందగావోంకర్, నితిన్ సర్దేశాయ్ కూడా హాజరయ్యారు. రాజ్‌ఠాక్రే మాతోశ్రీ నిలయానికి వచ్చి దాదాపు ఆరున్నరేళ్లు అవుతోంది. చివరిసారిగా తన కుమారుడు అమిత్ ఠాక్రే పెళ్లికి ఉద్ధవ్‌ను ఆహ్వానించేందుకు ఆయన మాతోశ్రీకి వచ్చారు. మాతోశ్రీ పర్యటనలో భాగంగా రాజ్ ఠాక్రే మూడో అంతస్తు వరకూ వెళ్లి శివసేన వ్యవస్థాపకుడు దివంగత బాల్ ఠాక్రే గదిని సందర్శించారు. బాల్ ఠాక్రే కూర్చునే ఐకానిక్ చెయిర్‌ను ఆ గదిలో పదిలపరిచారు. రాజ్ ఆ కుర్చీకి గౌరవపూర్వకంగా నమస్కరించి, బాల్ ఠాక్రేకు నివాళులర్పించారు. కాగా, ఉద్ధవ్‌రాజ్ సోదరుల మధ్య రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ మాతోశ్రీతో రాజ్‌కు చిన్నప్పటి నుంచి అనుబంధం ఉంది. యువకుడిగా ఎక్కువ కాలం తన అంకుల్ బాల్ ఠాక్రేతో సన్నిహితంగా పార్టీ కోసం ఆయన పనిచేశారు. గతంలో ఉద్ధవ్ సర్జరీ చేయించుకున్నప్పుడు కూడా ఆసుపత్రిలో ఆయనను రాజ్ పరామర్శించారు. ఆసుపత్రి నుంచి ఉద్ధవ్ డిశ్చార్జి అయిన తర్వాత స్వయంగా కారును డ్రైవ్ చేస్తూ ఆయనను మాతోశ్రీకి రాజ్ తీసుకువచ్చారు. శివసేన యూబీటీ, ఎంఎన్ఎస్ పొత్తుపెట్టుకోనున్నాయనే ప్రచారం కూడా కొద్దికాలంగా వినిపిస్తోంది. ఈ దిశగా ఇటీవల మూడు రోజుల పాటు జరిగిన మహారాష్ట్ర నవనిర్మాణ సేన సదస్సులో రాజ్ సంకేతాలిచ్చారు. సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. ఉద్ధవ్ సైతం ఇందుకు సుముఖత వ్యక్తం చేస్తూ వచ్చారు. హిందీని రాష్ట్ర పాఠశాలల్లో తృతీయ భాషగా తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉపసంహరించుకుంది. ఇందుకోసం మొదట్నించీ పట్టుబడుతున్న ఠాక్రే సోదరులు దీన్ని సెలబ్రేట్ చేసుకుంటూ ఒకేవేదికపై కలిశారు. పొత్తులపై రాజ్, ఉద్ధవ్ వ్యాఖ్యలపై శివసైనికులు సంతోషంగా ఉన్నారని, తిరిగి సోదరులిద్దరూ చేతులుకలిపే అవకాశాలున్నాయని శివసేన యూబీటీ నేత సంజయ్ రౌత్ ఇటీవల పేర్కొన్నారు. ప్రస్తుతానికైతే పొత్తులకు రాజ్ తలుపులు తెరిచే ఉంది.

# తెలుగు రాష్ట్రాల్లో పెట్రేగుతున్న మెడికల్ మాఫియా దారుణాలు

## ఓవైపు అక్రమ కిడ్నీ ఆపరేషన్లు, మరోవైపు అడ్డగోలుగా క్లినికల్ టెస్ట్‌లు, సరోగసి, ఐపిఎఫ్‌ల పేరిట చైల్డ్ ట్రాఫికింగ్

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో మెడికల్ మాఫియా ఆగడాలు సర్కారీ విభాగాలను సవాల్ చేసే స్థాయికి చేరాయి. రెండు రాష్ట్రాల్లో ఇప్పటికే అక్రమ కిడ్నీ మార్పిడి ఆపరేషన్లతో పాటు అడ్డా కూలీలపై కొత్త వాక్సిన్‌ల ప్రయోగం జరుగుతుండగా ఇదే సమయంలో అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు, అక్రమ సరోగసిలు కొనసాగుతున్నాయి. తాజాగా ఐవిఎఫ్‌ల పేరిట చైల్డ్ ట్రాఫికింగ్ కూడా వెలుగు చూడడం సంచలనం రేపింది.

శాస్త్ర, సాంకేతిక రంగంలో అనేక ఆవిష్కరణలకు నిలయంగా మారి సైన్స్ సిటీగా పేరుగాంచిన హైదరాబాద్ వైద్య రంగంలో తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందించే నగరంగా కూడా పేరుగాంచడం తెలిసిందే. ఇదే సమయంలో హైదరాబాద్‌తో పాటు ఎపిలోని ఇంకొన్ని పట్టణాల లోనూ వైద్య పరంగా సౌలభ్యాలు పెరగడం వుండడం విదితమే. ఇలా వైద్య పరంగా హైదరాబాద్‌తో పాటు విజయవాడ, వైజాగ్, గుంటూరు నగ రాలు ముందంజలో వుండగా దీనిని అందిపుచ్చుకుంటూ దేశ, విదేశాలలో మంచి పేరు, ప్రఖ్యాతులను అందుకుంటున్నాయి. అయితే ఇదంతా నా ణానికి ఒకవైపుగా చెప్పాలి. ఇంకోవైపు మెడికల్ మాఫియా ఆగడాల గురించి ఎంతచెప్పినా తక్కువేననే విధంగా మారింది. ఇప్పటికే అక్రమ కిడ్నీ ఆ పరేషన్లు తెలుగు రాష్ట్రాల పోలీసు విభాగాలను కుదిపేస్తున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో అలకనంద ఆసుపత్రిలో వెలుగుచూసిన అక్రమ కిడ్నీ ఆప రేషన్ల వ్యవహారం దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. అనేక నగరాలకు చెందిన ప్రముఖ వైద్యులు ఈ స్కాంలో అరెస్టయ్యారు. అక్రమ కిడ్నీ ఆపరే షన్లకు ముందు వెలుగు చూసిన క్లినికల్ టెస్ట్‌లు మరీ దారుణంగా వుంటున్నాయి. కొన్ని ఔషధ కంపెనీలు కొత్త వాక్సిన్‌లను అడ్డా కూలీలపై ప్రయోగించడం, ఈ సందర్భంగా కొందరు మరణించడం పలుమార్లు వివాదాలకు తావిచ్చింది. ఈ సందర్భంగా పలు కంపెనీలపై కేసులు కూడా నమోద య్యాయి. దీని తరువాత అక్రమ లింగ నిర్ధారణ. లింగ నిర్ధారణను కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాలు నిషేధం విధించినా ఇది ఆగడం లేదు. దీని తరువాత సరోగసి స్కాం. పదేళ్ల నుంచి సరోగసి స్కాం కొనసాగుతోంది. పిల్లలు లేని దంపతులకు సరోగసి విధానం ద్వారా పిల్లలను అందించేందు కు ఉద్దేశించిన ఈ విధానం వైద్య పరంగా సాధించిన అభివృద్ధి. అయితే దీనిని సృష్టి సహ కొన్ని ఆసుపత్రులు దుర్వినియోగం చేయడం వైద్య రం గానికి మాయనిమచ్చలా మారింది. సరోగసి కోసం బీద, మధ్య తరగతికి చెందిన కొందరు మహిళలను కొందరు దళారులు మోసం చేస్తూ దండిగా సంపాదిస్తున్నారు. వీరికి కొన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు సహకరిస్తున్నాయి. 2023లో వైజాగ్, హైదరాబాద్‌లోని సృష్టి ఆసుపత్రిలో ఈ గోల్ మాల్ రట్టయ్యింది. అప్పట్లో వైజాగ్ సిటీలోని యూనివర్సల్ సృష్టి ఆసుపత్రి అక్రమంగా శిశువుల విక్రయాలకు పాల్పడడం తెలుగు రాష్ట్రాల్లో సంచ లనం రేపింది. ఇదే సృష్టి ఆసుపత్రి తాజాగా ఐవిఎఫ్ పేరిట చైల్డ్ ట్రాఫికింగ్‌కు పాల్పడడం పోలీసులను షాక్‌కు గురిచేసింది. సృష్టి ఆసుపత్రి సాగించిన అనైతిక విధానం తెలుగు రాష్ట్రాల్లో కొన్ని బడా ఆసుపత్రుల్లో కొనసాగుతున్న అడ్డగోలు విధానాలను మరోసారి తెరపైకి తెచ్చింది. అప్పట్లో వైజా గ్‌లో గర్భంతో వున్న ఓ వితంతువు ప్రసవించాక తనకు పుట్టిన మగ బిడ్డను ఆసుపత్రి యాజమాన్యానికి ఇచ్చేసి, ఒంటరిగా ఇంటికి రావడంతో శిశు వు విషయమై ఆరా తీసిన కుటుంబ సభ్యులు అసలు విషయం తెలుసుకుని దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సృష్టి ఆసుపత్రి గోల్‌మాల్ వ్యవహారాలు రట్టయ్యింది. తాజాగా ఇదే ఆసుపత్రిలో మరో దారుణం రట్టయ్యింది. రెండేళ్ల క్రితం ఈ ఆసుపత్రి 56 శిశువులను దేశ వ్యాప్తంగా అనేక నగరాలలో పిల్లలులేని దంపతులకు అమ్మినట్లు తేలింది. హైదరాబాద్ సృష్టి ఆసుపత్రిలో అద్దె గర్భం కోసం పది లక్షల రూపాయలు చెల్లించి మోస పోయిన దంపతుల ఉదంతం వెలుగుచూసింది. పెళ్లయి చాలా కాలం అయినా తమకు పిల్లలు లేక పోవడంతో ఈ దంపతులు సృష్టి ఆసుపత్రిని స ంప్రదించగా వైజాగ్ సిటీలో గల తమ ఆసుపత్రిలో మరో మహిళ ద్వారా అద్దె గర్భంతో పిల్లలను కనే సౌకర్యం కల్పిస్తామని నమ్మించి పది లక్షల రూపాయలు తీసుకుంది. ఇందులో భాగంగా వైజాగ్‌లోని ఓ వితంతువును అక్రమంగా సరోగసి ఊబిలో లాగిన సృష్టి ఆసుపత్రి ఆమెకు మగ శిశువు పుట్టగానే శిశువును తీసుకుంది. అనంతరం ఆ మహిళకు కొంత నగదు ఇచ్చి ఇంటికి పంపింది. కాగా ఓ ప్పందంలో భాగంగా ఆ శిశువును సృష్టి ఆసుపత్రి యాజమాన్య ం హైదరాబాద్‌కు చెందిన దంపతులకు ఇవ్వాల్సి వుండగా అలా చేయకుండా అధిక డబ్బులకు ఆశపడి ఆ శిశువును కోల్‌కతా లోని వేరే దంపతులకు ఇచ్చింది. ఈ వ్యవహారంపై కూపీలాగిన వైజాగ్ సిటీ పోలీసులు కోల్‌కతా దంపతుల వద్ద వున్న శిశువును స్వాధీనం చేసుకు ని, కన్నతల్లి ఒడికి చేర్చారు. ఇలా 56 శిశువులను ఈ ఆసుపత్రి అనేక మంది దంపతులకు అమ్మినట్లు కనుగొన్న పోలీసులు ఇందులో 40కి పైగా శిశువులను స్వాధీనం చేసుకుని హోంకు తరలించారు. ఈ మొత్తం వ్యవహారం రెండేళ్ల క్రితం దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. సృష్టి ఆసుపత్రికి ముందు 2017 జూన్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లోని సాయికిరణ్ అనే కార్పొరేట్ ఆసుపత్రిలో సరోగసి స్కాం వెలుగు చూడడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. అప్పట్లో వెలుగు చూసిన స్కాంలో 48 మంది మహిళలు సరోగసి ద్వారా గర ్భం దాల్చగా, 30 మంది మహిళలపై దీనికి సంబంధించిన ప్రయోగాలు జరిగినట్లు నిర్ధారణ అయ్యిం ది. ఇక తాజా విషయానికి వస్తే కొన్ని ఆసుపత్రుల్లో యువకుల నుంచి వీర్య కణాలు, యువతు ల నుంచి అండా లను అక్రమంగా సేకరిస్తూ వాటిని ఫ్రిజ్ చేస్తూ ఐపిఎఫ్ ద్వారా తమ వద్దకు పిల్లల కోసం వచ్చే దంప తులకు వాడుతున్నట్లు పోలీసులు తేల్చారు. హైదరాబాద్‌లో వెలుగుచూసిన స్కాం ఈ తరహాలోనే వుండడం గమనార్హం. వైద్య, ఆరోగ్య శాఖలో చట్టాలు కఠినంగా లేకపోవడం వల్ల మెడికల్ మాఫియా రెచ్చిపోతోందని నిపుణులు అంటున్నారు.

# తెర

నాటి పద్ధతి..


## నేడేది?



ఒకప్పుడు హీరోయిన్స్లుగా ఓ వెలుగు వెలిగిన హీరోయిన్స్ ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు చాలా మంది సీనియర్ కథానాయికలు ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టులుగా మెప్పిస్తున్నారు. అందం, అభినయంతో మెప్పించిన మీరా జాస్మిన్ టాలీవుడ్ క్రేజీ హీరోయిన్. ఆమె చాలా మంది ఫేవరెట్. తెలుగుతోపాటు తమిళంలో అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. అంతేకాదు. అప్పట్లో గ్లామర్ షోలకు దూరంగా ఉంటూ నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు ఎంచుకుంటూ ప్రేక్షకులను మెప్పించింది. కానీ ఇప్పుడు అందాలతో అదరగొడుతోంది. ఒకప్పుడు తెలుగులో ఆమె భారీగా ఫాలోయింగ్ సంపాదించుకుంది. పవన్ కళ్యాణ్ సరసన గుడుంబా శంకర్ సినిమాతో మరింత క్రేజ్ సొంతం చేసుకుంది. అంతకు ముందు రవితేజ జోడిగా భద్ర సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండిపోయింది.

తెలుగులో వరుస సినిమాల్లో నటించిన మీరా జాస్మిన్.. ఇప్పుడు సోషల్ మీడియాలో రెచ్చిపోయి అందాల గ్లామర్ ఫోజులతో మెంటలెక్కిస్తోంది. అప్పట్లో సినిమాల్లో నటించే సమయంలో స్కిన్ షోకు నో చెప్పిన ఈ అమ్మడు.. ఇప్పుడు మాత్రం ఓ రేంజ్‌లో అందాలను ఆరబోస్తోంది. చాలా కాలంగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ నిత్యం క్రేజీ ఫోటోస్ షేర్ చేస్తుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ షేర్ చేసిన ఫోటోస్ ఆకట్టుకుంటున్నాయి. ఇటీవలే సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన మీరా జాస్మిన్ విమానం సినిమాతో రీఎంట్రీ ఇచ్చింది.

## రంగంలోకి దిగిన భయమెరగని వీరనారి



రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్టైనర్ మైసా ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. భారీ బడ్జెట్ చిత్రాలతో బాలీవుడ్, టాలీవుడ్‌లలో వరుస సక్సెస్‌లు సాధిస్తున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ సినిమాకు ఉదయం పూజా కార్యక్రమాలతో శ్రీకారం చుట్టారు. మైసాను యూనిఫార్ములా ఫిలిమ్స్ నిర్మిస్తోంది. సీతారామం, ఫౌజీ చిత్రాలకు అసోసియేట్‌గా పనిచేసిన హను రాఘవపూడి శిష్యుడు రవీంద్ర పుల్లె ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. ఇది ఔట్ అండ్ అవుట్ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్గా తెరకెక్కనుంది. తెలంగాణలోని అదిలాబాద్ జిల్లాలో అధికంగా నివసించే ప్రముఖ ఆదివాసి జాతి గోండు తెగ నేపథ్యంలో ఈ సినిమా రూపొందనుంది. భయమెరగని ఓ వీరనారి పాత్రలో రష్మిక కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ ఫోటోలు సోషల్ మీడియాలో మంచి క్రేజ్ క్రియేట్ చేశాయి. రష్మిక లుక్ పోస్టర్‌లో స్టన్నింగ్‌గా ఉండటం విశేషం. ఈ సినిమాను మేకర్స్ తెలుగుతో పాటు పాన్ ఇండియాగా రూపొందిస్తున్నారు. కల్కి వంటి భారీ చిత్రానికి యాక్షన్ కొరియోగ్రఫీ చేసిన ఆండీ లాంగ్ ఈ ప్రాజెక్ట్‌లో పని చేస్తున్నారు. అలాగే, సూర్య రెట్రో సినిమాకు కెమెరామెన్‌గా పనిచేసిన శ్రేయాస్ పి కృష్ణ ఈ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆదివారం ఉదయం జరిగిన పూజా కార్యక్రమానికి హను రాఘవపూడి, దగ్గుబాటి సురేశ్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేశ్ బాబు మొదటి షాట్‌కు క్లాప్ కొట్టగా, విజయ్ దేవరకొండ తదుపరి చిత్రం రౌడీ జనార్ధన్ దర్శకుడు రవి కిరణ్ కోలా కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తొలి షాట్‌కు హను రాఘవపూడి దర్శకత్వం వహించారు. సోమవారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. అనంతరం రష్మిక అక్కడికి వచ్చిన గోండు జాతి మహిళలతో కలిసి సాంప్రదాయ నృత్యం కూడా చేశారు. ఇటీవలే ఛావా, కుబేర చిత్రాలతో భారీ విజయాలను సాధించిన రష్మిక, తెలుగులో అందాల రాక్షసి ఫేమ్ హీరో మరియు జాతీయ అవార్డు పొందిన చిలసౌ దర్శకుడు రాహుల్ రవీంద్రన్ డైరెక్షన్‌లో ది గర్ల్‌ఫ్రెండ్ అనే లేడీ ఓరియంటెడ్ సినిమా చేస్తున్నారు. ఈ సినిమాను అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ నిర్మిస్తోంది. త్వరలోనే ఈ చిత్రం థియేటర్లకు రానుంది.

## పట్టాలకెక్కిన వన్ వే టికెట్



వరుణ్ సందేశ్, కుష్బూ చౌదరి హీరో హీరోయిన్స్లుగా తెరకెక్కనున్న వన్ వే టికెట్ సినిమా పూజా కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ చిత్ర ప్రారంభోత్సవ వేడుకకు వచ్చిన ముఖ్య అతిథులు ప్రముఖ నిర్మాతలు సి. కళ్యాణ్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టగా, హర్షిత్ రెడ్డి స్క్రిప్ట్ అందజేశారు. దర్శక, నిర్మాత త్రినాధరావు నక్కిన తొలి సన్నివేశానికి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ కార్యక్రమానికి టీ ఎస్ రావు అతిథిగా విచ్చేశారు. అనంతరం త్రినాధరావు నక్కిన మాట్లాడుతూ వరుణ్ సందేశ్ వైభోగం ఒకప్పుడు నేను చాలా చూశాను. ఆయనకు ఓ హిట్ అవ్వాలన్నదే నా కల. ఈ టికెట్ మూవీ పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ..వరుణ్ సందేశ్ మాట్లాడుతూ వన్ వే టికెట్ టైటిల్ విన్న వెంటనే నాకు కొత్తగా అనిపించింది. నేను ఇందులో కొత్త పాత్రను పోషించబోతోన్నాను అని అన్నారు. నిర్మాత శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శ్రీ పద్మ ఫిల్మ్స్, రంగస్థలం మూవీ మేకర్స్ బ్యానర్లపై ఇది మా రెండో చిత్రం. అందరూ ఆశీస్సులు అందించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. దర్శకుడు ఏ. పళని స్వామి మాట్లాడుతూ వన్ వే టికెట్ క్రైమ్, థ్రిల్లర్‌గా రాబోతోందన్నారు. కుష్బూ చౌదరి, మ్యూజిక్ డైరెక్టర్ సాయి కార్తిక్, నటులు మనోజ్, సుధాకర్ తదితరులు మాట్లాడారు. ఈ చిత్రంలో మనోజ్ నందం, సుధాకర్ ముఖ్య పాత్రల్ని పోషించనున్నారు. ఈ మూవీకి కెమెరామెన్‌గా శ్రీనివాస్ బెజుగమ్, సంగీత దర్శకుడిగా కార్తిక్ పని చేయనున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించారు.

## ఒక్క ఆంగ్ల పదం లేకుండా...యుద్ధమే రాని



డార్లింగ్ కృష్ణ, మనీషా హీరో హీరోయిన్స్‌గా శశాంక్ దర్శకత్వంలో రూపొందుతున్న మల్టీ లింగ్వల్ మూవీ బ్రాట్. డాల్ఫిన్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై మంజునాథ్ కంద్కూర్ ఈ సినిమాని నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి యుద్ధమే రాని సాంగ్‌ని రిలీజ్ చేశారు. సిద్ శ్రీరామ్ పాడిన ఈ పాటని నవరసరాయ డాక్టర్ నరేష్ వికె లాంచ్ చేశారు. అర్జున్ జన్య సంగీతం అందించిన ఈ పాటకు సనారె లిరిక్స్ రాశారు. ఈ బ్యూటీఫుల్ లవ్ సాంగ్ అందరినీ ఆకట్టుకుంది.

సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో నవరసరాయ డాక్టర్ నరేష్ వికె మాట్లాడుతూ చాలా రోజుల తర్వాత అద్భుతమైన సినిమా బ్రాట్‌తో వస్తున్నారు. శశాంక్ చాలా ట్యాలెంటెడ్ డైరెక్టర్. మనిషా అద్భుతమైన నటి. మ్యూజికల్‌గా ఈ సినిమా సూపర్ హిట్. సనారె లిరిక్స్ చాలా అందంగా రాశారు అన్నారు. డైరెక్టర్ శశాంక్ మాట్లాడుతూ అప్పుడే తెలుగు కూడా నేర్చుకున్నాను. హైదరాబాదు నాకు ఇంకొక ఇల్లు లాంటిది. నాకు ఎప్పటినుంచో తెలుగు సినిమా చేయాలనే ఆలోచన ఉండేది. ఇప్పుడు ఆ సమయం వచ్చింది. బ్రాట్ సినిమాని ఐదు భాషల్లో రిలీజ్ చేస్తున్నాము. కంటెంట్ మీద ఉన్న నమ్మకంతోనే ఈ సినిమా రిలీజ్ చేస్తున్నాము. అందరికీ రిలేట్ అయ్యే కథ ఇది. అర్జున్ జన్య యుద్ధమేరాని పాట అద్భుతంగా కంపోజ్ చేశారు.

నిర్మాత మంజునాథ్ మాట్లాడుతూ ఈ పాట లాగే సినిమా కూడా మీ అందరికీ నచ్చుతుందన్నారు.

హీరో డార్లింగ్ కృష్ణ మాట్లాడుతూ.. చాలా బ్యూటిఫుల్ సాంగ్ ఇది. సిద్ శ్రీ రామ్ వాయిస్‌కి నేను పెద్ద ఫ్యాన్‌ని. ఆయన ఈ సాంగ్ పాడటం చాలా ఆనందాన్ని ఇచ్చింది అన్నారు. హీరోయిన్ మనీషా మాట్లాడుతూ.. ఇది యాక్షన్ థ్రిల్లర్ మూవీ. ఇందులోని యుద్ధమేరానే సాంగ్‌ని అర్జున్ జన్య చాలా అద్భుతంగా కంపోజ్ చేశారు. సిద్ శ్రీరామ్ వండర్ఫుల్‌గా పాడారు అన్నారు.


ఆడియోకో ఓనర్ శ్యామ్ మాట్లాడుతూ..సినిమా పాటలన్నీ చాలా అద్భుతంగా వచ్చాయన్నారు. లిరిక్ రైటర్ సనారె మాట్లాడుతూ.. సరిపోదా శనివారం, మెకానిక్ రాకీ, చావు కబురు చల్లగా లాంటి చిత్రాలకు పాటలు రాశాను. ఈ సినిమాకి పాట రాయడం అనేది చాలా చాలా ఆనందంగా ఉంది. ఒక్క ఆంగ్ల పదం లేకుండా అన్ని తెలుగు పదాలతో రాయడం అనేది మనసుకు చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

## లగ్జరీ వాచ్‌ల ఫ్యాక్టరీ నేపథ్యమే..



ప్రస్తుతం సౌత్‌లో మంచి అంచనాలు సెట్ చేసుకున్న అవైటెడ్ చిత్రాల్లో సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్ లో చేస్తున్న అవైటెడ్ చిత్రం కూలీ కూడా ఒకటి. అయితే ఈ సినిమాపై మాత్రం ఆడియెన్స్‌లో గట్టి అంచనాలే నెలకొన్నాయి. కేవలం టీజర్ ఇంకా పాటలతోనే సాలిడ్ హైప్‌ని సొంతం చేసుకున్న ఈ సినిమా విడుదలకి ముందే ఎలా ఉంటుంది? లోకేష్ గత సినిమాలతో లింక్ ఏమన్నా ఉందా అనే ఊహాగానాలే ఆడియెన్స్ ఎక్కువ పెట్టేసుకున్నారు. ఇలా సినిమా నేపథ్యం ఏంటి ఇతర అంశాలు మంచి సస్పెన్స్‌గా నిలవగా లేటెస్ట్‌గా లోకేష్ కనగరాజ్ అసలు కూలీ ప్లాట్ ఏంటి అనేది రివీల్ చేసేసాడు. కూలీ సినిమాలో గన్స్ ఉండవ్, డ్రగ్స్ ఉండవ్, ఎలాంటి టైం ట్రావెల్ సినిమా కూడా కాదు సినిమా మొత్తం లగ్జరీ వాచ్‌లు వాటి ఫ్యాక్టరీకి సంబంధించే ఉంటుంది అని అసలు విషయం తెలిపాడు.

## ఇన్విస్టిగేషన్ ఆఫీసర్



అరుణగిరి ఆర్ట్స్ మరియు కౌండిన్య ప్రొడక్షన్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ఫైట ర్ శివ. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపు కుంటోంది. కాగా ఈ చిత్రం యొక్క ఫస్ట్ లుక్ పోస్టర్ని దర్శకులు సంపత్ నంది చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ చిత్రంకి ప్రభాస్ నిమ్మల దర్శకత్వం వహిస్తున్నారు మణికంఠ, కథానాయకుడుగా ఐరా బన్సాల్ కథానాయకిగా నటించారు. ఈ చిత్రంలో ఇన్విస్టిగేషన్ ఆఫీసర్గా సునీల్ మరియు వికాస్ వశిష్ట ప్రత్యేక పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో మధుసూదన్, యోగి కాత్రి, దిల్ రమేష్, లక్ష్మణ్, అభయ్, ఆనంద్ భారతి, ఘర్షణ శ్రీనివాస్ మాస్టర్ శన్విత్ నిమ్మల తదితర నటీనటులు నటించారు. ఈ చిత్రానికి దర్శకత్వం :ప్రభాస్ నిమ్మల, కెమెరా: సురేందర్ రెడ్డి, సంజీవ్ లోక్నాథ్ మ్యూజిక్: గౌతమ్ రఘురాం ,ఎడిటింగ్ విశ్వనాథ్, ఆర్ట్:నాయుడు ,లిరిక్స్: తోటమల్ల వెంకటి ,డి.ఐ. రామకృష్ణ, డాన్స్ :మనోజ్ కె ,5.1: పద్మారావు యాక్షన్: రాజేష్ లంక, తుఫాన్ ,నభ మేనేజర్: కృష్ణారెడ్డి ,రవి, మగదాసు శ్రీకాంత్.వి ఎఫ్ ఎక్స్ :శ్రీనాథ్ సప్ప, పోస్టర్స్: బాబి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రమేష్ ఎగ్గిడి, పి ఆర్ ఓ. వీరబాబు,ప్రొడ్యూసర్స్: నర్సింగ్, ఉన్నం. రమేష్,



## సినిమాను రిలీజ్ చేయడమే పెద్ద సక్సెస్ ప్రేక్షకులకు నచ్చితే అదంతా బోనస్



నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాధ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా చైనా పీస్. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘు బాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ని క్రియేట్ చేసింది. మేకర్స్ మేకర్స్ ఈ సినిమా టీజర్‌ని రిలీజ్ చేశారు. పీపుల్ స్టార్ సందీప్ కిషన్ ముఖ్య అతిధిగా విచ్చేసి టీజర్‌ని లాంచ్ చేశారు. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో పీపుల్ స్టార్ సందీప్ కిషన్ మాట్లాడుతూ..ఒక సినిమాను తీసి రిలీజ్ చేయడమే పెద్ద సక్సెస్. ప్రేక్షకులకు సినిమా నచ్చితే అదంతా బోనస్ అని భావించాలి. మన ఆలోచనల్ని దేశం మొత్తం చెప్పడానికి బెస్ట్ ప్రాసెస్ సినిమానే. ఫేమస్ అవ్వాలనుకుంటే రీల్స్ చేసి కూడా ఫేమస్ అవ్వచ్చు. ఇది ఒక స్పై ఫిల్మే కాదు స్పై కామెడీ, సీరియస్ కామెడీ కూడా ఉంది. దర్శకుడు ఈ కథని నమ్మాడు. నమ్మింది చిత్రీకరించాడు నిహాల్ సూర్య వీళ్ళందరిలోనూ ఒక నిజాయితీ ఉంది. తప్పకుండా ఆ నిజాయితీని మనందరం అప్రిషియేట్ చేయాలి. ఒక కొత్త ఫిలిం మేకర్స్ కొత్త నటించినప్పుడు ఆ సినిమాకు వెళ్లి వాళ్ళ ఆలోచనని చూడడం ఒక బ్యూటిఫుల్ ఎక్స్పీరియన్స్. టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. టీజర్ చాలా బాగుంది. సినిమా కూడా చాలా బాగుంటుందని కోరుకుంటున్నా అన్నారు. డైరెక్టర్ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ.. ఒక దేశభక్తి సినిమా తీస్తూ చైనా పీస్ అనే పేరు పెట్టడం వెరీ చాలెంజింగ్. మేము అన్ని విభాగంలోనూ జాగ్రత్తలు తీసుకుని చాలా చక్కగా ఈ సినిమాని తీర్చిదిద్దాం అన్నారు. హీరో నిహాల్ మాట్లాడుతూ.. నేను నటించినా ఒక సినిమా చూసి సందీప్ కిషన్ నా భుజాన చేయవేసి చాలా చక్కగా చేశావని మెచ్చుకున్నారు. ఆ క్షణం నేను మర్చిపోలేను. కష్టపడి సినిమాలు చేస్తే కచ్చితంగా సక్సెస్ వస్తుందనే దానికి సందీప్ కిషన్ నిదర్శనం. ఒక నమ్మకంతో మళ్లీ సినిమా ఇండస్ట్రీలోకి వచ్చాను. సినిమా చేతికి రావడానికి రెండేళ్లు పట్టింది. హీరో సూర్య శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది. బాగా రీచ్ అవుతుందని నమ్మకం ఉందన్నారు. యాక్టర్ కమల్ కామరాజు మాట్లాడుతూ ఈ సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి మరో మంచి దర్శకుడు దొరికాడన్నారు. హర్షిత మాట్లాడుతూ.. ఈ సినిమాలో సారా అనే క్యారెక్టర్‌ని ప్లే చేస్తున్నానని చెప్పారు. దీక్ష పంత్ పాల్గొన్నారు.

## ఇగో ఇదే మా ఊరు.. ఆరెపల్లి..



భారతదేశంలో అతిపెద్ద స్వదేశీ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ అయిన ట్రిని5లో ఓ అచ్చమైన, స్వచ్ఛమైన తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో ‘మోతెవరి లవ్ స్టోర్త్ అనే సిరీస్ రాబోతోంది. అనిల్ గీలా, వర్షిణి రెడ్డి జున్నుతుల ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను శివ కృష్ణ బుర్రా రూపొందించారు. ఈ విలేజ్ కామెడీ, లవ్ సిరీస్ అందరినీ ఆకట్టుకునేందుకు ఆగస్ట్ 8న జీ5లో స్ట్రీమింగ్ కాబోతోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్ అందరినీ మెప్పించింది. ఇక తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను ఆదివారం నాడు తరుణ్ భాస్కర్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు.

‘ఇగో ఇదే మా ఊరు.. ఆరె పల్లి.. ఊరుఊరుకో మోతెవరి ఉన్నట్టు.. మా ఊరికి ఓ మోతెవరి ఉన్నడు.. అంటూ ప్రియదర్శి వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైన ట్రైలర్ ఆద్యంతం వినోదభరితంగా సాగింది. హీరో అనిల్ పరిచయం, హీరోయిన్ వర్షిణితో లవ్ ట్రాక్, ఊర్లోని పెద్దలు, భూ సమస్య, ప్రేమ వంటి అంశాలతో ట్రైలర్‌ను చక్కగా కట్ చేశారు. ఈ ట్రైలర్‌ను చూస్తుంటే ఈ సిరీస్‌ను ఆద్యంతం వినోద భరితంగా మలిచారని అర్థం అవుతోంది. ‘పర్శిగాడంటేనే పర్‌ఫెక్ట్, ఉశికే ఉడికించుడ్తే అనే డైలాగ్స్ నవ్వులు పూయించేలా ఉన్నాయి. అమ్మాయిలు భలేగా ఉంటరే.. మోసాన్ని కూడా ముద్దుగ చెప్తర్తే అంటూ సాగే డైలాగ్ ఎమోషనల్ డెప్త్‌ను కూడా చూపిస్తోంది. ఆగస్ట్ 8న ఈ సిరీస్ అందరినీ అలరించేందుకు రాబోతోంది. ఈ సిరీస్‌కు చరణ్ అర్జున్ సంగీతాన్ని అందించగా.. శ్రీకాంత్ అరుపుల కెమెరామెన్‌గా పని చేశారు. మధుర శ్రీధర్, శ్రీరామ్ శ్రీకాంత్ సంయుక్తంగా నిర్మించిన ఈ సిరీస్‌లో అనిల్ గీలా, వర్షిణి, మురళీధర్, సదానందం, సుజాత ముఖ్య పాత్రల్ని పోషించారు.

## వీరమల్లుకు అరుదైన గౌరవం

హరిహర వీరమల్లు చిత్రాన్ని ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో శనివారం రాత్రి ఓ షో ప్రదర్శించగా అధికారులు, ఉద్యోగుల నుంచి మంచి స్పందన దక్కింది. ఆదివారం సాయంత్రం మరో షో వేశారు. సినిమాలో టికెట్ ధరలు మూలాన కొంచెం బుకింగ్స్ మీద డే 2 నుంచి ఎఫెక్ట్ పడింది. అయితే మేకర్స్ ఫైనల్‌గా నార్మల్ టికెట్ ధరలకు జూలై 28 సినిమాని అందుబాటులోకి తెచ్చేస్తున్నారు.

## ఏపీ రాజకీయ పరిణామాల చుట్టూ దేవా కట్టా

ఇక్కడ మీరు ఏ పాత్ర పోషించారో కానీ, తుక్కు రేగ్గొట్టారు తెలుగు ప్రేక్షకులు ఆగస్ట్ 7న మరోసారి మీ నట విశ్వరూపాన్ని చూడబోతున్నారు.. అంటూ సాయికుమార్‌ను ఉద్దేశించి దర్శకుడు దేవా కట్టా చేసిన ఈ ట్వీట్ నెట్టింట విపరీతంగా వైరల్ అవుతుంది. ప్రస్తుతం సోనీలివ్ ఓటీటీ కోసం దేవా కట్టా ‘మయసభ సిరీస్ తెరకెక్కిస్తున్నారు. ఆగస్టు 7వ తేదీ నుంచి ఇది స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుంది. ఇందులో సాయికుమార్ ఓ కీలక పాత్ర పోషించనున్నారని చెబుతూ ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రస్థానం.. ఆటోనగర్ సూర్య తర్వాత మయసభతో మూడవసారి పని చేయడం చాలా ఎంజాయ్ చేశాను. నిండు నూరేళ్లు ఆనందంగా ఆరోగ్యంగా మీకు నచ్చిన పాత్రలు చేస్తూ లైఫ్ ఎంజాయ్ చేయాలని మీ అభిమానిగా ఆశిస్తున్నాను.. అని ట్వీట్‌లో పేర్కొన్నారు. కారులో కూర్చుని అభివాదం చేస్తున్న సాయికుమార్ పోస్టర్ ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉంది. సాయికుమార్ పోషించిన పాత్ర ఏంటా అని ఆరా తీస్తున్నారు. అయితే ఇద్దరు స్నేహితులు.. రాజకీయ ప్రత్యర్థులుగా ఎలా మారారనే ఆసక్తికర కథాంశంతో రూపొందుతున్న ఈ సిరీస్‌లో సాయికుమార్ ఎన్టీఆర్ పాత్ర పోషిస్తున్నారని తెలిసింది. ఇందులో ఆది పినిశెట్టి, చైతన్య రావు కీలక పాత్రలు పోషించనున్నారు. ఏపీ చరిత్రను మలుపు తిప్పిన రాజకీయ పరిణామాల చుట్టూ దేవా కట్టా ఈ మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. ఆగస్టు 7వ తేదీ నుంచి సోనీలివ్‌లో తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.

## కామాఖ్య గ్రాండ్ లాంచ్



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్ర ల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొం దనున్న థ్రిల్లింగ్ కామాఖ్య. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ శిజుగి లిగిదీ బ్యానర్ పై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ సినిమా లాంచింగ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. సినిమా ప్రారంభోత్సవానికి మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ముహూ ర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. ఈ వేడుకలో మూవీ టీం అందరూ పాల్గొన్నారు. డైరెక్టర్ అభినయ కృష్ణ ఈ సినిమా కోసం మిస్టీరియస్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ యూనిక్ కథని సిద్ధం చేశా రు. ఈ చిత్రంలో ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణ వ్, ధనరాజ్, రాఘవ, ఐశ్వర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి గ్యాని సంగీతం అందిస్తున్నారు. రమేష్ కుశేందర్ రెడ్డి డీవోపీగా వర్క్ చేస్తున్నారు. భూపతి యాద గిరి ఆర్ట్ డైరెక్టర్. ఈచిత్రానికి సంబధించిన మరిన్ని వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేస్తారు. తారాగణం: సమైరా, సముద్రఖని, అభిరామి, ఆనంద్, శరణ్య ప్రదీప్,వైష్ణవ్, ధనరాజ్, రాఘవ, ఐశ్వర్య.

## 8న బాలుగాడి లవ్ స్టోరీ



ఆకుల అఖిల్, దర్శక మీనన్, చిత్రం శ్రీను, గడ్డం నవీన్, చిట్టిబాబు, రేవతి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం బాలుగాడి లవ్ స్టోరీ. శ్రీ ఆకుల భాస్కర్ సమర్పణలో భామ క్రియేషన్స్ పతాకంపై ఆకుల మంజుల నిర్మిస్తున్న చిత్రానికి యల్. శ్రీనివాస్ తేజ్ దర్శకుడిగా పరిచయం కాబో తున్నాడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న బాలుగాడి లవ్ స్టోరీ సినిమా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆగస్ట్ 8న విడుదల కాబోతోంది. ఈ సినిమాను సిల్వర్ స్క్రీన్ గణేష్ భారీ రిలీజ్ చేయబోతున్నారు, బాలు గాడి లవ్ స్టోరీ సినిమా ఆద్యాంతం నేటి యూత్‌కు నచ్చేలా రొమాన్స్, యాక్షన్, సస్పెన్స్ ఇలా అన్ని ఎలిమెంట్స్ ఉండబో తున్నాయి. ఈ సినిమా పట్ల చిత్ర యూని ట్‌కు మంచి విశ్వాసం ఉంది. ఆకుల అ ఖిల్, దర్శక మీనన్, చిత్రం శ్రీను, జబర్దస్త్ గడ్డం నవీన్, జబర్దస్త్ చిట్టిబాబు, రేవతి, లక్ష్మి ్మ, రాఘవరావు, మహేష్, సూరజ్ తదిత రులు నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ శ్రీ ఆకుల భాస్కర్, బ్యానర్ భామ క్రియేషన్స్, రైటర్, డైరెక్టర్ యల్. శ్రీనివాస్ తేజ్, నిర్మా త ఆకుల మంజుల, డి.ఓ.పి రవి కుమార్ నీర్ల, మ్యూజిక్ డైరెక్టర్ ఘనశ్యామ్, ఎడిటర్ యాదగిరి కంజారాలలుగా వ్యవహా రిస్తు న్నారు.

## ఈసారి చైతూపై కన్ను




టాలీవుడ్‌లో ఊర మాస్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఆయన తొలి సినిమా భద్రతో బ్లాక్‌బస్టర్ అందుకున్న డైరెక్టర్ బోయపాటి శ్రీను అఖండ 2 తర్వాత ఏ హీరోతో సినిమా తీస్తాడన్నది చర్చనీయాంశంగా మారింది. అల్లు అర్జున్‌తో తీస్తాడని వార్తలొచ్చినా తను అట్లీ దగ్గర లాక్ అయిపోయాడు. సీనియర్ హీరోలందరూ రెండు మూడు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. దీంతో మిడ్ రేంజ్ హీరోలపై కన్నేసినట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం బోయపాటి శ్రీను అక్కినేని నాగ చైతన్యతో సినిమా తీసేందుకు సన్నాహాలు చేస్తున్నాడని ప్రచారం జరుగుతోంది. తండేల్‌తో రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన నాగచైతన్య ప్రస్తుతం విరూపాక్ష డైరెక్టర్ కార్తీక్ దండుతో ఓ మూవీలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇది చైతూకి 24వ సినిమా. దీని తర్వాత తన ల్యాండ్ మార్క్ మూవీని బోయపాటి శ్రీనుతో తీసేందుకు నాగచైతన్య కూడా ఇంట్రస్ట్ చూపిస్తున్నాడని టాక్. అన్నీ కుదిరితే 14 రీల్స్ సంస్థ నిర్మించే అవకాశాలున్నాయని టాక్ నడుస్తోంది.

# గర్భిణులకు సురక్షత ప్రయాణం కోసం..


రిషిత

రిషతది ఒడిశాలోని భువనేశ్వర్. చిన్నప్పటి నుంచి నిరుపేదలకు సాయం చేయాలనుకునే రిషిత హైస్కూల్ స్థాయిలోనే నిధుల సేకరణ చేసి ఎన్జీవోలతో కలిసి పనిచేయడం ప్రారంభించింది. తమ ఇంట్లో సహాయకురాలిగా ఉండే మహిళ సొంతూరికి ప్రయాణమైంది. సరిగ్గా లేని రోడ్డు మార్గంలో బస్సులో ప్రయాణించడంతో ఆమెకు గర్భస్రావమైంది. ఇలా రెండుసార్లు జరిగిందని తెలిసి గర్భిణులకు సురక్షిత ప్రయాణాన్ని అందించేలా ఏదైనా చేయాలను కుంది. రహదారులు గోతులుగా ఉన్నప్పుడు ఆ వాహనంలో గర్భిణులున్నారని డ్రైవరు గుర్తిస్తే కాస్త జాగ్రత్తగా డ్రైవ్ చేస్తారనిపించింది రిషితకు. అలాగని ఎక్కిన ప్రతి ఒక్కరి గురించి డ్రైవరు తెలుసుకోవడం కష్టమైన విషయం. దీనికి ప్రత్యామ్నాయంగా ట్రాక్ చేసే విధానం మంచిదనిపించింది. అందుకే బస్సులోని సాంకేతికతకు అనుసంధానం చేస్తూ బయోమెట్రిక్ పరికరాన్ని రూపొందించింది. గర్భిణులు, వృద్ధులు, వికాలాంగులకు సంబంధించిన ప్రభుత్వ డేటాబేస్ ఈ సిస్టమ్‌కు




అనుసంధానమవుతుంది. ఇందులోని కెమెరా డేటాబేస్ ద్వారా ప్రయాణికుల గుర్తింపును స్కాన్ చేస్తుంది. జీపీఆర్ఎస్ షీల్డ్ ద్వారా బస్సు డ్రైవర్, కండక్టర్‌కు ప్రయాణంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవడానికి హెచ్చరికను పంపుతుంది. దీంతో ఆయా వ్యక్తులకు అనుకూలమైన సీటింగ్ ఏర్పాటు చేస్తారు. 'గర్భిణులకు సురక్షితమైన ప్రయాణం' పేరుతో రూపొందించిన ఈ ప్రాజెక్టు బస్సు ప్రయాణాలతో మహిళల్లో గర్భస్రావం కాకుండా ఉండేలా చేయడానికి ఉపయోగపడుతుంది. రిషిత రూపొందించిన ఈ పరికరానికి డాక్టర్ అబ్దుల్‌కలాం ఇగ్నైట్‌మైండ్ ఇన్నోవేషన్ అండ్ క్రియేటివిటీ అవార్డు దక్కింది.

# ప్రభుత్వశాఖలో తొలి మహిళా డ్రైవర్



**మనసుకు నచ్చిందే చేస్తామంటున్నారు నేటి మహిళ క్రమంలో తమను తాము నిరూపించు కోవడమే కాదు.. ఒడిశాకు చెందిన సంధ్యారాణి మాఝీ ఇదే కోవకు చెందుతుంది. చిన్నతనం నుంచి డ్రైవింగ్‌ని ఇష్టపడిన ఆమె.. దీన్నే తన వృత్తిగా మార్చుకోవాలనుకుంది. ఈ పట్టుదలే నేడు ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టింది. ఇటీవలే ఒడిశా ప్రభుత్వ శాఖలో డ్రైవర్‌గా చేరిన ఆమె.. ఈ ఘనత సాధించిన తొలి మహిళగా నిలిచింది. ఈ నేపథ్యంలో సంధ్య డ్రైవింగ్ జర్నీ గురించి తెలుసుకుందాం..**

**చిన్నాటి కల!** చిన్నతనం నుంచి ఏ విషయంలోనైనా ధైర్యంగా వ్యవహరించే సంధ్య.. డ్రైవింగ్‌పై ఇష్టాన్ని పెంచుకుంది. అదెంతలా అంటే.. స్కూల్ బస్‌లో వెళ్లినా, ఏదైనా బైక్‌పై ప్రయాణించినా డ్రైవర్ నడిపే తీరును ఆసక్తిగా గమనించేది. నేను ఎక్కింది ఏ వాహనమైనా సరే.. డ్రైవర్ సీట్లో కూర్చున్న వ్యక్తి డ్రైవింగ్ స్కిల్స్‌ని సునిశితంగా పరిశీలించేదాన్ని. అతడు స్టీరింగ్ ఎలా తప్పుతున్నాడు? బ్రేకులెలా మేస్తున్నాడు? క్లచ్ ఎలా నొక్కుతున్నాడు? ఆయా ప్రదేశాల్ని బట్టి వేగాన్ని పెంచుతూ తగ్గించే విధానం.. ఇలా ప్రతి విషయాన్నీ గమనించేదాన్ని. ఇది నాలో డ్రైవింగ్ పట్ల ఆసక్తిని మరింతగా పెంచింది. అంటోన్న సంధ్య గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక డ్రైవింగ్‌లో మరిన్ని మెలకువలు నేర్చుకుంది.



**భర్త ప్రోత్సాహంతో..** అయితే అంతలోనే ఆమెకు వివాహం జరగడంతో డ్రైవర్ కావాలన్న తన కల కలగానే మిగిలిపోతుందేమో అనుకుంది సంధ్య. కానీ ఆమె భర్త కూడా ప్రొఫెషనల్ డ్రైవర్ కావడంతో తన భార్య ఆసక్తిని తెలుసుకుని ఆమెనూ ఇదే దిశగా ప్రోత్సహించాడు. నా భర్త ప్రోత్సాహంతోనే తొలుత నాలో కారు నడపడం ప్రాక్టీస్ చేశా. ఆపై తనే నాకు ఓ సెకండ్‌హ్యాండ్ కారు కొని బహుమతిగా ఇచ్చాడు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది నా జీవితాన్నే మలుపు తిప్పింది. ఖాళీ దొరికితే చాలు ఈ కారులో లాంగ్‌డ్రైవ్‌కి వెళ్లేదాన్ని. ఇలా కఠినమైన రోడ్లు, ములుపులున్న చోట ఎలా వాహనం నడపాలో నేరున్నా. ఆపై ఇక్కడి ఓ ట్రైనింగ్ సెంటర్‌లో చేరి ఇందులో పూర్తి నైపుణ్యాలు గడించా. ద్విచక్ర, త్రిచక్ర నాలుగు చక్రాల వాహనాలు పర్‌ఫెక్ట్‌గా నడుపుతూ వీటిల్లో లైసెన్సులు పొందా.. అంటూ తన డ్రైవింగ్ జర్నీ గురించిచెబుతోంది సంధ్య.

**ఆ అవకాశం చేజారినా...** అయితే డ్రైవింగ్‌లో పూర్తి పట్టు సాధించాక.. ఇందులో ఉద్యోగాల వేట ప్రారంభించింది సంధ్య. ఈ క్రమంలో రెండేళ్ల క్రితమే విదేశంలో ఓ జాబ్ ఆఫర్ వచ్చిందట. అయితే వివిధ కారణాల రీత్యా దాన్ని స్వీకరించలేక పోయానంటోంది. వ్యక్తిగత కారణాల వల్ల మంచి ఉద్యోగావకాశాన్ని కోల్పోయా. అయినా నిరుత్సాహపడ కుండా ఇంతకంటే మంచి ఆఫర్ వస్తుందేమో అన్న నమ్మకంతో ముందుకు సాగా. ఈ క్రమంలో స్కూల్ బస్ డ్రైవర్‌గా చేరా. కొన్నాళ్లు గడిచాక.. ఒడిశా ప్రభుత్వ శాఖల్లో డ్రైవర్లు కావాలన్న నోటిఫికేషన్ చూశా. వెంటనే దానిక అప్లై చేశా. నాకున్న అనుభవం, నైపుణ్యాలు చూసి వాళ్లు నన్ను ఈ ఉద్యోగానికి ఎంపిక చేశారు. ఇటీవలే ప్రభుత్వ వాహన డ్రైవర్‌గా విధుల్లో చేరా.. అంటోన్న సంధ్య.. ఒడిశా ప్రభుత్వ శాఖలో పని చేసే తొలి మహిళా డ్రైవర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఆమె.. ఆ రాష్ట్ర వాణిజ్య, రవాణా, గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి అయిన ఉషా పధీకి అధికారిక డ్రైవర్‌గా కొనసాగు తోంది. ఈ క్రమంలోనే ఉష.. సంధ్యను ప్రశం సిస్తూ ఆమెతో దిగిన ఫొటోను ఎక్స్‌లో పోస్ట్ చేయగా.. ఈ ట్వీట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. పలువురు ఆమెను ప్రశంసిస్తున్నారు.

**ఇక్కడితో ఆగిపోను ...** జీవతంలో ఎంత సాధించినా..ఇంకా చేరుకోవాల్సి లక్ష్యాలు, గమ్యాలు బోలెడుంటాయంటోంది సంధ్య. ప్రస్తుతం ప్రభుత్వోద్యోగం సాధించినా ఇక్కడితో ఆగిపోనని చెబుతోంది. భవిష్యత్తులో భారీ వాహనాలు నడపాలన్న కోరిక ఉంది. అయితే ఇదంత సులభం కాదని నా సోదరుడు నన్ను హెచ్చరించాడు. అయినా నేను వెన్కకి తగ్గను.

# సానుకూలంగా మెలుగుతూ..

ఉద్యోగినులకు ఇంటి పనులకు బయటివి తోడై ఒత్తిడి పెరిగి పోతుంటుంది. ఇది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భాగస్వామితో విభేదాలకి దారితీస్తుంది. అలా కాకుండా ఉండాలంటే సానుకూలంగా మెలుగుతూ సమస్యలను పరిష్కరించుకోవాలి. పనులన్నీ చకాచకా చేసేయాలన్న తొందరమాని, సులువుగా చేసుకునే మార్గాలేంటో తెలుసుకోవాలి. వాటిని ఆచరణలో పెడితే త్వరగా అలసిపోరు.



ఏదైనా ప్రాధాన్యతా క్రమంలో చేస్తే సరి. ఇంటి పట్టు నుండే మహిళలు అన్ని పనులూ తామే చేసుకోవాలి అనుకుంటారు. అలాకాకుండా భర్తకి, పిల్లలకి కాస్త పనులు చెప్పండి. వారు నాకు చేతకాదు అంటే.. పనులన్నీ ఒక్కదాన్నే చేసుకోవడం కష్టం అవుతోందన్న విషయాన్ని విడమరచి చెప్పండి. వాళ్లూ అర్థం చేసుకుంటారు. మొదటిసారి కాస్త అటు ఇటుగా చేసినా క్రమంగా నేర్చుకుంటారు. ఆఫీసులో అలసిపోయి ఇంటికి వస్తే కాస్తయినా విశ్రాంతి దొరకాలి. ఎవరి పనులు వారు చేసుకోవడం అలవాటైతే..మీకు ఒత్తిడీ ఉండదు. ఇందుకోసం ఇంటిల్లిపాదికీ పని విభజన చేసేయండి తర్వాత ఎవరేం చేశారో పైపైన పరిశీలించుకుంటే సరి. ఏ పనిలోనూ ఎవరూ నిపుణులు కాదు. క్రమంగా అన్నీ వారే ఒంట పట్టించు కుంటారు.

# పేదవాడి యాపిల్

దోరదోర జామకాయలను చూడగానే చట్టుకున్న కొరుక్కుని తినేయాలని పిస్తుంది. పచ్చగా, చూడచక్కగా ఉండే వీటిలో పోషకాలూ ఎక్కువే. పేదవాడి యాపిల్‌గా పిలిచే వీటిల్లో ఉండే ఆరోగ్య ప్రయోజ నాలెన్నో.. వీటిల్లో విటమిన్-సి ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచి.. తరచూ అనారోగ్యాల బారినపడ కుండా కాపాడు తుంది. అంతేకాదు ఈ విటమిన్ తెల్ల రక్తకణాల ఉత్పత్తికీ తోడ్పడుతుంది. వీటిల్లోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్ బారి నుంచి శరీరాన్ని కాపాడతాయి. క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. వీటిల్లో ఉండే అధిక పొటాషియం గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. గుండెపోటుకు గురికాకుండా సాయపడుతుంది. ఇది రక్తపోటును నియంత్రించడానికీ తోడ్పడుతుంది. జామ కాయల్లో ఉండే పోషకాలు రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడానికి సాయపడతాయి. ఎక్కువగా ఉండే పీచు పదార్థం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అంతేకాదు మలబద్ధకాన్నీ పోగొడుతుంది. పీచు ఎక్కువగా ఉండటం వల్ల త్వరగా కడుపు నిండిన భావన కలుగుతుంది. అందువల్ల బరువు తగ్గాలనుకునేవారికి ఇవి సరైన ఎంపికకాగలవు. వీటిల్లో పుష్కలంగా ఉండే యాంటీఆక్సిడెంట్లు వృద్ధాప్య లక్షణాలను ఆలస్యం చేస్తాయి.



## గింజలు తీస్తుంది..

గింజలు తీస్తుంది, ముక్కలు కోస్తుంది ! మామిడిపండు, పుచ్చకాయ, యాపిల్ లాంటి పండ్లు మహా రుచిగా ఉండి, ఊరిస్తుం టాయి. కానీ గింజలు తీయడం, ముక్కలు కోయడం కాస్త విసుగ్గానే ఉంటుంది. ఆ శ్రమను తగ్గించడానికి రకరకాల ఫ్రూట్ స్లైసర్లు వచ్చాయి. వీటిని కనుక కొనుక్కున్నామంటే పని చాలా సులవైపోతుంది.



# అందమంతా 'అల్లిక'లోనే..





ఇప్పటికీ చిట్టి చిట్టి క్రోషే బూటీలు, మిటెన్లు, స్వెటర్ల వంటి వాటిని బుజ్జాయిలకు వేసి మురిసిపోతుంటారు చాలామంది అమ్మలు. ఆ తరువాత వాటిని అపురూపంగా దాచుకుంటారు. కూడా. మనతో అనుబంధాన్ని పెనవేసుకుంటాయి. అందుకేనేమో... కాలం మారినా, అనేక రకాల గృహాలంకరణల రూపాల్లోకి మారి, ఇప్పటికీ ట్రెండీగా నిలుస్తున్నాయి. అందమైన కర్టెన్లు, టేబుల్ రన్నర్లు, మ్యాట్లు, కోస్టర్లు... ఇలా ఒక్కటేమిటీ కాదేదీ 'క్రోషే' కళకు అనర్హం అన్నట్లుగా భిన్న రకాల్లో అందుబాటులోకి వస్తున్నాయి. సృజనాత్మకత, వ్యక్తిగత అభిరుచుల మేళవింపుతో పాటు.. ఆధునిక హంగులూ అద్భుత వస్తువులకే ఓటేస్తున్నారు చాలామంది ఆడవాళ్లు. ఇంట్లో వాడే ప్రతి చిన్న వస్తువు ఉండటమేకాదు, అది నయనానందకరమైన భావననీ అందించాలనుకుంటున్నారు. కాబట్టే, ఆతరం, ఈతరం అనే తేడాలేకుండా ఏరికోరి క్రోషేనే ఏంచుకుంటున్నారు. అందమైన డిజైన్లు ఉన్న వస్తువులు బోలెడు దొరకొచ్చు.... కానీ, మనసు తెలుసుకుని మన కోసమే ప్రత్యేకంగా అల్లినట్లుండే వీటిని ప్రేమించనివారెవరు? రంగురంగులు పూలు, లతలు, సున్నితమైన అల్లకం... ఎవరినైనా మంత్రముగ్ధుల్ని చేయాల్సిందే.... ఏ ఆధునిక యంత్రాలకూ అందని క్లిష్టమైన అల్లికలోని సృజనాత్మక ముచ్చటగొల్పాల్సిందే. అందుకే, అల్లిన వస్తువులు ఒకటో, రెండో ఉండటం కాదు, సాధ్యమైనన్ని రూపాల్లో ఒక భాగం అయ్యేలా చూస్తున్నారు. మనమూ ప్రయత్నిద్దామా ఈ కొత్త ట్రెండ్‌ని..







# మాంగల్య ప్రదాత శ్రావణగౌరి

హైందవ సంప్రదాయంలో శ్రావణం విశేషమైన మాసం. హిందూ వివాహానంతరం మహిళలు సౌభాగ్యం, సంసార సౌఖ్యం, ఉత్తమ సంతానం కొరకు శ్రావణమాసంలో వచ్చే మంగళవారం వ్రతం చేపడతారు. భర్తకి ఆయురారోగ్యాలను ప్రసాదించ మని కోరుకుంటూ పంచవర్ష మంగళగౌరీవ్రతాన్ని ప్రారంభించి వరుసగా ఐదు సంవత్సరాలు ఈ వ్రతం ఆచరించి, ఉద్యాపన చేసుకొంటారు. ఈ శ్రావణ మంగళవారనోమును పెళ్లైన స్త్రీలు మొదటిసంవత్సరం పుట్టింటగాని అత్తింటగాని విడిగా ఉన్నా కూడా చేసుకొనవచ్చు. తల్లి ఆధ్వర్యంలో జరిపించుకోవడం చెప్పదగిన సూచన. అందుబాటులో లేనట్లు అయితే ఆ నోము వివరాలను, విశేషాలను అనుభవజ్ఞులైన పెద్ద ముత్తైదువుల సమక్షంలో చేసుకొని అవగాహన పొందవచ్చు. ముందురోజు అనగా సోమవారం శుచియై శనగలను వినాయకుని తలుచుకుంటూ నీటిలో నానబెట్టాలి. సోమవారం రాత్రి ఫలహారం చేయాలి. తమలపాకులు వక్కలు, అరటిపండ్లు వగైరా ఏర్పాటు చేసుకోవాలి. బియ్యపుపిండి రెడీ చేసుకోవాలి. పూజా విధానం, మంగళగౌరి వ్రతం కథ అష్టోత్తర నామాలతో, అలాగే తోరనరగంధి పూజ మదలైన వివరాలతో ఉన్న పుస్తకం అందుబాటులో ఉంచకోవాలి. వ్రతాన్ని ఆచరించే మహిళలు మంగళవారం ఉదయమే తలంటుకుని, శుచియైన వస్త్రధారణతో కుంకుమ, కాటుక, కాళ్ళకు పారణి అలంకరించుకుని, మంగళగౌరిని పూజకు సిద్ధం చేసుకునే స్థలంలో ఆవుపేడతో, కుదరక పోతే పసుపుచేతితో అలికి, నోము పట్టిన సంవత్సరం ఐదు, రెండవ సంవత్సరం పది ఇలా పెంచుకుంటూ ఐదవ సంవత్సరం ఇరవై ఐదు బియ్యం పిండితో పద్మాల ముగ్గులు వేసుకోవాలి. చిన్న చిన్నవి సంఖ్యలో చూసుకుని వేసుకోవాలి. వాటిపై పీటం వేసి, గౌరీదేవిని ఇత్తడి, రాగి, వెండి లేదా పెళ్లికి ముందుగా పూజచేసిన గౌరదీదేవిని స్థాన చేయాలి.న ఈ గౌరీ దేవిని తనతోపాటు వివాహానంతరం తెచ్చుకునే సంప్రదాయం ఉంటుంది. బెల్లం, బియ్యపు పిండిని ఆవునేయితో కలిపి, జ్యోతులు వెలిగించుటకు వీలుగా కుందిలాగ పైన ముగ్గుల సంఖ్య మాదిరి ఐదు, పది, పదిహేను ఇరవై, ఇరవై ఐదు ఇలా క్రమంగా పెంచుకుంటూ తయారు చేసుకుని ఆవునేయితో దీపాలు సిద్ధం చేసుకోవాలి. పసుపు గణపతిగాని, గణపతి విగ్రహంగాని ఇత్తడి పళ్ళెంలో వియ్యంపోసి మధ్యలో విగ్రహం ఉంచి ముందుగా షోడశనామాలతో గణపతిని అర్చించి గౌరీవ్రతం తలపెట్టాను. విజయవంతంగా ఐదు సంవత్సరాలు పూర్తిచేసి, ఉద్యాపన చేయించి గౌరీదేవి అనుగ్రహం పొందేలా ఆశీర్వదించమని వేడుకుంటూ పూజచేయాలి.

- దేవులపల్లి పద్మజ

ఆధ్యాత్మికం

# అల్పాహారం తినండి

**సమయం లేదు, ఆకలి అనిపించలేదు, ఒక్కపూట తినకపోతే కెలోరీలు తగ్గుతాయి.. అల్పాహారం మానేయ దానికి ఎన్నెన్ని కారణాలు చెబుతాం! కానీ శరీరాన్ని కష్టపెడుతున్నామని తెలుసా? పైగా కోరి మరీ బరువు పెంచు ఉన్నట్లే !**

రాత్రంతా నిద్రలో విశ్రాంతి తీసుకున్నాం అనుకుంటాం కానీ.. శరీరం మాత్రం తనని తాను రిపేర్ చేసుకుంటూ ఉంటుంది. అందుకే అదీ, మెదడు తిరిగి చురుగ్గా మారాలంటే ఉదయాన్నే సరైన పోషకాహారం అందించడం తప్పనిసరి. ఉదయాన్నే బద్ధకం వదులుతుంది. చురుగ్గా పనిచేయొచ్చని టీ, కాఫీలను ఆశ్రయిస్తుంటాం కదా? ఈసారి నుంచి వేడినీటిలో నిమ్మరసాన్నో, తేనెనో కలిపి తాగండి. కావాలంటే అల్పాహారమో పండో తిన్నాక టీ, కాఫీల జోలికి వెళ్లండి. పనుల మధ్యలో తినే వీలు లేదనిపిస్తే పండ్లు, నట్స్, గుడ్డు వంటివి తిన్నా మంచిదే! ఒక పూట తినకపోతే బరువు తగ్గుతామని చాలామంది భావిస్తారట. అది బ్రేక్‌ఫాస్ట్‌కి వర్తించదు. పైగా మనసు చిరుతిళ్లు చక్కెరలు ఎక్కువగా ఉండే జంక్‌ఫుడ్‌పైకి మళ్లు తుంది. అంతేకాదు, మనసు నిండక మామూలు దానికంటే ఎక్కువగా తినేస్తామట. అదికాస్తా బరువు పెరగ దానికి కారణం అవుతుంది. త్వరగా అయిపోతుందని బ్రెడ్, జామ్, స్వీట్‌నర్స్ ఎక్కువగా ఉండే ఓట్స్, సెరెల్స్ తిన్నా హానే! త్వరగా తినేయొచ్చు అని తీసుకునే హెల్దీ, బ్రేక్‌ఫాస్ట్ బార్‌లూ అంత మంచివి కావట. వాటిల్లోనూ అధికమోతాదులో చక్కెరలు ఉంటాయి. కాబట్టి వాటికీ దూరంగా ఉండాలి. కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ అన్నీ ఉన్నదాన్నే ఉదయం తీసుకోవాలి. సంప్రదాయ ఇడ్లీ, దోశ వంటివి తినండి. అయితే వాటికి కారుగూరలు చేర్చుకోండి, ఒక పండు, నట్స్, బ్రౌన్‌బ్రెడ్, గుడ్డు, కృత్రిమ చక్కెరలు లేని ఓట్స్, మిల్లెట్స్ వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. అంటే తినకపోయినా, ఏదో ఒకటిలే అని కడుపులో వేసుకున్నా మనకి మనం చేటు చేసుకున్నట్టే, కాబట్టి, ఆరోగ్యాన్ని పెంచుకునేలా తినండి. రోజంతా ఉత్సాహంగా ఉండండి. సమయం సరిపోవట్లేదు అనిపిస్తే ముందురోజే కాస్త పండ్లు కూరగాయలు వగైరా సిద్ధం చేసుకుంటే సరి ఏమంటారు?



# హుమ్మస్ టిఫిన్ చట్నీ

ఇడ్లీ, దోసె, వడల్లాంటి టిఫిన్లను మనం చట్నీలో నంజుకుని తింటుంటాం కదా.. అలాగే మధ్య ప్రాచ్య దేశాలకు చెందినవాళ్లు హుమ్మస్‌ను ఎంతో ఇష్టంగా తింటుంటారు. బ్రెడ్‌నుదీంట్లో ముంచుకుని తింటే భలే ఉంటుం దంటారు. ఇంతకీ దిన్నెలా చేస్తారంటే. పెద్ద సెనగలను ఉడికించి, నీళ్ల వడకట్టి దాంట్లో నువ్వులు, వెల్లుల్లిరేకలు వేసి మెత్తగా మిక్సీ పడతారు. చివరగా కాస్త నిమ్మరసం పిండుతారు. అలాగే ఉడికించిన సెనగల్లో బీట్‌రూట్ కలిపితే గులాబీరంగు హుమ్మస్ సిద్ధమవుతుంది. దీంట్లో పాలకూరను కలిపితే పచ్చపచ్చగా, చూడముచ్చటగా ఉండి కనువిందు చేస్తుంది. రకరకాల రంగులు, రుచుల్లోని హుమ్మస్‌లు ఇప్పుడు అమెరికా సూపర్ మార్కెట్లలోనూ అందుబాటులో ఉంటున్నా యట. అయినా కమ్మగా, రుచిగా ఉండే సెనగల పచ్చడి పాశ్చాత్యుల మనసులనూ దోచేయడంలో ఆశ్చర్యం ఏముంది చెప్పండి.





## ఎస్పోర్ట్స్ చెస్ వరల్డ్ కప్‌లో..
# ఫైనల్‌కు నిహాల్ అర్హత
### ప్రజ్ఞానంద ఓటమి

**న్యూఢిల్లీ:** ఈస్పోర్ట్స్ ప్రపంచ కప్-2025లో భారత చెస్ క్రీడాకారుడు నిహాల్ సరిన్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. సౌదీ అరేబియాలోని రియాద్‌లో జరిగే ఈ వరల్డ్ కప్‌లో త్రిస్సూర్‌కు చెందిన 21 ఏళ్ల నిహాల్ లాస్ట్ ఛాన్స్ క్వాలిఫయర్స్ నుండి ప్రధాన ఈవెంట్‌కు చేరుకున్న ఏకైక భారతీయుడుగా నిలిచాడు. ఫైనల్‌కు అర్హత సాధించిన ఇతరులలో అనిష్ గిరి, లెవాన్ అరోనియన్ మరియు జావోఖిర్ సిందరోవ్ ఉన్నారు. లాస్ట్ ఛాన్స్ క్వాలిఫయర్స్‌లో పాల్గొన్న మరో భారతీయుడు ప్రజ్ఞానంద రమేష్‌బాబు ఈ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు. స్పీడ్ చెస్ సామర్థ్యాలకు పేరుగాంచిన నిహాల్, ఆన్‌లైన్ చెస్ ప్రపంచంలో అత్యంత భయపడే ఆటగాళ్లలో ఒకరని నిరూపించుకున్నాడు. అంతకు ముందు తన గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచిన తర్వాత లాస్ట్ ఛాన్స్ క్వాలిఫయర్స్‌లో విజేతల బ్రాకెట్‌కు అర్హత సాధించిన నిహాల్, తన ప్రయోజనాన్ని ఎప్పుడూ వదులుకోలేదు. తన మొదటి మ్యాచ్‌లో డెనిస్ లాజావిక్‌పై విజయంతో తన ఆటను ప్రారంభించిన అతను, రెండవ మ్యాచ్‌లో అనిష్‌ను ఓడించాడు. ఆ తర్వాత భారత ఆటగాడు ఆండ్రీ ఎసిపెంకోపై విజయం సాధించి విజేతల బ్రాకెట్ సెమీఫైనల్స్‌కు అర్హత సాధించి ఎస్పోర్ట్స్ ప్రపంచ కప్ ఫైనల్స్‌లో తన స్థానాన్ని బుక్ చేసుకున్నాడు. ఇప్పటికే నేరుగా ఈ ఈవెంట్‌కు ఎరిగైసి అర్జున్ అర్హత సాధించగా, ఇప్పుడు నిహాల్ ఈస్పోర్ట్స్ ప్రపంచ కప్ ఫైనల్స్‌లో పోటీలో ఉన్న రెండవ భారతీయుడు అవుతాడు.




## ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలు..
# అంకితకు చారిత్రాత్మక రజతం
### పురుషుల జట్టుకు మరో కాంస్యం.. 12 పతకాలతో ముగించిన భారత్

**న్యూఢిల్లీ:** ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలు చివరి రోజు అంకిత చారిత్రాత్మక రజతం గెలుచుకోగా, పురుషుల 4+100 మీటర్ల జట్టు మరో కాంస్యం గెలుచుకుంది. దీంతో 2025 యూనివర్సిటీ గేమ్స్‌ను భారతదేశం 12 పతకాలతో ముగించినట్లయింది. వీటిలో 2 బంగారు, 5 రజత, మరియు 5 కాంస్య పతకాలు ఉన్నాయి. ఆదివారం జర్మనీలోని బోచుమ్‌లో జరిగిన ఎఫ్ఐఎస్‌యు వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్ 2025లో భారత అథ్లెటిక్స్ బృందం తమ అద్భుతమైన ప్రదర్శనను కొనసాగించింది.

భారత పతకాల సంఖ్యకు మరో మూడు పతకాలు జోడించింది. పోటీ చివరి రోజున మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో ఒలింపియన్ అంకిత ధ్యాని రజత పతకాన్ని గెలుచుకోగా, భారత మహిళల 20 కిలోమీటర్ల రేస్‌వాక్ జట్టు కాంస్య పతకాన్ని గెలుచుకుంది. తరువాత, అనిమేష్ కుజుర్, మణికంఠ హోబ్లిధర్, లాలు ప్రసాద్ భోయ్ మరియు మృత్యం దొండపాటిలతో కూడిన భారత పురుషుల 4+100 మీటర్ల రిలే జట్టు అద్భుతమైన రేసులో దూసుకెళ్లి భారతదేశం యొక్క మొట్టమొదటి రిలే కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఆ జట్టు 38.885 సెకన్లలో ఆస్ట్రేలియాను కేవలం ఒక మార్జిన్ (0.005) తేడాతో ఓడించి ఈవెంట్ నుండి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. అదే సమయంలో, దక్షిణ కొరియా మరియు దక్షిణాఫ్రికా వరుసగా స్వర్ణ మరియు రజత పతకాలను గెలుచుకున్నాయి. అలాగే అంకిత 4వ స్థానం నుండి చివరి ల్యాప్‌లో వెనుకబడి వచ్చి 9:31.99 సెకన్ల అద్భుతమైన సమయాన్ని నమోదు చేసింది, ఆమె మునుపటి 7 సెకన్ల భారీ తేడాతో మెరుగుపరిచి భారతదేశం యొక్క మొట్టమొదటి స్టీపుల్‌చేజ్ పతకాన్ని గెలుచుకుంది. మరోవైపు, సెజల్ సింగ్, మాన్సి నేగి మరియు మునితా పరాజపతి త్రయం కాంస్య పతకాన్ని గెలుచుకోవడంతో భారత మహిళల 20 కి.మీ రేస్‌వాక్ జట్టు వరుసగా రెండో యూనివర్సిటీ గేమ్స్ పతకాన్ని గెలుచుకుంది.

## ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్ మీట్..
# జావెలిన్‌లో దీపికు టైటిల్
### పురుషుల టైటిల్ దీపాంషు కైవసం




**న్యూఢిల్లీ:** ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్ మీట్-2025 మహిళ జావెలిన్‌లో భారత్ అథ్లెట్ దీపికి, పురుషుల జావెలిన్‌లో దీపాంషు శర్మ టైటిళ్లను కైవసం చేసుకున్నారు. మహిళల జావెలిన్‌లో దీపిక 56.41 మీటర్ల కొత్త వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శనతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం పంజాబ్‌లోని సంగ్రూర్‌లో జరిగిన అండర్ 20 మహిళల జావెలిన్ త్రోలో భారత జావెలిన్ త్రోయర్ దీపిక ఐదు నెలల విరామం తర్వాత పోటీ రంగంలోకి అద్భుతంగా తిరిగి వచ్చింది, తన సొంత అండర్ 20 మహిళల జావెలిన్ త్రో జాతీయ రికార్డును బద్దలు కొట్టింది. 19 ఏళ్ల దీపిక భారతదేశ అండర్ 20 జాతీయ రికార్డును ఒక మీటర్ కంటే ఎక్కువ మెరుగుపరిచేందుకు తన మొదటి ప్రయత్నంలోనే 56.41 మీటర్లు విసిరి రికార్డు సృష్టించిన ఈ పోటీని ప్రారంభించి విజయాన్ని ధృవీకరించింది. వీటిలో 54 మీటర్లకు పైగా మూడు త్రోలు ఉన్నాయి. ఇది ఆమెను సీనియర్ సర్క్యూట్‌లో భారతదేశంలోని టాప్ 10 ఆల్‌టైమ్ బెస్ట్ త్రోయర్‌ల జాబితాలోకి తీసుకువెళుతుంది. కాగా పురుషుల జావెలిన్ త్రో టైటిల్‌ను 19 ఏళ్ల యువకుడు దీపాంషు శర్మ గెలుచుకున్నాడు, అతను 35 మంది పురుష జావెలిన్ త్రోయర్లతో కూడిన మైదానంలో 76.03 మీటర్ల కొత్త వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శనతో అగ్రస్థానంలో నిలిచాడు. మరోవైపు, అనుభవజ్ఞుడైన ఒలింపియన్ సర్వేష్ కుషారే 2.26 మీటర్ల ఎత్తుతో పురుషుల హైజంప్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు, ఫెడరేషన్ కప్ నుండి అతని సీజన్ అత్యుత్తమ రికార్డును సమం చేశాడు. టోక్యో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించడానికి ప్రయత్నిస్తున్న సర్వేష్ తన ప్రదర్శనతో అద్భుత పరిచాడు. ఇది అతనికి కొన్ని కీలకమైన ర్యాంకింగ్ పాయింట్లను సంపాదించిపెడుతుంది.



పాకిస్థాన్, వెస్టిండీస్ కన్నా వెనుకంజ

127 టెస్ట్‌ల్లో 2 మ్యాచ్‌ల్లోనే విజయం

# టీమిండియా ఫెల్యూర్!

**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో టెస్ట్ మ్యాచ్‌లు అంటే ఓపిక, పట్టుదల, వ్యూహాలకు నిదర్శనంగా చెబుతుంటారు. అయితే, కొన్నిసార్లు మ్యాచ్ గమనం ఊహించని మలుపులు తిరుగుతుంది. ముఖ్యంగా తొలి ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థికి భారీ ఆధిక్యం దక్కినప్పుడు ఆ మ్యాచ్ గెలవడం అత్యంత కష్టమైన పనుల్లో ఒకటి. ఈ విషయంలో టీమిండియా రికార్డు చూస్తే, అది అంత మెరుగ్గా లేదని తెలుస్తోంది. అటువంటి సమయంలో టీమిండియా అసాధారణ రికార్డును సాధించడానికి, కీలక సమయాల్లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో మరింత పటిష్టంగా రాణించడం అవసరం. తొలి ఇన్నింగ్స్‌లో భారీ లోటును అధిగమించి గెలవడానికి అసాధారణమైన పోరాటం, పట్టుదల అవసరం. అయితే గత కొన్నేళ్లుగా, తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగుల కంటే ఎక్కువ ఆధిక్యాన్ని ప్రత్యర్థులకు సమర్పించుకున్న తర్వాత టీమిండియా ఆడిన మొత్తం 127 టెస్టుల్లో కేవలం 2 సార్లు మాత్రమే విజయం సాధించిందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ గణాంకాలు భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒక బలహీనతను స్పష్టంగా సూచిస్తున్నాయి. ముఖ్యంగా నాలుగో ఇన్నింగ్స్‌లో లక్ష్య ఛేదనలో మెరుగైన ప్రదర్శన కనబరచడంపై దృష్టి సారించాలి. టీమిండియా సాధించిన ఆ రెండు అద్భుత విజయాలు భారత్ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచాయి. 2021లో బ్రిస్బేన్ టెస్ట్ (ఆస్ట్రేలియాపై) భారత క్రికెట్ చరిత్రలో అత్యంత గొప్ప విజయాల్లో ఒకటి. అనేక మంది కీలక ఆటగాళ్లు గాయాలపాలై, ద్వితీయ శ్రేణి జట్టుతో బరిలోకి దిగిన భారత్, ఆస్ట్రేలియాకు తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని అప్పగించినా, నాలుగో ఇన్నింగ్స్‌లో 300+ పరుగుల లక్ష్యాన్ని ఛేదించి చరిత్ర సృష్టించింది. ఇది యువ ఆటగాళ్ల తెగువ, గొప్ప జట్టు స్ఫూర్తికి నిదర్శనం. అలాగే స్వదేశంలో ఇంగ్లాండ్‌తో 2024లో జరిగిన రాంచీ టెస్ట్‌లో కూడా టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో వెనుకబడినా, చివరికి పుంజుకుని విజయం సాధించింది.

ఈ విజయం, ఛేజింగ్‌లో టీమిండియా ఎదుర్కొంటున్న సవాళ్ల మధ్య లభించిన ఒక అరుదైన అవకాశం. ఇక ఛేజింగ్‌లో టీమిండియా ఎదుర్కొంటున్న సవాళ్లు చూస్తే గత 12 ఏళ్లలో టెస్టుల్లో 150 పరుగుల కంటే ఎక్కువ లక్ష్యాలను ఛేదిస్తూ కేవలం రెండు సార్లు మాత్రమే విజయం సాధించింది. 26 టెస్టుల్లో ఇలాంటి పరిస్థితి ఎదురవ్వగా, 17 మ్యాచ్‌ల్లో ఓటమి పాలై, 7 డ్రా అయ్యాయి. ఈ గణాంకాలు ఛేజింగ్‌లో టీమిండియాకు ఉన్న బలహీనతను స్పష్టం చేస్తున్నాయి. అయితే పాకిస్థాన్, వెస్టిండీస్ వంటి జట్లు కూడా ఈ విషయంలో భారత్ కంటే మెరుగ్గా ఉన్నాయి.

# పాకిస్థాన్ హ్యాట్రిక్
### వెస్టిండీస్‌పై 49 రన్స్ తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్-2025 టోర్నీలో పాకిస్థాన్ హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. ఈ టోర్నీలో భాగంగా లీడ్స్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో 49 పరుగుల తేడాతే పాకిస్థాన్ గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 200 పరుగులు చేసింది. పాక్ ఓపెనర్ కమ్రాన్ అక్మల్ విధ్వంసకర సెంచరీతో చెలరేగాడు. 43 ఏళ్ల అక్మల్ విండీస్ బౌలర్లను ఉతికారేశాడు.

లీడ్స్ మైదానంలో బౌండరీల వర్షం కురిపించాడు. 62 బంతులు ఎదుర్కొన్న అక్మల్ 13 ఫోర్లు, 5 సిక్స్‌లతో 113 పరుగులు చేశాడు. అతడితో పాటు, హాఫీజ్ 23




పరుగులతోరాణించాడు. విండీస్ బౌలర్లలో మహ్మద్, పొలార్డ్, బ్రావో, నర్స్ తలా వికెట్ సాధించారు. ఇక లక్ష్య ఛేధనలో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 151 పరుగులకే పరిమితమైంది. విండీస్ టాపర్డర్ మొత్తం విఫలమైంది. క్రిస్ గేల్ (5), స్మిత్ (3), సిమ్మన్స్ (0) పరుగులతో విఫలమయ్యారు. అయిత మిడిలార్డర్‌లో వాల్టన్ (42), పెర్కిన్స్ (30) పోరాడినప్పటికీ విండీస్‌కు ఓటమి తప్పలేదు. పాకిస్థాన్ బౌలర్లలో రీస్ 3 వికెట్లు పడగొట్టగా, తన్వీర్, యమీన్ తలా 2 వికెట్లు దక్కించుకున్నారు. కాగా ఈ టోర్నమెంట్‌లో ఇప్పటి వరకూ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించిన పాకిస్థాన్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

# వాణిజ్యం

# ఎల్ఐసిలో వందేళ్ల కవరేజీ అందించే పాలసీలు..

**న్యూఢిల్లీ, జూలై 27:** ఎల్ఐసి పెట్టుబడిదారులకు గొప్ప రాబడిని ఇవ్వడమే కాకుండా దీర్ఘకాలిక కవరేజీని అందించే కొన్ని పథకాలను నిర్వహిస్తుంది. పెట్టుబడిదారులు 100 సంవత్సరాల వరకు కవరేజ్ పొందే 5 పథకాల గురించి తెలుసుకుందాం. జీవన్ శిరోమణి పాలసీ అనేది నాన్‌లింక్డ్, వ్యక్తిగత జీవిత బీమా పొదుపు పథకం. ఇది బాగా సంపాదించే, వారి పెట్టుబడిని కాపాడుకోవాలనుకునే వారి కోసం ప్రత్యేకంగా రూపొందించింది. మీరు రూ.1 కోటి బీమా మొత్తంతో పాలసీ తీసుకుంటే, కనీస




నెలవారీ ప్రీమియం రూ. 94,000. ఈ ప్లాన్‌లో, మీరు 4 సంవత్సరాలు ప్రీమియం చెల్లించాలి. మీరు నెలవారీ, త్రైమాసిక, అర్ధ వార్షిక లేదా వార్షిక ప్రాతిపదికన ప్రీమియం చెల్లించవచ్చు. ఎల్ఐసి జీవన్ ఆనంద్ యోజన అనేది తక్కువ ప్రీమియంతో అద్భుతమైన రాబడిని ఇచ్చే టర్మ్ ప్లాన్. దీని ప్రత్యేకత ఏమిటంటే రోజుకు కేవలం రూ.45 పెట్టుబడి పెట్టడం ద్వారా మీరు భవిష్యత్తులో రూ.25 లక్షల వరకు నిధిని సృష్టించవచ్చు. నెలవారీ ప్రీమియం రూ.1,358, దీనిని మీరు వార్షిక, అర్ధవార్షిక, త్రైమాసిక లేదా నెలవారీ ప్రాతిపదికన జమ చేయవచ్చు. మీరు ఈ పాలసీలో బోనస్ ప్రయోజనాన్ని కూడా పొందుతారు. కానీ దీని కోసం కనీసం 15 సంవత్సరాలు పాలసీని కొనసాగించడం అవసరం. ఎల్ఐసీ జీవన్ ఆజాద్ పాలసీ అనేది నాన్‌లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్, వ్యక్తిగత పథకం. ఇది ప్రారంభించినప్పటి నుండి ప్రజాదరణ పొందుతోంది. ఈ పథకంలో పెట్టుబడి కాలం 15 నుండి 20 సంవత్సరాలు. కనీస బీమా మొత్తం రూ.2 లక్షలు. అలాగే గరిష్టంగా రూ.5 లక్షలు. పాలసీ మెచ్యూరిటీ తర్వాత, బీమా కంపెనీ స్థిర మొత్తాన్ని ఏకమొత్తంగా చెల్లిస్తుంది. 90 రోజుల నుండి 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తులు ఈ పథకం ప్రయోజనాలను పొందవచ్చు. అంటే పాలసీని పిల్లల పేరుతో కూడా కొనుగోలు చేయవచ్చు. ఎల్ఐసి జీవన్ ఉమాంగ్ పాలసీ అనేది నాన్‌లింక్డ్, పార్టిసిపేటింగ్, హోల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్. ఇది రక్షణతో పాటు రెగ్యులర్ ఆదాయం ప్రయోజనాన్ని అందిస్తుంది. ప్రీమియం చెల్లింపు వ్యవధి పూర్తయిన తర్వాత, పాలసీదారుడు ప్రతి సంవత్సరం హామీ ఇచ్చిన మొత్తంలో 8 పొందుతారు. పాలసీ మెచ్యూరిటీ సమయంలో లేదా పాలసీదారుడి మరణం వద్ద ఏకమొత్తం మొత్తం ఇవ్వబడుతుంది. దీనితో పాటు, ఈ ప్లాన్‌లో రుణ సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఇది అవసరమైన సమయాల్లో ఆర్థికసహాయం అందిస్తుంది. ఈ పాలసీ 100 సంవత్సరాల వరకు కవరేజీని అందిస్తుంది. ప్రీమియం చెల్లింపు వ్యవధి 15, 20, 25 లేదా 30 సంవత్సరాలు కావచ్చు. కనీస బీమా మొత్తం రూ. 2 లక్షలు. ఈ ప్లాన్ 3 సంవత్సరాల నుండి 55 సంవత్సరాల వయస్సు గల వారికి అందుబాటులో ఉంటుంది. అయితే ఈ పాలసీలన్ని వయస్సును బట్టి ప్రీమియం ఉంటుంది.

# రానున్న కాలంలో 'ఐటి'కి మంచి రోజులే..

**ముంబై, జూలై 27:** కొన్ని నెలలుగా ఐటి పరిశ్రమలో చెప్పుకోదగిన లాభాలు ఉండడం లేదు. ప్రస్తుత త్రైమాసికంలో కంపెనీలు పోస్ట్ చేస్తోన్న ఫలితాల్లో చాలాభాగం లేఆఫ్స్, డిస్క్రిషనరీ వ్యయాన్ని తగ్గించుకోవడం వల్ల ఒనగూరిందే. అయితే సమీప భవిష్యత్తులో వీటిలో మార్పు రాబోతుందని అంచనాలు వెలువడుతున్నాయి. కృత్రిమి మేధస్సు (ఎఐ), డేటా ఆధునీకరణ, మెరుగైన డిజిటల్ అనుభవాల కోసం ఐటి కంపెనీల కస్టమర్లు వ్యయాన్ని పెంచే అవకాశం ఉంది. ముఖ్యంగా బ్యాంకింగ్, బీమా, రిటైల్ రంగాల్లో విచక్షణాత్మక ఐటి వ్యయం తిరిగి గాడిన పడుంతుందనే సంకేతాలు వస్తున్నాయి. స్థూల ఆర్థిక ఒడుదుడుకులు, అంతర్జాతీయ టారీఫ్ అనిశ్చితుల మధ్య మొత్తం టెక్ బడ్జెట్లు స్తంభించాయి. సాంప్రదాయ ఐటి కార్యకలాపాలను కంపెనీలు జాగ్రత్తగా నిర్వహిస్తున్నాయి. అయితే కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ మేరకు ఐటి కస్టమర్ కంపెనీలు తమ వ్యయాన్ని పెంచుతున్నాయి. ఇది ఐటి రంగానికి కలిసొచ్చే అంశం. వినియోగదారులు ఎఐ వాడకంవైపు మొగ్గ చూపడం కూడా ఐటీకి ఊతం ఇస్తుంది. జెపి మోర్గాన్ చేజ్, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి ప్రధాన యుఎస్ బ్యాంకులు ఎఐకి సంబంధించి ప్రయోగాత్మక దశలను దాటి పూర్తిస్థాయి, ఉత్పత్తి గ్రేడ్ ఎఐను వాడుతున్నాయి. ఈ పరివర్తన వ్యాపార ఫలితాలకు నేరుగా దోహదంచేస్తుంది. మల్టీ బిలియన్ డాలర్ల టెక్ బడ్జెట్ ఉన్న సంస్థలు ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా గణనీయమైన వార్షిక ఆదాయాన్ని సంపాదిస్తున్నట్లు ఫారెస్టర్ ప్రిన్సిపల్ అనలిస్ట్ అన్నారు. స్పష్టమైన ఉత్పాదకత లాభాల కోసం ఎఐ ఎంతో ఉపయోగపడుతోందని చెప్పారు. హైపర్-పర్సనలైజేషన్‌తో మెరుగైన కస్టమర్ అనుభవం చేకూరుతుందని చెప్పారు. ఏజెంట్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా కార్యకలాపాలను క్రమబద్ధీకరించే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. ఇది ఐటీ కంపెనీలకు లాభాలు తెస్తుందని చెప్పారు. ప్రముఖ సంస్థల ఐటి వ్యయంలో 50శాతం కంటే ఎక్కువ కృత్రిమి మేధ, డేటా ఆధునీకరణ, కస్టమర్-ఫేసింగ్ ఇన్నోవేషన్ వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు.



# ఇపిఎఫ్ఒలో డబ్బులు లేకపోయినా నామినీకి రూ.50వేలు

**ముంబై, జూలై 27:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) ఉద్యోగుల డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ (ఇడిఎల్ఐ) పథకంలో ప్రధాన మార్పులు చేసింది. లక్షలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే ఈ పథకం ప్రయోజనాలను పొందడానికి ఇప్పుడు ఎటువంటి కఠినమైన షరతులు ఉండవు. ఉద్యోగంలో ఉన్నప్పుడు ఏదో ఒక కారణం వల్ల సంపాదిస్తున్న సభ్యులు మరణించిన కుటుంబాలకు ఇది ప్రత్యేకంగా ఉపశమనం కలిగిస్తుంది. ఒక ఉద్యోగి తన ఉద్యోగంలో ఉన్నప్పుడు మరణిస్తే, ఆ ఉద్యోగి పీఎఫ్ ఖాతాలో అంత మొత్తం లేకపోయినా, అతని కుటుంబానికి కనీసం రూ.50,000 బీమా ప్రయోజనం ఖచ్చితంగా లభిస్తుందని కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. గతంలో ఖాతాలో కనీసం రూ.50,000 జమ చేయడం తప్పనిసరి. అప్పుడే బీమా ప్రయోజనం అందుబాటులో ఉండేది. ఇప్పుడు ఈ షరతు తొలగించింది. నిబంధనలలో మరో ప్రధాన మార్పు ఏమిటంటే, ఒక ఉద్యోగి రెండు ఉద్యోగాల మధ్య గరిష్టంగా 60 రోజుల విరామం ఉంటే, అది ఉద్యోగంలో అంత రాయంగా పరిగణించరు. అంటే 60 రోజుల వరకు అంతరం 12 నెలల నిరంతర సేవను లెక్కించడంలో ఎటువంటి ప్రభావాన్ని చూపదు. ఇది వేర్వేరు కంపెనీలలో పనిచేసిన కానీ మధ్యలో స్వల్ప విరామం ఉన్న ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుస్తుంది. కొత్త నిబంధనల ప్రకారం.. ఒక ఉద్యోగి తన చివరి జీతం అందుకున్న 6 నెలల్లోపు మరణిస్తే, అతని నామినీకి కూడా ఇడిఎల్ఐ పథకం బీమా ప్రయోజనం లభిస్తుంది. అంటే జీతం నుండి పిఎఫ్ తగ్గించబడిన 6 నెలల్లోపు




మరణం సంభవించినప్పటికీ నామినీకి బీమా ప్రయోజనం లభిస్తుంది. ఉద్యోగి డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ (ఇడిఎల్ఐ) ఇపిఎఫ్ఒ కింద నడుస్తుంది. వ్యవస్థీకృత రంగంలోని ఉద్యోగులకు ఉద్యోగంలో ఉన్నప్పుడు ఊహించని మరణం సంభవించినప్పుడు వారికి బీమా రక్షణ కల్పించడం దీని ఉద్దేశ్యం. ఈ పథకంలో ఉద్యోగి తన జేబు నుండి ఎటువంటి సహకారం అందించాల్సిన అవసరం లేదు. మరణిస్తే, చట్టపరమైన వారసుడికి ఏకమొత్తం లభిస్తుంది. ఈ పథకం కింద రూ.2.5 లక్షల నుండి రూ.7 లక్షల వరకు బీమా కవరేజీ ఉంటుంది.

# యేడాదిలో భారీగా తగ్గిన నియామకాలు..

**న్యూఢిల్లీ, జూలై 27:** భారతదేశ ఐటి రంగం నేలచూపులు చూస్తోంది. ఐటి వృద్ధికి మరోసారిభారీగానే ఎదురుదెబ్బ తగిలింది. మొదటి త్రైమాసికంలో నియామకాలు 72శాతం క్షీణతను చూశాయి. క్లుప్తంగా చెప్పాలంటే 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం భారతదేశ ఐటి రంగానికి తీవ్ర నిరాశను మిగిల్చింది. 280 బిలియన్ డాలర్ల విలువ చేసే ఈ రంగంలోని టాప్-6 ఐటిసంస్థలు ఏప్రిల్-జూన్ కాలంలో కేవలం 3,847 ఉద్యోగులను మాత్రమే కొత్తగా కంపెనీల్లోకి చేర్చుకోగలిగాయి. ఇది మునుపటి త్రైమాసికంలో నమోదైన 13,935 నియామకాల నుంచి దాదాపు 72శాతం తగ్గుదలగా గణాంకాలు చెబుతున్నాయి. ఈ గణాంకాలు ఇండస్ట్రీలో కొనసాగుతున్న ఆర్థిక మాంద్యంతో పాటుగా కంపెనీ భయాలను స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. భారతదేశంలో టాప్‌లో దూసుకుపోతున్న ఐటి దిగ్గజం టిసిఎస్ ఈ యేడాది తన నియామకాలను భారీగా తగ్గించింది. కేవలం 5,060మంది ఉద్యోగులను మాత్రమే కొత్తగా చేర్చుకుంది. ఇది కంపెనీకి చాలా తక్కువగా చెప్పుకోవచ్చు. ఇక మరో దిగ్గజం ఇన్ఫోసిస్ ఈ యేడాది లేఆఫ్స్ మీద ఎక్కువగా దృష్టిపెట్టింది. ఉద్యోగులను చేర్చుకునేదాని మీద దృష్టిని పెట్టలేదు. కేవలం 210 మందిని మాత్రమే ఈ యేడాది నియమించుకుంది. ఇది కంపెనీకి చాలా తక్కువగా చెప్పుకోవచ్చు. ఇక టాప్ ఐటి దిగ్గజాలు విప్రో, హెచ్‌సిఎల్ టెక్, టెక్ మహీంద్రా, ఎల్‌టిఐ మైండ్‌ట్రీ వంటి కంపెనీలు అన్నీ కలిసి కూడా 1,423 మంది ఉద్యోగులను మాత్రమే నియమించుకున్నాయి. ఇది కేవలం బలహీన గ్లోబల్ డిమాండ్ వల్ల మాత్రమే కాదని చెప్పుకోవచ్చు. కంపెనీలు ఇప్పుడు ఎఐ, ఆటోమేషన్, అభివృద్ధి చెందిని టెక్నాలజీలను మరింతగా వినియోగించుకుంటూ, తక్కువ వనరులతో ఎక్కువ పనితీరును లక్ష్యంగా పెట్టుకున్నాయి. దీనివల్ల ఎంట్రీ-లెవెల్ నియామకాలు గణనీయంగా తగ్గాయి. చాలా కంపెనీలు ఉద్యోగులను తీసేసి ఎఐద్వారా నడిపిస్తున్నాయి.




# ఎఐకి ప్రభుత్వ మద్దతు కావాలి: నివేదిక

**ముంబై, జూలై 27:** జాతీయ భద్రత దృష్ట్యా కృత్రిమ మేధ(ఎఐ)కి ప్రభుత్వం మద్దతు అవసరమని ఒక నివేదిక తెలిపింది. పటిష్టమైన సైబర్‌సెక్యూరిటీ, బోర్డర్ సెక్యూరిటీ కోసం దీనిపై గణనీయంగా ఇన్వెస్ట్ చేయాలని, ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంది. 15 నగరాలకు చెందిన 200పైగా కంపెనీలతో నిర్వహించిన సర్వే ప్రాతిపదికన ఈ నివేదిక రూపొందించింది. జాతీయ భద్రత కోసం ప్రభుత్వం ఎఐకి క్రియాశీలకంగా మద్దతు నివ్వాలనే విషయంపై 'ఏకీభవిస్తున్నాను', 'మరింతగా ఏకీభవిస్తున్నాను' అనే ఆప్షన్లకు 86శాతం మంది సానుకూలంగా స్పందించినట్లు సంస్థ తెలిపింది. డిఫెన్స్‌లో ఎఐ ఆవిష్కరణల కోసం ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాలు, ప్రోత్సాహకాలు అవసరమని 14శాతం మంది అభిప్రాయపడ్డారు. పరిశ్రమలో ఎఐ అంతరా లను భర్తీ చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాలు ఉపయోగపడగలవని పేర్కొన్నారు. దేశ భద్రతను పటిష్టం చేసుకునే దిశగా ఎఐని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలంటే పాలసీపరంగా ఉన్న అనేక అంతరాలను ప్రభుత్వం, పరిశ్రమ పరిష్కరించుకోవాల్సి ఉంటుందని నివేదిక తెలిపింది. ఎలక్ట్రానిక్ యుద్ధాలు, సమాచార యుద్ధాలతో సవాళ్లు పెరిగిపోతున్న నేపథ్యంలో జాతీయ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి ఎఐ ఎంతో ఉపయోగకరమైన సాధనంగా ఉండగలదని కూడా పేర్కొంది. పరిశ్రమ గణాంకాల ప్రకారం 2024లో దేశీయంగా 23 లక్షలకుపైగా సైబర్ దాడులు చోటు చేసుకున్నాయి. వీటి వల్ల రూ.1200 కోట్ల మేర ఆర్థిక నష్టం వాటిల్లింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.